


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 168

గురువారం 8-9-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



గార్సియా గర్జన

తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీస్‌కు చేరిన ఫ్రాన్స్ క్రీడాకారిణి - **12లో**



వడ్డీరేట్ల పెంపు భయాలు

సెన్సెక్స్ నష్టం 168 పాయింట్లు 17,650 దిగువకు నిఫ్టీ - **13లో**



శాంతి నెలకొనాలి

రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతియుత వాతావరణం నెలకొనడానికి.. పూర్తి స్థాయిలో మద్దతిస్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

వివరాలు 6లో



గుర్తింపులేని పార్టీలపై ఐటీ కన్ను

రిజిస్టర్ అయినా గుర్తింపులేని పలు రాజకీయ పార్టీల కార్యాలయాలపై ఆదాయ పన్ను శాఖ దాడులు చేసింది.

వివరాలు 6లో



విచ్చలవిడిగా యాంటీబయోటిక్స్

భారత్‌లో 2019లో ఉపయోగించిన 47% పైగా యాంటీబయోటిక్స్‌కు ఎలాంటి అనుమతులు లేవని ఓ అధ్యయనంలో తేలింది.

వివరాలు 6లో



ఆన్‌లైన్ ట్రేడింగ్ ఎంత భద్రం?

ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు సంబంధించి స్కామర్లు చేసే మోసాలు, వారి చేతిలో మోసపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.

వివరాలు 11లో

4.72 లక్షల మంది విద్యార్థులకు ట్యాబ్‌లు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశంలో ఆమోదం

- రూ.606.18 కోట్ల ఖర్చుతో నవంబర్‌లో 8వ తరగతి పిల్లలకు పంపిణీ
- రూ.64.46 కోట్లతో 50,194 మంది టీచర్లకూ ట్యాబ్‌లు
- రూ.16,446 విలువైన ట్యాబ్ రివర్స్ టెండరింగ్‌లో రూ.12,843కే
- తద్వారా 5.22 లక్షల ట్యాబ్‌లలో రూ.187.84 కోట్లు ఆదా
- ఒక్కో విద్యార్థికి ఉచితంగా రూ.36,843 విలువైన ట్యాబ్, బైజూస్ కంటెంట్
- ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో దివ్యాంగులకు 4% రిజర్వేషన్లు
- ఈ నెల 22న మూడో విడత వైఎస్సార్ చేయూత
- సుమారు 25 లక్షల మంది మహిళలకు రూ.4,700 కోట్ల లబ్ధి
- వారం రోజుల పాటు మండల కేంద్రాల్లో మహిళా చేయూత పండుగ
- ఇంకా పలు కీలక నిర్ణయాలు.. మీడియాకు వివరాలు వెల్లడించిన మంత్రి చెల్లుబోయిన



రూ.1.25 లక్షల కోట్లతో పది పరిశ్రమలు

- మంత్రివర్గం ఆమోదం
- డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీకి 134 ఎకరాలు
- 679 మండలాల్లో ఏఆర్‌ఐ పోస్టులు డిప్యూటీ తహసీల్దార్‌గా అప్‌గ్రేడ్

2లో

దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

- దుష్టచతుష్టయం తీరును, వాస్తవాలను ప్రజలకు వివరించండి
- చంద్రబాబు, ఎల్లో మీడియా కుట్రలను బహిర్గతం చేయండి
- మంత్రులకు సీఎం దిశానిర్దేశం

2లో

మన పిల్లలు గ్లోబల్ స్టూడెంట్స్

- ప్రపంచంతో పోటీ పడేలా ప్రభుత్వ స్కూళ్లలో 8వ తరగతి విద్యార్థులకు ఎడ్యుటెక్ విద్య
- సీబీఎస్‌ఈ పరీక్షలకు ఇప్పటి నుంచే పిల్లలను తీర్చిదిద్దుతున్న సర్కారు
- రూ.1,923.20 కోట్ల ఖర్చుతో నాణ్యమైన విద్యకు బాటలు
- జగనన్న విద్యా కానుకలో భాగంగా నవంబర్ 15 తర్వాత ట్యాబ్‌ల పంపిణీ
- చెడిపోతే వారంలోగా మరమ్మతులు లేదా రీప్లేస్ చేసేలా ఒప్పందం

3లో

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 4,72,472 మంది విద్యార్థులకు రూ.606.18 కోట్లతో ట్యాబ్‌లు పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ విద్యార్థులకు పాఠాలు బోధించే 50,194 మంది ఉపాధ్యాయులకు సైతం రూ.64.46 కోట్లతో ట్యాబ్‌ల పంపిణీకి పచ్చ జెండా ఊపింది. ఇందుకు సుమారు రూ.670.64 కోట్లు ఖర్చవుతుందని అంచనా. నవంబర్‌లో వీటిని విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. ప్రతి ట్యాబ్‌లో 3 జీబీ ర్యామ్, 32 జీబీ మెమొరీ, అదనంగా 64 జీబీ మెమొరీ కార్డ్, మూడేళ్ల వారంటీ ఇవ్వనున్నారు. మార్కెట్‌లో రూ.16,446 విలువున్న ట్యాబ్‌ను రివర్స్ టెండరింగ్ ద్వారా రూ.12,843కే ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. మొత్తంగా రూ.187.84 కోట్లు ఆదా అవుతోంది. ట్యాబ్‌తో పాటు రూ.24 వేల విలువైన బైజూస్ కంటెంట్‌ను లోడ్ చేసి ఇవ్వనుంది. మొత్తంగా ఒక్కో విద్యార్థికి రూ.36,843 లబ్ధి కల్పించనుంది. తద్వారా ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2025లో పదో తరగతి పరీక్షలను సీబీఎస్‌ఈ విధానంలో రాయాలన్న లక్ష్యానికి అనుగుణంగా విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. బుధవారం సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ వివరాలను

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

'యాత్ర' మొదలైంది



కాంగ్రెస్ 'భారత్ జోడో యాత్ర' తమిళనాడులోని కన్యాకుమారిలో ప్రారంభమైంది. బీజేపీ, ఆరెస్సెస్ దేశాన్ని పథకం ప్రకారం మతం, భాష పేరిట విభజిస్తున్నాయంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దుయ్యబట్టారు.

వివరాలు 6లో ▸

నీట్ యూజీ ఫలితాల విడుదల



నీట్ యూజీ-2022 ఫలితాలు బుధవారం రాత్రి వెలువడ్డాయి. రాజస్థాన్‌కు చెందిన తనిష్క ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించగా.. ఏపీకి చెందిన ఎం.దుర్గ సాయి కీర్తి తేజ 12వ ర్యాంక్, ఎస్.వెంకటసాయి వైష్ణవి 15వ ర్యాంక్ కైవసం చేసుకున్నారు.

వివరాలు 6, 10లో ▸

నాడు-నేడు స్ఫూర్తితో..

'పీఎం శ్రీ' స్కూళ్లు

దేశంలో అన్ని వసతులతో 14,500కుపైగా స్కూళ్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం

- వసతులు, విద్యార్థుల నైపుణ్యాల పెంపు లక్ష్యం.. ఐదేళ్ల కాల పరిమితితో ప్రాజెక్టు అమలు
- మూడున్నరేళ్ల క్రితమే విద్యా సంస్కరణలకు సీఎం వైఎస్ జగన్ శ్రీకారం
- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతున్న సర్కార్
- డిజిటల్ తరగతులు, ఇంగ్లిష్, సైన్సు ల్యాబ్‌లు, టీవీలు ఏర్పాటు
- సర్వాంగ సుందరంగా 15,715 తొలివిడత స్కూళ్లు
- రెండో విడత పనులూ ఆరంభం

10లో

'బీ' కేటగిరీ భర్తీ బాధ్యత యాజమాన్యాలదే

- మెరిట్ ప్రాతిపదికన ఇంజినీరింగ్, ఫార్మా సీట్ల కేటాయింపు
- పారదర్శకంగా జరిగేలా ప్రత్యేక వెబ్‌పోర్టల్
- తిరగాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు సదుపాయం

14లో

క్లుప్తంగా

కొత్త పోస్టుల మంజూరుపై సచివాలయంలో సంబరాలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయంలో 85 అదనపు పోస్టులు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు బుధవారం సంబరాలు జరిపారు. వెలగపూడి సచివాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర సచివాలయంలో కొత్త పోస్టులు మంజూరు చేయాలని గత ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోలేదన్నారు. కానీ ప్రస్తుతం సీఎం జగన్ అడిగిన వెంటనే పోస్టులు మంజూరు చేసి ఉద్యోగులపై తనకున్న అభిమానాన్ని మరోసారి చాటుకున్నారని తెలిపారు. కేబినెట్ సమావేశంలో పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపారన్నారు. పదేళ్లుగా పదోన్నతులు లేకుండా పనిచేస్తున్న వారికి ఈ నిర్ణయం వల్ల మేలు జరుగుతుందన్నారు. సచివాలయ ఉద్యోగుల సంఘం తరఫున సీఎం జగన్‌కు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆయన చెప్పారు.

సూర్య, చంద్ర గ్రహణ రోజుల్లో..

12 గంటలు శ్రీవారి ఆలయం మూసివేత

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో అక్టోబర్ 25న సూర్యగ్రహణం, నవంబర్ 8న చంద్రగ్రహణం కారణంగా ఆయా రోజుల్లో 12 గంటల పాటు శ్రీవారి ఆలయ తలుపులు మూసివేస్తారు. ఈ మేరకు బ్రేక్ దర్శనం, శ్రీవాణి, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, ఇతర ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. సర్వదర్శనం భక్తులను మాత్రమే అనుమతిస్తారు. అక్టోబర్ 25న మంగళవారం సాయంత్రం 5.11 నుంచి 6.27 గంటల వరకు సూర్యగ్రహణం ఉంటుంది. ఈ కారణంగా ఉదయం 8.11 నుంచి రాత్రి 7.30 గంటల వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసి ఉంచుతారు. నవంబర్ 8న మంగళవారం మధ్యాహ్నం 2.39 నుంచి సాయంత్రం 6.27 గంటల వరకు చంద్రగ్రహణం ఉంటుంది. ఈ కారణంగా ఉదయం 8.40 నుంచి రాత్రి 7.20 గంటల వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసి ఉంచుతారు. కాగా, తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది.

లైంగికదాడి కేసులో ఇద్దరికి 20 ఏళ్లు జైలు



నిందితులు ఎల్లన్న, శివకళాధర్

కర్నూలు (లీగల్): యువతిపై లైంగిక దాడి కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ ఏడవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాల ప్రకారం... కర్నూలు తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామచంద్రానగర్‌కు చెందిన ఒక యువతి (23) తన తల్లికి అనారోగ్యంగా ఉండటంతో సోదరి సహాయంతో 2016, డిసెంబర్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. ఆమె తిరిగి ఇంటికి వెళ్లగా, మానసిక స్థితి సరిగా లేని తన తండ్రి కనిపించలేదు. దీంతో తమ కుటుంబానికి పరిచయస్తుడైన ఎల్లన్న(30) వద్దకు వెళ్లి తన తండ్రి గురించి అడిగింది. 'మీ తండ్రి డోన్ రోడ్డు వైపు వెళ్లాడు. తీసుకువద్దాం పదా..' అని ఆ యువతిని ఎల్లన్న తన బైక్‌పై ఎక్కించుకుని దూరంగా ముళ్లపొదల వైపు తీసుకువెళ్లి ఆపాడు. అక్కడకు శివకళాధర్(32) అనే వ్యక్తి వచ్చి తాను పోలీసునని బెదిరించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఎల్లన్న కూడా ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ కేసు విచారణలో యువతిపై ఇద్దరు లైంగిక దాడికి పాల్పడినట్లు రుజువైంది. దీంతో ఎల్లన్న, శివకళాధర్‌కు 20 ఏళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జి.భూపాల్‌రెడ్డి తీర్పు చెప్పారు. జరిమానా మొత్తాన్ని ఫిర్యాదికి ఇవ్వాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

ఇదండీ సంగతి



మొదటిది కష్టం లెండి! కనీసం పార్టీకి పనికొచ్చే పనిచేస్తున్నారు.. చాలు!!

శ్రీశైలానికి పెరిగిన వరద



శ్రీశైలం ప్రాజెక్టు మూడు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

2.86 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- నాగార్జున సాగర్‌కు 1.47 లక్షల క్యూసెక్కులు రాక
- సాగర్ నుంచి 1.46 లక్షల క్యూసెక్కులు విడుదల

శ్రీశైలం ప్రాజెక్ట్/ విజయపురిసౌత్/సత్రశాల(రెంటచింతల): శ్రీశైలం జలాశయానికి బుధవారం వరద ప్రవాహం పెరిగింది. జూరాల, సుంకేసుల నుంచి 2,86,738 క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలానికి వస్తోంది. ప్రవాహం పెరగడంతో 3 గేట్లను 10 అడుగుల మేరకు తెరచి 83,949 క్యూసెక్కులు నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాల నుంచి 65,197 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 15 వేల క్యూసెక్కులు, హంద్రీ నీవా సుజల స్రవంతికి 1,688 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 800 క్యూసెక్కులు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 214.36 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ నీటిమట్టం 884.80 అడుగులకు చేరుకుంది. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ జలాశయానికి 1,47,009 క్యూసెక్కుల నీరు వస్తోంది. సాగర్ జలాశయం నుంచి 1,46,629 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 16 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా 96,444 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 32,805 క్యూసెక్కులు.. మొత్తం 1,29,249 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వలు, వరద కాల్వ, ఎస్ఎల్‌బీసీల ద్వారా 17,380 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు సాగర్ జలాశయం నీటిమట్టం 589.40 అడుగులుండగా 310.2522 టీఎంసీలు నీరు ఉంది.



నాగార్జునసాగర్ 16 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

రూ. 1.25 లక్షల కోట్లతో పది పరిశ్రమలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన మంత్రివర్గం ఆమోదం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా రూ.1.25 లక్షల కోట్లతో పది పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నెల 5వ తేదీన సీఎం అధ్యక్షతన జరిగిన స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పరిశ్రమల శాఖ పరిధిలో నాలుగు, విద్యుత్ శాఖ పరిధిలో ఐదు, పర్యాటక శాఖ పరిధిలో ఒకటి చొప్పున మొత్తంగా పది పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పరిశ్రమల ఏర్పాటు ద్వారా ప్రత్యక్షంగా 40 వేల మందికి, పరోక్షంగా 60 వేల మందికి ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం ఇంకా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ వివరాలను బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మీడియాకు వివరించారు.



మంత్రి మండలి సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

జడ్జిలకు వ్యక్తిగత కార్యదర్శి

- రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులకు, రిజిస్ట్రార్లకు 71 కోర్టు మాస్టర్లు, పర్సనల్ సెక్రటరీ పోస్టుల నియామకానికి ఆమోదం. నెల్లూరు, కర్నూలు, విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాల్లో శాశ్వత లోక్ అదాలత్‌ల ఏర్పాటుకు ఆమోదం. ఆయా లోక్ అదాలత్‌ల పరిధిలో 40 పోస్టుల భర్తీ.
- ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించిన 175 మంది ఖైదీలతో పాటు మరో 20 మంది ఖైదీలకు క్షమాభిక్ష పెట్టాలన్న నిర్ణయానికి ఆమోదం.
- నంద్యాల, నెల్లూరు, శ్రీసత్యసాయి, బాపట్ల, విశాఖపట్నం జిల్లాలలో వివిధ ప్రభుత్వ శాఖలకు, కార్పొరేషన్లు, ఇతర సంస్థలకు అవసరమైన ప్రభుత్వ భూములను కేటాయించాలన్న నిర్ణయానికి ఆమోదం. ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రతిపాదనల మేరకు పారిశ్రామిక పార్కులు, వివిధ సంస్థలకు భూమి కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోదం తెలిపింది.
- శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలో వెటర్నరీ పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటుకు అవసరమైన 30 ఎకరాల ప్రభుత్వ భూమిని ఉచితంగా కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోదం లభించింది.
- శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో బంజారా సేవా సంఘానికి ఎస్టీ కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు అవసరమైన 44 సెంట్ల భూమి కేటాయింపుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.
- వైఎస్సార్ జిల్లా అమీన్ పీర్ దర్గాకు వివిధ సర్వే నెంబర్లలో 16.86 ఎకరాల స్థలాన్ని ఈద్గా, అనాథ సదనం కోసం కేటాయిస్తూ నిర్ణయం. ఎకరా రూ.లక్ష చొప్పున కేటాయించాలని నిర్ణయం.
- వైఎస్సార్ జిల్లా కడప మండలం చిన్న చౌక్‌లో 134 ఎకరాలను డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ కోసం కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోదం.
- వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్ లిమిటెడ్ కోసం భూములిచ్చిన 379 మంది అసైనీ పట్టాదారులకు అసైన్‌మెంట్ కమిటీ నిర్ణయం మేరకు పరిహారం చెల్లించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- ప్రకాశం జిల్లా రుద్రసముద్రంలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన 1454.06 ఎకరాల భూమిని ఏపీజీఈసీఎల్‌కు అప్పగిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోదం.

కొత్తగా చింతూరు రెవెన్యూ డివిజన్

- అల్లూరి సీతారామరాజు జిల్లాలో చింతూరు ప్రధాన కేంద్రంగా నూతన రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ఆమోదం.
- విశాఖ జిల్లా ఆనందపురం మండలం గంభీరంలో రహదారులు, భవనాల శాఖకు 23.73 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ నిర్ణయం.
- రాష్ట్ర వ్యాప్తంగా 679 రెవెన్యూ మండలాల్లో ఏఆర్ఐ (అడిషనల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్) లేదా సీనియర్ అసిస్టెంట్ పోస్టులను డిప్యూటీ తహసీల్దార్ పోస్టు కేడర్‌కు అప్‌గ్రేడ్ చేస్తూ తీసుకున్న నిర్ణయానికి కేబినెట్ ఆమోదం. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న భూముల రీ-సర్వే, గ్రామ కంఠం భూముల రికార్డింగ్ ప్రక్రియ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి. సర్వే ప్రక్రియ పూర్తయ్యేంత వరకు లేదా గరిష్టంగా రెండేళ్లు వర్తించేట్టుగా లేదా రెండింటిలో ఏది ముందు పూర్తయితే ఆ మేరకు ఈ నిర్ణయం అమలు.
- వైఎస్సార్ జిల్లా చిన్నచౌక్‌లో 17 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన 95 ఎకరాల భూమిని మున్సిపల్ శాఖకు కేటాయిస్తూ నిర్ణయం.
- శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం పెద్దకోట్ల, తాటితోట గ్రామాల్లో 304.15 ఎకరాల భూమిని 500 మెగావాట్ల పంప్డ్, హైడ్రో స్టోరేజ్ పవర్ ప్లాంటు ఏర్పాటు కోసం ఎన్ఆర్ఈడీసీఏపీకి కేటాయింపు.
- ఆంధ్రప్రదేశ్ టెనెన్సీ యాక్ట్ - 1956కు సంబంధించిన ప్రతిపాదన బిల్లుకు ఆమోదం.
- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో వీరబల్లి మండలం, ఒంగిమల్లలో 1800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్, హైడ్రో పవర్ ప్లాంటు ఏర్పాటుకు ఆస్త్రా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ లిమిటెడ్‌కు అనుమతులు మంజూరు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం.
- అరబిందో రియాల్టీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ 1600 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్, హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆమోదం.
- ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మెగా ఇండస్ట్రియల్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతిస్తూ ఆమోదం.
- గ్రీన్‌కోకు సోలార్, విండ్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన భూమిని కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోదం.
- కర్నూలు జిల్లా నంద్యాలలో ఆర్సిలర్ మిట్టల్ గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేయనున్న 700 మెగావాట్ల సోలార్ పవర్, 300 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టులకు అవసరమైన భూమి కేటాయింపులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- రెన్యూవబుల్ ఎక్స్‌పోర్ట్ పాలసీ 2020 సవరణలకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం.

రాష్ట్రంలో పెరిగిన ఆహార ధాన్యాల ఉత్పత్తి

- ప్రస్తుత ఖరీఫ్ సందర్భంగా రాష్ట్రంలో 438 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావడంపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. ఇప్పటి వరకు ఈ ఖరీఫ్‌లో 82 శాతం నాట్లు పూర్తయ్యాయని, మిగిలిన చోట్ల వ్యవసాయ పనులు ఊపందుకున్నట్టు మంత్రివర్గం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. రాష్ట్రంలో 2014–15 నుంచి 2018–19 వరకు సగటున 153 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి జరగ్గా.. 2019 నుంచి వరుసగా మూడేళ్లు సగటున ఏడాదికి 13 లక్షల టన్నులకు ఉత్పత్తులు పెరిగి 166.73 లక్షలకు చేరడంపై మంత్రివర్గం హర్షం వ్యక్తం చేసింది.
- ప్రస్తుత ఖరీఫ్‌లో సబ్సిడీ ద్వారా 5.05 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలు సరఫరా చేశామని, ఖరీఫ్ అవసరాలకు 19 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉండగా, 18 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు.
- రాష్ట్రంలో ఎక్కడా ఎరువులకు కొరత లేదని, ఆర్బీకేల ఏర్పాటు ద్వారా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్టు చర్చ జరిగింది. ఆర్బీకే విధానాలను ప్రపంచ బ్యాంకు ప్రశంసించడంపై మంత్రివర్గం ఆనందం వ్యక్తం చేసింది. ప్రస్తుత ఏడాదిలో వైఎస్సార్ యంత్ర సేవా పథకానికి రూ.2,235 కోట్లు ఖర్చు చేస్తోంది.
- మరోవైపు కోవిడ్ పరిస్థితుల్లోనూ మన రాష్ట్రం దేశంలోని మిగిలిన అన్ని రాష్ట్రాల కన్నా అత్యధికంగా 11.43 శాతం వృద్ధి రేటు సాధించడంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రివర్గం అభినందనలు తెలియజేసింది.

4.72 లక్షల మంది విద్యార్థులకు ట్యాబ్‌లు

▶ మొదటి పేజీ తరువాయి

బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మీడియాకు వివరించారు.

22న వైఎస్సార్ చేయూత

- ఈ నెల 22వ తేదీన వైఎస్సార్ చేయూత పథకం మూడో విడతలో భాగంగా రాష్ట్రంలోని సుమారు 25 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు రూ.4,700 కోట్లు మొత్తాన్ని అందజేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా వారం రోజుల పాటు.. 23వ తేదీ నుంచి 29 వరకు మండల స్థాయిలో మహిళా చేయూత పండుగ పేరుతో కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. ప్రతి ఎమ్మెల్యే స్వయంగా ఈ కార్యక్రమాలకు హాజరై మహిళలకు స్వయంగా చెక్కులు అందజేస్తారు.
- ఈ పథకం ద్వారా మహిళా సాధికారత, సంక్షేమమే లక్ష్యంగా 45 - 60 సంవత్సరాల మధ్య వయస్సున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు స్వయం ఉపాధి, సుస్థిర ఆర్థిక ప్రగతి కోసం ఏటా ప్రభుత్వం రూ.18,750 చొప్పున వరుసగా నాలుగేళ్లలో రూ.75 వేల ఆర్థిక సాయం చేస్తుంది. ఇప్పటి వరకు ప్రభుత్వం రెండు విడతల్లో రూ.9,179.67 కోట్లు మహిళలకు ఆర్థిక సహాయం అందజేసింది. మూడో విడత కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ఈ నెల 22వ తేదీన ప్రారంభిస్తారు.

అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పన

- అమరావతిలో ఫేజ్ -1లో మౌలిక సదుపాయాల కల్పన పనులకు రూ.1,600 కోట్ల రుణానికి సంబంధించి ప్రభుత్వం బ్యాంక్ గ్యారంటీ ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఏపీసీఆర్డీఏ యాక్టు -2104, ఏపీఎంఆర్ అండ్ యూడీఏ యాక్ట్ - 2016లో సవరణలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



- గాలేరు నగరి సుజల స్రవంతి ప్రధాన కాలువ ఎర్త్ వర్క్‌లకు పరిపాలనా పరమైన అనుమతులకు.. గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు ఇచ్చిన విధంగానే పైడిపాలెం ప్రాజెక్టు పరిధిలో పైడిపాలెం, కుమరంపల్లి గ్రామాలకు చెందిన నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి ఆమోదం తెలిపింది.
- శ్రీకాకుళం జిల్లా భావనపాడు పోర్టు ప్రస్తుత పరిధిని పెంచుకోవడానికి అనుమతి. దీని ద్వారా 10 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది. ఈ పోర్టు ద్వారా ఏడాదికి 23.5 మిలియన్ టన్నుల కార్గో హేండిల్ చేసే సామర్థ్యం ఉంటుంది.
- పరిశ్రమలు, వాణిజ్య శాఖ పరిధిలో సెకండరీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం అవసరమైన రూ.1000 కోట్ల రుణాన్ని ఎస్ఐడీబీఐ నుంచి పొందేందుకు ప్రభుత్వం నుంచి బ్యాంక్ గ్యారంటీ పొడిగించేందుకు ఆమోదం లభించింది.
- పారిశ్రామికాభివృద్ధి తోడ్పాటులో భాగంగా అనంతపురం జిల్లాలో కియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు రాయితీలు.. ఏపీఐఐసీ, కియా మధ్య జరిగిన ఒప్పందంలో భూమి కేటాయింపులకు సంబంధించిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, ట్రాన్స్‌ఫర్ డ్యూటీలను మినహాయిస్తూ ఆమోదం తెలిపింది.
- తిరుపతి జిల్లా పేరూరులో నోవాటెల్ బ్రాండ్ ఫైవ్‌స్టార్ హోటల్, ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్‌ల నిర్మాణం, అభివృద్ధి కోసం ఒబెరాయ్ గ్రూపునకు 30.32 ఎకరాల భూమి కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

గ్రేటర్ విశాఖ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం

- పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ విశాఖ పరిధిలో 96,250 ఇళ్లు, అనకాపల్లిలో 3,750 ఇళ్ల నిర్మాణానికి పరిపాలన పరమైన అనుమతుల మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పీఎంఏవై- వైఎస్సార్ అర్బన్ హౌసింగ్ కింద విశాఖపట్నంలో ఇళ్ల కేటాయింపుల ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.8 లక్షల నుంచి రూ.15 లక్షలు లబ్ధి చేకూరనుంది.
- ఆరు ఉమ్మడి జిల్లాల పరిధిలో తాగునీటి సరఫరాకు సంబంధించి రూ.8,040 కోట్లతో చేపట్టే ప్రాజెక్టుకు సంబంధించి నాబార్డు ద్వారా రూ.4,020 కోట్లు రుణ సదుపాయం కోసం ప్రభుత్వ గ్యారంటీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ప్రొబేషన్ డిక్లేర్ చేస్తూ ప్రభుత్వం గతంలో తీసుకున్న నిర్ణయాన్ని, 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ, వార్డు సచివాలయాలకు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరును ఆమోదించింది.

ఉద్యోగాలు, పదోన్నతుల్లో దివ్యాంగులకు పెద్దపీట

- ప్రతి ప్రభుత్వ విభాగంలో ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో దివ్యాంగులకు ప్రస్తుతం ఉన్న 3 శాతం రిజర్వేషన్‌ను 4 శాతానికి పెంచడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- విశ్వవిద్యాలయాలకు సంబంధించి పలు చట్టాల సవరణకు అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న ప్రతిపాదన బిల్లుకు, ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల నియామకంలో నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్ ఖచ్చితంగా పాసవ్వాలన్న నిబంధనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విద్యా వ్యవస్థల్లో నాణ్యతను మెరుగు పరచడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు.
- నంద్యాల జిల్లా పాణ్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుతో పాటు ప్రస్తుతం ఉన్న జూనియర్ కళాశాల ప్రాంగణంలోనే డిగ్రీ కళాశాల మంజూరుకు ఆమోదం. కొత్తగా ఏర్పాటు కానున్న డిగ్రీ కళాశాలలో 24 మంది రెగ్యులర్ బోధనా సిబ్బంది, ఆవుట్ సోర్సింగ్ విధానంలో మరో ఆరుగురు బోధనేతర సిబ్బంది నియామకానికి ఆమోదం తెలిపింది.
- పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో ట్రిబల్ ఇంజనీరింగ్ కళాశాలలో 80 మంది రెగ్యులర్ బోధనా సిబ్బంది, ఆరుగురు రెగ్యులర్ నాన్ టీచింగ్ సిబ్బంది, మరో 48 మంది నాన్ టీచింగ్ సిబ్బందిని అవుట్ సోర్సింగ్ విధానంలో నియమించడానికి అనుమతి.
- ప్రకాశం జిల్లా దోర్నాలలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెగ్యులర్ విధానంలో 25 మంది బోధనా సిబ్బంది, ఆరుగురు బోధనేతర సిబ్బంది ఔట్ సోర్సింగ్ విధానంలో నియామకానికి మంత్రివర్గం ఆమోదం.
- రాష్ట్ర సచివాలయంలో సాధారణ పరిపాలన విభాగంలో వివిధ కేడర్లలో 85 అదనపు పోస్టుల మంజూరు.
- పటిష్టమైన నిర్వహణ, పర్యవేక్షణ కోసం మున్సిపల్ స్కూళ్ల పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయులను పాఠశాల విద్యాశాఖ పరిధిలోకి మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోదం.
- ఏపీ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆసుపత్రుల్లో స్టాఫింగ్ పేట్రన్‌ను మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయానికి, రహదారులు- భవనాల శాఖలోని స్టేట్ ఆర్కిటెక్ట్ విభాగాన్ని బలోపేతం చేస్తూ వివిధ విభాగాల్లో 8 పోస్టుల మంజూరుకు నిర్ణయం.
- గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హార్టికల్చర్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్ పోస్టు ఏర్పాటు చేస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోదం.

దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

దుష్టచతుష్టయం తీరును, వాస్తవాలను ప్రజలకు వివరించండి

- చంద్రబాబు, ఎల్లో మీడియా కుట్రలను బహిర్గతం చేయండి
- మంత్రులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిశానిర్దేశం

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఎల్లో మీడియాతో కూడిన దుష్టచతుష్టయం చేస్తున్న దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని మంత్రులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. వాస్తవాలను ప్రజలకు వివరించి, దుష్టచతుష్టయం కుట్రలను బహిర్గతం చేయాలని ఉద్బోధించారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో బుధవారం సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశమైంది. అజెండాలోని అంశాలపై చర్చ ముగిశాక సమావేశం నుంచి అధికారులు బయటకువెళ్లారు. ఆ తర్వాత మంత్రులతో రాజకీయ పరిస్థితులపై సీఎం వైఎస్ జగన్ చర్చించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేశామని.. దేశ చరిత్రలో ఎక్కడా, ఎన్నడూ లేని రీతిలో సంక్షేమ పథకాల ద్వారా రూ.1.70 లక్షల కోట్లను డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని వివరించారు. కులం, మతం, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా.. అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించామని చెప్పారు. రాష్ట్రంలో 87 శాతం కుటుంబాల ప్రజలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు.

జీఎస్‌డీపీలో అగ్రగామిగా ఉన్నాం

స్థూల రాష్ట్రీయ ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో దేశంలో రాష్ట్రం అగ్రగామిగా ఉందని, 11.43 శాతం వృద్ధి రేటు సాధించిందని సీఎం వైఎస్ జగన్ గుర్తు చేశారు. దాంతో ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని.. వరుసగా జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడమే అందుకు నిదర్శనమన్నారు. దీన్ని జీర్ణించుకోలేని చంద్రబాబు, ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, టీవీ5 నాయుడులతో కూడిన దుష్టచతుష్టయం ఒక అబద్ధాన్ని పదే పదే చెప్పి.. అదే నిజమని ప్రజలను నమ్మించేలా సమన్వయంతో దుష్ప్రచారాన్ని చేస్తోందని ఎత్తిచూపారు. వీరికి దత్తపుత్రుడు కూడా తోడయ్యారని గుర్తు చేశారు. అభూత కల్పనలు, అవాస్తవాలతో ప్రభుత్వంపై బురదజల్లుతూ.. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ దుష్ప్రచారాన్ని ఎక్కడికక్కడ.. ఎప్పటికప్పుడు తిప్పికొట్టడంలో ఏమాత్రం అశ్రద్ధ చేయొద్దని దిశా నిర్దేశం చేశారు. ప్రజలకు వాస్తవాలను కళ్లకు కట్టినట్లు వివరించి.. దుష్టచతుష్టయం కుట్రలను బట్టబయలు చేయాలని పిలుపునిచ్చారు. నిజాలను మనం ప్రజలకు వెల్లడించకపోతే.. దుష్టచతుష్టయం చేస్తున్న అసత్య ప్రచారమే నిజమని నమ్మే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ప్రజలకు వాస్తవాలను ఎప్పటికప్పుడు వివరించి చైతన్య పరచాలని ఆదేశించారు.

దిగజారిన ప్రతిపక్షం, ఎల్లో మీడియా

- సీఎం, ఆయన కుటుంబ సభ్యుల వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడమే వారి అజెండా: మంత్రి చెల్లుబోయిన

సాక్షి, అమరావతి: ప్రతిపక్షాలు, వాళ్లకు కొమ్ము కాస్తున్న కొన్ని మీడియా సంస్థలు మరింత హీన స్థితికి దిగజారి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడమే ప్రధాన అజెండాగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మండిపడ్డారు. బుధవారం ఆయన రాష్ట్ర మంత్రివర్గ సమావేశ నిర్ణయాలు వెల్లడిస్తూ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ సీఎం కాక ముందు కూడా 2011 నుంచే ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా వైఎస్ కుటుంబ సభ్యుల వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే తప్పుడు ప్రచారం కొనసాగించాయని గుర్తు చేశారు. రాజకీయాల జోలికేరాని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి భారతి గురించి కొత్తగా ఆరోపణలు చేయడం మొదలు పెట్టారని తప్పుబట్టారు. చంద్రబాబు అసెంబ్లీలో తన భార్యను ఎవరో ఏదో అన్నారని విలేకరుల సమావేశంలో వెక్కి వెక్కి ఏడ్చారని.. అసలు చంద్రబాబు భార్యను ఎవరు ఏమన్నారో కూడా తెలియని పరిస్థితుల్లోనే అంతగా బాధపడిన ఆయన.. ఇప్పుడు ముఖ్యమంత్రి భార్య గురించి తప్పుడు ఆరోపణలు చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు.

లిక్కర్‌కు అనుమతులిచ్చింది బాబే

ఎవరి హయాంలో ఎవరెవరికి మద్యం అనుమతులు మంజూరు చేశారన్నది మర్చిపోయి ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని మంత్రి దుయ్యబట్టారు. ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మద్యం అనుమతులు మంజూరు చేసిన చరిత్ర చంద్రబాబుదేనని ధ్వజమెత్తారు. ఆ సమయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, వారి అనుచరులకు మద్యం కంపెనీల అనుమతులు మంజూరు చేశారన్నారు. చంద్రబాబు తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజలకు ఏమి చేశారో చెప్పుకోవడానికి ఏమీ లేకనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని తూర్పారపట్టారు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో ఎక్కడన్నా ప్రజలు ఏదైనా కావాలని అడిగితే.. అది ప్రభుత్వ వ్యతిరేకమన్నట్టు ప్రచారం చేసుకుంటూ ఆనందం పొందుతుండటం విడ్డూరం అన్నారు.

క్లుప్తంగా

ప్రైవేటు స్కూళ్లకు అందుబాటులో పాఠ్యపుస్తకాలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వం రూపొందించిన పాఠ్యపుస్తకాలు ప్రైవేటు పాఠశాలలకు అమ్మకానికి అందుబాటులో ఉన్నాయని, ఎంఈవోలు, జిల్లాల పుస్తక గోడౌన్ల మేనేజర్లను సంప్రదించి తీసుకెళ్లవచ్చని ప్రభుత్వ పాఠ్య పుస్తకాల ప్రచురణ, ముద్రణ విభాగం డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలలు అందించిన ఇండెంట్ ప్రకారం 2022–23 విద్యా సంవత్సరానికి 1 నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లీషు మీడియం పాఠ్య పుస్తకాలు 1,81,82,913 అమ్మకానికి సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

ఏపీ పీజీ సెట్-22 మూడో రోజు ప్రశాంతం

వైవీయూ: ఆంధ్రప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశ పరీక్షలు బుధవారం మూడో రోజు ఆంధ్రాలోని 13 సెంటర్లు, హైదరాబాద్‌లోని ఒక కేంద్రంలో నిర్వహించారు. ఈ పరీక్షలకు 11,402 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం నిర్వహించిన లిటరేచర్, కెమికల్ సైన్స్ పరీక్షలకు 9,942 మందికి గాను, 8,714 మంది (87.75 శాతం) హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ఎకనామిక్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షలకు 1,619 మందికి గాను, 1,370 మంది (84.62 శాతం), సాయంత్రం మూడో సెషన్‌లో హిస్టరీ, ఎడ్యుకేషన్, స్టాటిస్టిక్స్ పరీక్షలకు 1,618 మందికి గాను, 1,318 మంది (81.46) హాజరయ్యారు. ఈ పరీక్షల నిర్వహణను ఏపీ పీజీసెట్-22 చైర్‌పర్సన్ ఆచార్య మునగాల సూర్యకళావతి, ఏపీ ఉన్నత విద్యామండలి కార్యదర్శి, సెట్ కన్వీనర్ ఆచార్య వై.నజీర్ అహ్మద్ వైవీయూలోని కమాండ్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షించారు. మూడో రోజు పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయని ఆచార్య వై.నజీర్ అహ్మద్ తెలిపారు.

బి.ఆర్క్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

ఏఎఫ్‌యూ: రాష్ట్రవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల్లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బి.ఆర్క్)లో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. ఈ విషయాన్ని ఏపీ బి.ఆర్క్ ప్రవేశాల కన్వీనర్, డాక్టర్ వైఎస్సార్ ఏఎఫ్‌యూ రిజిస్ట్రార్ ఈసీ సురేంద్రనాథ్‌రెడ్డి బుధవారం తెలిపారు. 2022–23 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు ఇంటర్ లేదా డిప్లొమా(10+3) పూర్తి చేసి.. నాటా(నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్), జేఈఈ మెయిన్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 12వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలన, వెబ్ ఆప్షన్లు, ఫీజుల చెల్లింపు ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(ఏయూ)లో 44 సీట్లు, గుంటూరులోని ఏఎన్‌యూ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్‌లో 44 సీట్లు, విశాఖలోని వరాహ కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్‌లో 32 సీట్లు, భీమవరంలోని ఎం.ఆర్.కె.కాలేజ్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌లో 16 సీట్లు, కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీలో 44 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

మాతృభాషను ప్రోత్సహించాలి

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



కొమ్మాది (భీమిలి): మాతృభాషను ప్రాచుర్యంలోకి తీసుకువచ్చి ప్రోత్సహించాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కోరారు. బుధవారం విశాఖ రుషికొండలో మిత్రులు, శ్రేయోభిలాషులు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. మాతృభాషను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే దేశంలోని 22 భాషల్లో ఏ భాషలోనైనా రాజ్యసభలో మాట్లాడే అవకాశం కల్పించానన్నారు. నూతన విద్యా విధానంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయని.. వాటిని విద్యార్థులు ఆకళింపు చేసుకోవాలని పిలుపునిచ్చారు. మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ కేసులో జనసేన జెడ్పీటీసీ



జయప్రకాష్‌నాయుడు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఫోర్జరీ పత్రాలతో నకిలీ బ్యాంకు గ్యారెంటీలు సమర్పించి రొయ్యలు, చేప పిల్లల సరఫరా టెండర్లు దక్కించుకున్న వ్యవహారంలో పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం జెడ్పీటీసీ, జనసేన నాయకుడు గుండా జయప్రకాష్ నాయుడు బృందంపై తెలంగాణ ప్రభుత్వ అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలకు సిద్ధమవుతున్నారు. తెలంగాణలోని 32 జిల్లాల్లోని చెరువుల్లో ఉచితంగా చేప పిల్లలు, రొయ్యలను వదిలేందుకు ఆ రాష్ట్ర మత్స్యశాఖ సుమారు రూ.113 కోట్లతో టెండర్లను ఆహ్వానించింది. భీమవరానికి చెందిన జనసేన నాయకుడు గుండా జయప్రకాష్ నాయుడు పలువురి పేర్లతో తెలంగాణలో 9 నుంచి 12 జిల్లాల్లో టెండర్లు దాఖలు చేసి దక్కించుకున్నాడు. అయితే, బ్యాంకు గ్యారెంటీ, పర్ఫామెన్స్ గ్యారెంటీల విషయంలో మోసానికి పాల్పడ్డాడు. దీనిపై ఫిర్యాదులు అందడంతో తెలంగాణ ప్రభుత్వం విచారణ చేపట్టింది. బ్యాంకు గ్యారెంటీ నకిలీవని, అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసినట్లు గుర్తించారు.



మన పిల్లలు గ్లోబల్ స్టూడెంట్స్

ప్రపంచంతో పోటీ పడేలా ప్రభుత్వ స్కూళ్లలో 8వ తరగతి విద్యార్థులకు ఎడ్యుటెక్ విద్య

సీబీఎస్ఈ పరీక్షలకు ఇప్పటి నుంచే పిల్లలను తీర్చిదిద్దుతున్న సర్కారు

- 4.72 లక్షల మంది 8వ తరగతి పిల్లలకు రూ.606.18 కోట్లతో ట్యాబ్‌లు
- 8వ తరగతి పాఠాలు బోధించే 50,194 మంది టీచర్లకు రూ.64.46 కోట్లతో ట్యాబ్‌లు
- రూ.16,446 విలువైన ట్యాబ్‌ను రూ.12,843కే కొనుగోలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- తద్వారా 5.22 లక్షల ట్యాబ్‌లలో రూ.187.84 కోట్లు ఆదా
- ఒక్కో విద్యార్థి, టీచర్‌కు ఉచితంగా రూ.36,843 విలువైన ట్యాబ్, బైజూస్ కంటెంట్
- జగనన్న విద్యా కానుకలో భాగంగా ఈ ఏడాది నవంబర్ 15 తర్వాత పంపిణీ

సాక్షి, అమరావతి: విద్యా పరంగా ప్రపంచంతో పోటీ పడేలా మన పిల్లలను తీర్చిదిద్దాలనే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం, చిత్తశుద్ధి, ఆశయంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ప్రభుత్వ స్కూళ్లలో 8వ తరగతి చదివే పిల్లలు సీబీఎస్ఈ బోర్డు (పదో తరగతి) పరీక్షలు సమర్థవంతంగా రాసేలా ఇప్పటి నుంచే తీర్చిదిద్దుతోంది. టెక్నాలజీ ఆధారిత నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ప్రభుత్వ స్కూళ్లలో 8వ తరగతి చదివే 4.72 లక్షల మంది పిల్లలకు రూ.606.18 కోట్ల వ్యయంతో, 8వ తరగతి పాఠాలు చెప్పే 50,194 మంది టీచర్లకు రూ.64.46 కోట్లతో ప్రముఖ కంపెనీ శ్యామ్‌సంగ్ ట్యాబ్‌లను ఉచితంగా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రధానంగా అతి పెద్ద ఎడ్యుకేషనల్ టెక్ కంపెనీ బైజూస్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కంపెనీ ఉచితంగా కంటెంట్‌ను ఇవ్వనుంది.

రివర్స్ టెండరింగ్‌తో మార్కెట్ ధర కంటే తక్కువ

- జగనన్న విద్యా కానుకలో భాగంగా ఈ ఏడాది నవంబర్ 15 తర్వాత 8వ తరగతి విద్యార్థులు, టీచర్లకు ట్యాబ్‌లు పంపిణీ చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. శ్యామ్‌సంగ్ ట్యాబ్‌లను అత్యంత పారదర్శకంగా, రివర్స్ టెండరింగ్ ద్వారా బయట మార్కెట్ కన్నా తక్కువ ధరకు కొనుగోలు చేస్తోంది.



- మెమొరీ కార్డుతో సహా మూడేళ్ల వారంటీ వంటి ఫీచర్స్ అన్నీ కలిపితే బయట మార్కెట్‌లో శ్యామ్‌సంగ్ ఒక్కో ట్యాబ్ ఖరీదు రూ.16,446 చొప్పున.. 5.22 లక్షల ట్యాబ్‌లకు రూ.858.48 కోట్ల వ్యయం అవుతుంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ ద్వారా పారదర్శకంగా వ్యవహరించడంతో ఒక్కో ట్యాబ్‌ను రూ.12,843 చొప్పున 5.22 లక్షల ట్యాబ్‌లను రూ.670.64 కోట్లతో కొనుగోలు చేస్తోంది. ఈ లెక్కన రూ.187.84 కోట్లు ఆదా చేసింది.
- 5.22 లక్షల మంది 8వ తరగతి పిల్లలు, టీచర్లకు రూ.1,923.20 కోట్ల విలువైన బైజూస్ కంటెంట్‌ను, శ్యామ్‌సంగ్ ట్యాబ్‌లను ప్రభుత్వం ఉచితంగా ఇస్తోంది. ఒక్కో విద్యార్థికి, టీచర్‌కు రూ.24 వేల విలువైన బైజూస్ కంటెంట్, రూ.12,843 ట్యాబ్ కలిపి మొత్తం రూ.36,843 విలువైన మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తోంది.

ట్యాబ్‌ల ప్రత్యేకతలు ఇవీ..

- ట్యాబ్‌లు, బ్యాటరీకి మూడేళ్ల వారంటీ (సాధారణంగా ఏడాది మాత్రమే) ఉంటుంది.
- మొబైల్ డివైజ్ మేనేజ్‌మెంట్ (ఎండీఎం), ఓటీజీ కేబుల్, ఫ్లిప్ కవర్‌తో 8.7 అంగుళాలు ఉంటుంది.
- పిల్లలు చూడకూడని సైట్‌లు బ్లాక్ చేసే సాఫ్ట్‌వేర్‌ను ట్యాబ్‌లలో లోడ్ చేసి ఇస్తారు. తద్వారా పిల్లలు అవాంఛనీయ సైట్ల జోలికి వెళ్లే అవకాశం ఏ కోశానా ఉండదు.
- కంటెంట్ డేటా కార్డుతో పాటు 64 జీబీ మెమొరీ కార్డు.
- ఏటా పదవ తరగతి వరకు విద్యార్థులకు ఇదే ట్యాబ్‌లో బైజూస్ కంటెంట్ అప్‌లోడ్ చేసి ఇస్తారు.
- ప్రతి ఏటా ప్రభుత్వ స్కూళ్లలో 8వ తరగతి చదివే విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్, బైజూస్ కంటెంట్ ఇస్తారు.
- ఏదైనా రిపేరు వస్తే గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇస్తే.. వారంలోగా సరిచేసి లేదా రీప్లేస్ చేసి ఇచ్చేలా ఒప్పందం చేసుకుంది. ఇందుకోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. బ్యాటరీ పాడైపోయినా రీప్లేస్ చేయనున్నారు.
- విజువల్ గ్రాఫిక్స్‌తో కూడిన కంటెంట్‌ను ట్యాబ్‌లో అప్‌లోడ్ చేయడంతో పిల్లలు సులభంగా అర్థం చేసుకోనున్నారు.

బైజూస్‌తో ఒప్పందంలో ముఖ్యాంశాలు

- ప్రభుత్వ స్కూళ్లలో 4 నుంచి 10వ తరగతి వరకు దాదాపు 32 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. బైజూస్‌తో ఒప్పందంతో వీరందరికీ లెర్నింగ్ యాప్ ద్వారా నాణ్యమైన విద్య అందుతుంది.
- 2025 నాటికి పదో తరగతి విద్యార్థులు, అంటే ఇప్పటి 8వ తరగతి విద్యార్థులు సీబీఎస్ఈ నమూనాలో పరీక్షలు రాసేందుకు వీలుగా వారిని సన్నద్ధం చేసేందుకు ఈ యాప్‌తోపాటు అదనంగా ఇంగ్లిష్ లెర్నింగ్ యాప్ కూడా ఉచితంగా అందుబాటులోకి వస్తోంది.
- బైజూస్ లెర్నింగ్ యాప్‌లో బోధన అత్యంత నాణ్యతగా ఉంటుంది. యానిమేషన్, బొమ్మలు, గ్రాఫ్స్ ద్వారా విద్యార్థులు మరింత సులభంగా, క్షుణ్ణంగా, సమగ్రంగా అర్థం చేసుకోవడానికి వీలుంటుంది.
- మ్యాథ్స్, సైన్స్, సోషల్ స్టడీస్ ఈ సబ్జెక్టులన్నీ ఇటు ఇంగ్లిష్, అటు తెలుగు మాధ్యమంలోనూ అందుబాటులో ఉంటాయి. తద్వారా భాషా పరమైన ఆటంకాలు లేకుండా పిల్లలు సులభంగా నేర్చుకునేందుకు ఉపయోగ పడుతుంది.
- వినూత్న, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడంతో వీడియో పాఠ్యాంశాలు అత్యంత స్పష్టత, నాణ్యతతో ఉంటాయి.
- విద్యార్థులు ఎంత వరకు నేర్చుకున్నారన్న దానిపై ప్రతి ఒక్కరికీ ఫీడ్ బ్యాక్ పంపుతారు.
- సీబీఎస్ఈ సిలబస్ ఆధారంగా మ్యాపింగ్ చేస్తూ యాప్‌లో పాఠ్యాంశాలకు రూపకల్పన చేశారు. సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళికను అనుసరించి ప్రతి సబ్జెక్టులో.. ప్రతి అధ్యాయంలోనూ వివిధ అంశాలపై ప్రశ్నావళి ఉంటుంది.
- 4 నుంచి 10వ తరగతి విద్యార్థులకు గణితం, సామాన్య శాస్త్రం సులభంగా అర్థం చేసుకునేందుకు వీలుగా ఇంటరాక్టివ్ గేమ్స్ కూడా యాప్‌లో ఉంటాయి.
- పునశ్చరణ చేసుకునేలా, నేర్చుకున్న విషయ పరిజ్ఞానాన్ని అంచనా వేసేందుకు, అభ్యసనం కోసం వెనువెంటనే ప్రశ్నలు, వీడియోలు, గేమ్స్, అనుకరణ.. అన్నీ యాప్‌లో పొందుపరిచారు.
- 6 నుంచి 8వ తరగతి వరకు మ్యాథ్స్‌లో ఆటో సాల్వర్ స్కాన్ క్వశ్చన్స్ (లైవ్ చాట్ పద్ధతిలో నేరుగా), స్టెప్ బై స్టెప్ సొల్యూషన్స్ ఈ యాప్ ద్వారా లభిస్తాయి.
- తరచూ సాధన చేయడానికి వీలుగా మాదిరి ప్రశ్నపత్రాలు అందుబాటులోకి వస్తాయి.
- విద్యార్థి నేర్చుకున్న అంశాలపై నెలవారీగా ప్రోగ్రెస్ రిపోర్టులు ఇస్తారు. ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయుడితో మీటింగ్ కూడా ఉంటుంది.

ప్రభుత్వ చర్యలు సంతృప్తికరం

- ప్రైవేటు స్కూళ్లలో 25% సీట్ల కేటాయింపుపై హైకోర్టు
- చిత్తశుద్ధి కనిపిస్తోంది.. ధిక్కార చర్యలు తీసుకోబోం

సాక్షి, అమరావతి: ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలన్న తమ ఆదేశాల అమలు విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలపై హైకోర్టు సంతృప్తి వ్యక్తంచేసింది. ప్రభుత్వ చర్యల్లో చిత్తశుద్ధి కనిపిస్తోందని, అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోలేమని తేల్చిచెప్పింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్ దాఖలు చేసిన కోర్టు ఆదేశాల అమలు నివేదికపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని పిటిషనర్‌కు సూచిస్తూ రెండు వారాల గడువు ఇచ్చింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజుల ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

2,603 మంది విద్యార్థులకు ప్రవేశాలు..

విద్యా హక్కు చట్ట నిబంధనల ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు అన్ని ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలని జనవరిలో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఆదేశాలను అమలు చేయలేదంటూ పిటిషనర్ టి.యోగేష్ కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా.. ప్రభుత్వ న్యాయవాది ఎల్వీఎస్ నాగరాజు స్పందిస్తూ.. ధర్మాసనం ఆదేశాల అమలుకు సంబంధించిన నివేదికను కోర్టు ముందుంచారు. కేటాయించిన సీట్ల వివరాలను కూడా తెలియజేశారు. 25 శాతం సీట్ల గురించి మీడియాలో విస్తృత ప్రచారం చేశామని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని 9,514 ప్రైవేట్ స్కూళ్లలో ఒకటో తరగతి ప్రవేశాల నిమిత్తం 5,195 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో 3,515 మంది ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకున్నారని తెలిపారు. ఆరు దశల్లో దరఖాస్తులను పరిశీలించగా.. 3,288 మంది లాటరీకి ఎంపికయ్యారని చెప్పారు. ఇందులో 2,603 మంది 1వ తరగతి ప్రవేశాలు పొందారని వివరించారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను ఆయా స్కూళ్లకు పంపించామన్నారు. మిగిలిన సీట్లకు రెండో జాబితా విడుదల చేస్తామని నాగరాజు చెప్పారు. ఈ వివరాలపై ధర్మాసనం సంతృప్తి వ్యక్తం చేసింది. పిటిషనర్ టి.యోగేష్ స్పందిస్తూ కేవలం 2,603 సీట్లే భర్తీ చేశారని, మీడియాలో విస్తృత ప్రచారం చేయలేదన్నారు. ధర్మాసనం స్పందిస్తూ ప్రభుత్వ చర్యల్లో చిత్తశుద్ధి కనిపిస్తోందని పేర్కొంది.

రెక్కల కష్టం ఎవరిది?

- టీడీపీపై మంత్రి అంబటి మండిపాటు
- చేపట్టింది వైఎస్సార్.. పూర్తి చేసింది సీఎం జగన్
- సంగం బ్యారేజ్, నెల్లూరు బ్యారేజ్‌లు వారి వల్లే సాకారం



సాక్షి, అమరావతి: జలయజ్ఞంలో భాగంగా దివంగత వైఎస్సార్ ప్రారంభించిన మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజ్, నెల్లూరు బ్యారేజ్‌లను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేసి జాతికి అంకితం చేయటాన్ని టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. రెండు బ్యారేజ్‌లను చంద్రబాబు రెక్కల కష్టంతో పూర్తి చేస్తే సీఎం జగన్ ప్రారంభించారంటూ టీడీపీ నేతలు సిగ్గులేకుండా పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

- బ్రిటిష్ సర్కార్ నిర్మించిన సంగం, నెల్లూరు ఆనకట్టల స్థానంలో పటిష్ట బ్యారేజ్‌లు నిర్మించి మరింత భూమి సాగులోకి తేవాలన్న ప్రజల చిరకాల ఆకాంక్షను సాకారం చేస్తూ దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 2006లో సంగం బ్యారేజ్‌కు, 2008లో నెల్లూరు బ్యారేజ్‌కి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి సుమారు 16 ఏళ్ల పాటు పనులు జరిగాయి. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత కోవిడ్ వరదల సమయంలోనూ పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగించి పూర్తి చేశారు.
- మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీ సవరించిన అంచనా వ్యయం రూ.335.8 కోట్లు. రాష్ట్ర విభజనకు ముందు కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రూ.30.85 కోట్లు, టీడీపీ ఐదేళ్ల పాలనలో రూ.86.01 కోట్లు ఖర్చు చేశారు. సీఎం జగన్ మూడేళ్లలోనే రూ.131 కోట్లు వెచ్చించి పూర్తి చేశారు. మరి ఇది ఎవరి రెక్కల కష్టం?
- నెల్లూరు బ్యారేజీ సవరించిన అంచనా వ్యయం రూ.274.83 కోట్లు. రాష్ట్ర విభజనకు ముందు రూ.86.62 కోట్లు ఖర్చు చేయగా, టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రూ. 71.54 కోట్లు ఖర్చు చేసింది. సీఎం జగన్ మూడేళ్లలో రూ.77.37 కోట్లు వెచ్చించి బ్యారేజీని పూర్తి చేశారు.
- చంద్రబాబుకు అసలు రెక్కలు ఉన్నాయా కష్టపడటానికి? ఆయన రాజకీయంగా ఎగిరేందుకు ఎవరో ఒకరి రెక్కలు కావాలి. సీపీఐ, సీపీఎం లేదంటే బీజేపీ రెక్కలు, పవన్ కల్యాణ్ రెక్కలు లేకపోతే సొంతగా ఎగరలేని వ్యక్తి చంద్రబాబు.
- 14 ఏళ్లపాటు అధికారంలో ఉన్న చంద్రబాబు ఒక్క ప్రాజెక్టైనా పూర్తి చేశారా? జాతికి అంకితం చేశారా? అధికారంలో ఉన్నప్పుడు రైతులకు సాగునీరు ఇవ్వాలనే ఆలోచనైనా చంద్రబాబు ఎన్నడైనా చేశారా?
- పోలవరం సహా ఇవాళ పనులు జరుగుతున్న అన్ని ప్రాజెక్టులను ప్రారంభించింది వైఎస్సారే. జలయజ్ఞంలో భాగంగా 26 ప్రాజెక్ట్‌లు ఆయన ప్రారంభించినవే. ఆ తర్వాత ప్రభుత్వాలు మారాయి కానీ ఏ ఒక్కటీ పూర్తి కాలేదు. వైఎస్సార్ ప్రారంభించినవన్నీ పూర్తి చేయాలనే సంకల్పంతో సీఎం జగన్ ముందుకెళుతున్నారు.
- రాష్ట్రంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు పూర్తి కాకూడదని, పరిశ్రమలు రాకూడదని చంద్రబాబు, ఎల్లో మీడియా ఆరాటపడిపోతున్నాయి. టీడీపీ నేతలు పోలవరం పూర్తి కాకూడదని కోనసీమలో పండే కొబ్బరికాయలన్నీ తెచ్చి కొడుతున్నారు... అని అంబటి రాంబాబు అన్నారు.

సముద్ర ఉత్పత్తుల విషయంలో ప్రత్యేక చొరవ చూపండి

సీఎం జగన్‌కు ఆలిండియా ష్రింప్ హ్యాచరీస్ అసోసియేషన్ ప్రతినిధుల విజ్ఞప్తి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆలిండియా ష్రింప్ హ్యాచరీస్ అసోసియేషన్ ప్రతినిధులు

సాక్షి,అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం ఆలిండియా ష్రింప్ హ్యాచరీస్ అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో వారు సీఎంతో భేటీ అయ్యారు. కాకినాడ వద్ద ఏర్పాటు కానున్న మేజర్ బల్క్ డ్రగ్ పార్క్ వల్ల మత్స్యసంపద, సముద్ర ఉత్పత్తుల ఉనికికి ప్రమాదం ఏర్పడకుండా ప్రత్యేక చొరవ తీసుకోవాలని, డ్రగ్ పార్క్ వ్యర్థ జలాల డిశ్చార్జ్ పాయింట్ దూరం పెంచాలని హ్యాచరీస్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ సందర్భంగా సీఎంను కోరారు. దీంతో పాటు అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు సర్‌ప్లస్ పవర్‌ను హ్యాచరీస్‌కు ప్రత్యేక కేటగిరీ కింద ఇవ్వాలని కూడా వారు సీఎంకు విన్నవించారు. ష్రింప్ హ్యాచరీస్ అసోసియేషన్ సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించారు. సీఎంని కలిసిన వారిలో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, ఆలిండియా ష్రింప్ హ్యాచరీస్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి కొనకంటి మధుసూదన్‌రెడ్డి, కాకినాడ చాప్టర్ ప్రెసిడెంట్ సత్తి బులివీర్‌రెడ్డి, నేషనల్ బాడీ వైస్ ప్రెసిడెంట్ వి.సత్తిరెడ్డి, అడ్వైజర్ ప్రత్తిపాటి వీరభద్ర కుమార్, హ్యాచరీ ఓనర్స్ కనుమూరి ఆనంద వర్మ, ఎ.నగేష్ బాబు, బి.విజయ్‌కుమార్, సి.కోదండ తదితరులు ఉన్నారు.

దసరా మహిళా సాధికారత ఉత్సవాన్ని విజయవంతం చేయండి

మహిళా మంత్రులకు సీఎం వైఎస్ జగన్ సూచన

సాక్షి, అమరావతి: 'ఆకాశంలో సగం – అన్నింటా సగం' నినాదంతో రాజమహేంద్రవరంలో అక్టోబర్ 1న 'దసరా మహిళా సాధికారత ఉత్సవాన్ని' విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా మంత్రులకు సూచించారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసి ఈ ఉత్సవం గురించి వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం.. అక్కడే ఉన్న మహిళా మంత్రులను ఈ ఉత్సవానికి సహకరించాలన్నారు. అనంతరం మహిళా మంత్రులు ఆర్కే రోజా, ఉషశ్రీ చరణ్, విడదల రజినిలతో కలసి 'మహిళా సాధికారత ఉత్సవం' పోస్టర్‌ను వాసిరెడ్డి పద్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్టోబరు 1 న సాయంత్రం నాలుగు గంటలకు రాజమహేంద్రవరంలోని సుబ్రహ్మణ్య మైదానంలో ఉత్సవాన్ని ప్రారంభిస్తామన్నారు.

ఉద్యోగులకు భద్రత కల్పించేలా 'జీపీఎస్'

- కనీస పెన్షన్, బీమా, రిటైర్ అయ్యాక ఈహెచ్ఎస్ లాంటి సౌకర్యాలు
- ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది
- పెన్షన్ ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం
- ఉద్యోగ సంఘాలతో సమావేశంలో మంత్రుల కమిటీ



సమావేశంలో పాల్గొన్న మంత్రులు బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్, ఆదిమూలపు సురేశ్

సాక్షి, అమరావతి: ఉద్యోగుల భవిష్యత్తు గురించి ఎంతో ఆలోచించిన తర్వాతే గ్యారంటీడ్ పెన్షన్ స్కీమ్(జీపీఎస్) తెస్తున్నట్లు మంత్రుల కమిటీ తెలిపింది. ఉద్యోగుల పెన్షన్ ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కమిటీ స్పష్టం చేసింది. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో ఉద్యోగుల కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) అంశంపై మంత్రుల కమిటీ సభ్యులైన బొత్స సత్యనారాయణ, బుగ్గన రాజేంద్రనాథ్, ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. సీపీఎస్ కంటే మెరుగ్గా జీపీఎస్‌ను తెస్తున్నామని, ఇది ఉద్యోగుల ప్రయోజనాలను పరిరక్షించేలా ఉంటుందని వివరించారు. ఆర్థిక శాఖ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్, ముఖ్య కార్యదర్శి (హెచ్ఆర్)చిరంజీవి చౌదరి, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎన్.గుల్జార్, జీఏడీ కార్యదర్శి (సర్వీసెస్, హెచ్ఆర్) హెచ్.అరుణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఉద్యోగ సంఘాల తరఫున ఏపీ ఎన్జీవోల అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ఏపీ సెక్రటేరియట్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఇతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

చట్టపరమైన సదుపాయాలు: బుగ్గన

జీపీఎస్ విధానంలో హామీ పింఛను, హామీ కుటుంబ భద్రత, హామీ కనీస పింఛను–ఆరోగ్య భద్రత, ప్రమాదవశాత్తు మరణం–వైకల్య బీమా సౌకర్యాన్ని చట్టపరంగా కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. ఈ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆమోదాన్ని తెలపాలని కోరారు.

మరోసారి చర్చలు : బొత్స

జీపీఎస్‌పై పలు దఫాలుగా ఉద్యోగులతో చర్చించామని, ఫైనల్ అయ్యాక దానికి చట్ట బద్ధత కల్పిస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. తుది డ్రాఫ్ట్ గురించి ఉద్యోగులకు వివరించామని చెప్పారు. రిటైర్ అయ్యాక గ్యారంటీగా కనీసం రూ.10 వేలు పెన్షన్ ఉండేలా మార్పు చేశామన్నారు. పెన్షనర్ చనిపోతే భార్య లేదా భర్తకు పెన్షన్ వస్తుందని, హెల్త్ కార్డులు కూడా ఉంటాయని చెప్పారు. ఉద్యోగులతో మరోసారి చర్చలు జరుపుతామన్నారు. వారిపై పెట్టిన కేసుల ఎత్తివేతపై సీఎంతో చర్చిస్తామన్నారు. గురుకులాలు, యూనివర్సిటీల్లో బోధన, బోధనేతర సిబ్బంది పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

వారికి బుద్ధి ఉండాలి

సీఎం సతీమణి గురించి మాట్లాడేవారికి బుద్ధి ఉండాలని మంత్రి బొత్స ధ్వజమెత్తారు. చంద్రబాబు ఏదైనా ఉంటే రాజకీయంగా పోరాడాలన్నారు. ఇంట్లో ఉన్న మహిళల గురించి మాట్లాడటం నీచమన్నారు.

ఉద్యోగుల పట్ల చిత్తశుద్ధితో ఉన్నాం: సజ్జల

ఉద్యోగులపై ప్రేమ ఉండబట్టే వారి భవిష్యత్తుకు భద్రత కల్పించేలా జీపీఎస్ తెస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ప్రభుత్వ చిత్తశుద్ధిని గుర్తించాలని కోరారు. ఉద్యోగుల భవిష్యత్తుకు భద్రత కల్పించేలా ఉన్నంతలో బెస్ట్ ప్యాకేజీగా జీపీఎస్‌ను ప్రతిపాదించినట్లు తెలిపారు. పాత పెన్షన్ స్కీమ్ అమలు చేయడం రాష్ట్రానికి విపత్తు లాంటిదని చెప్పారు. జీపీఎస్ రూపకల్పన చర్చల్లో సీఎం జగన్ నేరుగా పాల్గొని సూచనలు, సవరణలు చేశారని తెలిపారు. జీపీఎస్ కూడా భారమని ఆర్థిక నిపుణులు చెప్పినా, ఉద్యోగులకు కనీస భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతని భావించినట్లు చెప్పారు. దీనిపై ఇంకా ఏమైనా మెరుగ్గా చేయగలమా... అనే అంశాలపై చర్చించేందుకు ఉద్యోగ సంఘాలను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. కనీస పింఛన్ రూ.10 వేలు, ఉద్యోగం చేస్తూ చనిపోతే బీమా, అతి తక్కువ బేసిక్ ఉన్న వారికి రూ.50 లక్షలు, ఎక్కువ బేసిక్ ఉన్న వారికి కొంత తక్కువ బీమా కవరేజీ ఉంటుందన్నారు. ఉద్యోగి చనిపోయినా, అంగవైకల్యానికి గురైనా ఆ కుటుంబానికి అండగా ఉండేలా బీమా, పెన్షన్ పొందుతున్న వ్యక్తి చనిపోతే భార్యకు 60 శాతం పెన్షన్, ప్రస్తుతం ఉద్యోగులకు ఉన్న ఈహెచ్ఎస్‌ను రిటైర్ అయ్యాక కూడా కొనసాగించడం లాంటివి జీపీఎస్‌లో ఉన్నాయన్నారు. సీఎం జగన్ అవకాశవాదంతో ఆలోచించే వ్యక్తి కాదు కాబట్టే, ఉద్యోగులకు మేలు చేసేందుకు అన్ని రకాలుగా ఆలోచన చేస్తున్నారని తెలిపారు. నిజంగా ఉద్యోగుల ప్రయోజనాలను ఆకాంక్షిస్తుంటే ఉద్యోగ సంఘాలు చర్చలకు రావాలని సూచించారు.



నాణ్యత కన్నా పరిమాణానికీ, పోషక విలువల కన్నా చూపులకూ విలువనిచ్చే మనస్తత్వం మారనిదే కలుషిత ఆహార సమస్యకు పరిష్కారం లేదు.
– మసనోబు ఫుకుఓకా

సాక్షి
గురువారం, సెప్టెంబర్, 8

స్వయంకృతాపరాధం!

చేసిన పాపం... శాపంగా మారడమంటే ఇదే! పట్టణాభివృద్ధి పేరిట కొన్నేళ్ళ విశృంఖలత్వానికి ఫలితం ఇప్పుడు భారత సాఫ్ట్‌వేర్ రాజధాని బెంగళూరులో కనిపిస్తోంది. వరుసగా రెండురోజులు రాత్రివేళ కురిసిన వర్షాలతో ప్రాథమిక పౌర వసతుల వ్యవస్థ కుప్పకూలి, అతలాకుతలమైన మహానగరం అంతర్జాతీయ వార్తగా మారింది. సంపన్నులు నివసించే ఖరీదైన ప్రాంతాలు సైతం నీట మునిగిపోయాయి. చుట్టూ నీళ్ళున్నా, అనేకచోట్ల రెండు రోజులుగా తాగునీరు రాని దుఃస్థితి. కరెంట్ కోత సరేసరి. ఇప్పటికే ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, కోటీశ్వరులు సైతం పడవల్లో విలాసవంతమైన విల్లాలు వదిలి పోయిన పరిస్థితి. ప్రపంచ శ్రేణి సంస్థలు, వ్యాపారాలకు నెలవైన నగరంలో కనీస పౌర వసతులు ఎంత దయనీయంగా ఉన్నాయంటే, వర్షాలు ఆగి, గంటలు గడిచినా పలు ప్రాంతాలు ఇప్పటికీ నడుము లోతు నీళ్ళలో నిస్సహాయంగా నిరీక్షిస్తున్నాయి. పట్టణ ప్రణాళిక లోపభూయిష్ఠమై, రియల్ ఎస్టేట్ దురాశ పెరిగితే, వాతావరణ మార్పుల వేళ మన నగరాలకు సంక్షోభం తప్పదని మరోసారి గుర్తుచేస్తున్న ప్రమాద ఘంటిక ఇది.

వరుస వర్షాలతో బెంగళూరులోని కీలక ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్)లో ప్రయాణ, వాణిజ్య కార్యకలాపాలన్నీ నిలిచిపోయాయి. 'భారత సిలికాన్ వ్యాలీ'లోని ఆ రోడ్డులోనే మైక్రోసాఫ్ట్, ఇంటెల్, మోర్గాన్ స్టాన్లీ లాంటి బడా అంతర్జాతీయ సంస్థల ఆఫీసులన్నీ ఉన్నాయి. వాన నీటితో అంతా స్తంభించి, స్థానికంగా కోట్ల రూపాయల మేర ఉత్పత్తి పడిపోయింది. రోడ్లపై నీళ్ళు నిలిచిపోవడంతో బడా బడా సీఈఓలు సైతం చివరకు ట్రాక్టర్లు ఎక్కి వచ్చిన పరిస్థితి. ఆధునిక టెక్నాలజీ కారిడార్‌లోనే ప్రాథమిక వసతులు ఇలా పేకమేడలా ఉన్నాయంటే, మిగతా నగరంలో ఎలా ఉన్నాయో ఊహించుకోవచ్చు. ఆదివారం నాటి వర్షపాతం బెంగళూరు చరిత్రలోనే సెప్టెంబర్‌లోకెల్లా మూడో అతి భారీ వర్షపాతమని నిపుణుల మాట. అందుకు తగ్గట్టుగా పౌర వసతులను తీర్చిదిద్దుకోకపోవడమే పెను సమస్య.

బెంగళూరులోని మొత్తం 164 చెరువులూ నిండిపోయాయి. ఇంత భారీ వర్షాల తర్వాతా పాత బెంగళూరు నిలకడగా ఉన్నా, వైట్‌ఫీల్డ్, సాఫ్ట్‌వేర్ ఆఫీసులకు నెలవైన ఖరీదైన కొత్త బెంగళూరు ప్రాంతం చిక్కుల్లో పడడం తప్పు ఎక్కడ జరిగిందో చెబుతోంది. ప్రస్తుత దుఃస్థితికి పాత కాంగ్రెస్ ప్రభుత్వం కారణమని బీజేపీ, ప్రస్తుత కాషాయ ప్రభుత్వ అసమర్థత – అవినీతి మూలమని కాంగ్రెస్ పార్టీ పరస్పర నిందారోపణల్లో పడ్డాయి. నిజానికి, ఈ తిలాపాపంలో తలా పిడికెడు భాగం ఉంది. రెండు నదుల మధ్య లోయలా, అనేక చెరువులు, నీటి పారుదల వ్యవస్థలు, ఉద్యానాలు నిండిన నగరం బెంగళూరు. ఐటీ విజృంభణతో పట్టణాభివృద్ధి పేరిట ఇష్టారాజ్యంగా చేసిన భవన నిర్మాణాలు చెరువులను ఆక్రమించాయి. నీటి పారుదలను అడ్డగించేశాయి. అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారిన నగర పాలక సంస్థ, ప్రభుత్వ అధికారులు, రాజకీయ నేతలు కళ్ళు మూసుకొని, భవన నిర్మాతల అత్యాశను అనుమతించారు. చివరకు పకడ్బందీ ప్రణాళిక లేని మైసూరు – బెంగళూరు ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం సైతం పౌర వసతులపై ఒత్తిడి పెంచేస్తుండడం విషాదం.

నిజానికి, ఇది ఒక్క బెంగళూరు పరిస్థితే కాదు. పట్టణ ప్రణాళికలోని లోపాలు, నియమ నిబంధనల్ని యథేచ్ఛగా ఉల్లంఘించడం, అధికారుల అలసత్వం, పెను వాతావరణ మార్పులతో తలెత్తిన సంక్షోభం – ఇవన్నీ మన దేశంలోని అనేక నగరాలను పట్టి పీడిస్తున్నాయి. వాటి ఫలితం 2005లో ముంబయ్, 2015లో చెన్నై, 2016లో గురుగ్రామ్, 2020లో హైదరాబాద్, 2021లో కోల్‌కతా, ఢిల్లీ – ఇలా అనేకచోట్ల చూశాం. కొండలు గుట్టల్ని మింగేసి, చెరువుల్ని కబ్జా చేస్తే భారీ వర్షం కురిసినప్పుడల్లా 'ఆకస్మిక వరదలు' తప్పవని హైదరాబాద్, చెన్నై సహా అన్నీ పదే పదే గుర్తుచేస్తున్నాయి. ఇప్పటికీ శరవేగంతో సాగుతున్న పట్టణీకరణ వల్ల నగరాలపై భారం పెరుగుతోంది. ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రాలైన మన నగరాలు మరో దశాబ్దంలో ప్రతి 10 మంది భారతీయుల్లో నలుగురికి ఆవాసమవుతాయని అంచనా. ఈ పరిస్థితుల్లో పదే పదే ముంచెత్తుతున్న వరదలు, వాతావరణ మార్పుల రీత్యా ఇటు అభివృద్ధితో పాటు, అటు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని తీరాలి. పటిష్ఠమైన అభివృద్ధి, పర్యావరణ రక్షణ ప్రణాళిక లేకపోతే, కొన్నేళ్ళుగా వివిధ నగరాల్లో చూస్తున్న వరదలు, ఉష్ణతాపాలు అన్నిచోట్లా నిత్యకృత్యమవుతాయి.

ఇకనైనా పరిస్థితులు మారాలంటే, పట్టణాలలో కర్బన ఉద్గారాలను తగ్గించుకోవాలి. చెరువులు, నదీతీరాల్లో ఆక్రమణలను అడ్డగించాలి. పంటలు పండే మాగాణి నేలల్నీ, పర్యావరణానికి కీలకమైన మడ అడవుల్నీ రియల్ ఎస్టేట్ మూర్ఖత్వానికి బలి చేస్తే, దాని దుష్ఫలితం అనుభవిస్తామని గ్రహించాలి. ఇవాళ్టికీ అనేక నగరాల్లో బ్రిటీషు కాలం నాటి ఏర్పాట్లే ఉన్న మనం వర్షపు నీరు, మురుగు నీటి పారుదల వ్యవస్థలను మెరుగుపరుచుకోవాలి. ప్రకృతి సిద్ధమైన నీటి వనరులనూ, వాటి నుంచి నీళ్ళు పోయే మార్గాలనూ కాపాడుకోవాలి. అంతులేని ఆశతో, అజ్ఞానంతో వాటిని ధ్వంసం చేస్తే, మన చెత్తతో వాటిని నింపేస్తే ఆనక తాజా బెంగళూరు లాంటి అనుభవాలతో చింతించాల్సి వస్తుంది. ఇవన్నీ జరగాలంటే, పాలకుల్లో నిజాయతీ, చిత్తశుద్ధి ముఖ్యం. అన్నీ సవ్యంగా ఉంటేనే అప్పుడది సుపరిపాలన. ప్రభుత్వాలు అది గుర్తించాలి. చైతన్యవంతమైన పౌర సమాజం సైతం తన వంతుగా బాధ్యతగా ప్రవర్తిస్తేనే ప్రయోజనం. 'నమ్మ బెంగళూరు' చెబుతున్న పాఠం ఇదే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, తిథి: శు.త్రయోదశి రా.7.58 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: శ్రవణం ప.1.32 వరకు, తదుపరి ధనిష్ఠ వర్జ్యం: సా. 5.18 నుండి 6.46 వరకు, దుర్ముహూర్తం: ఉ.9.54 నుండి 10.43 వరకు, తదుపరి ప.2.51 నుండి 3.40 వరకు అమృతఘడియలు: రా.2.21 నుండి 3.51 వరకు

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం: 6.07
రాహుకాలం : ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే కుట్ర

విశ్లేషణ



మల్లెపల్లి లక్ష్మయ్య

భారత రాజ్యాంగం దానికదే ఒక విప్లవం. రెండు వేల సంవత్సరాలకు పైగా ఉన్న ఒక అసమాన వ్యవస్థ నిర్మాణాన్ని అది బద్దలు చేసింది. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా భారతదేశంలో ఉన్న ప్రజలందరినీ ఒక్కటి చేయగలిగింది. అయితే కొంతకాలంగా రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతియ్యడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగమే రాజ్యాంగ పీఠిక నుంచి 'సోషలిస్టు' (సామ్యవాద), 'సెక్యులర్' (లౌకికవాద) పదాలను తొలగించాలని సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం! పైగా తన వాదనకు బలం చేకూర్చుకోవడానికి సోషలిస్టు భావనను వ్యతిరేకించినట్టుగా అంబేడ్కర్ మాటలను ఆయన ఉటంకించారు. ఇది అంబేడ్కర్‌ను పూర్తిగా తప్పుగా అర్థం చేసుకోవడమే!

భారతదేశ చరిత్రను అర్థం చేసుకోవాలంటే, 'భారత రాజ్యాంగం అమలుకు ముందు, అటు తర్వాత' అని చూడాల్సి ఉంటుంది. భారత రాజ్యాంగానికి ముందు ఈ దేశంలో మనుషులంతా ఒక్కటి కాదు. కులాలు, మతాలు, ప్రాంతాలుగా విడివడి ఉన్నారు. కుల సమాజాన్ని సృష్టించి, పెంచి పోషించిన మనువాదం ఒక పరిపాలనాపత్రంగా, అదే శాసనంగా, అదే రాజ్యాంగంగా అమలు అవుతూ సమాజంలో అంతరాలను ఇంకా బలంగా వేళ్ళూనుకొనేలా చేసింది. అలాంటి సందర్భంలో కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా భారతదేశంలో ఉన్న ప్రజలందరినీ రాజ్యాంగం ఒక్కటి చేయగలిగింది. అప్పటి వరకు కులాన్ని బట్టి విలువ ఉండేది. ఒక్కొక్క కులానికి ఒక్కొక్క విలువను మనువాదం ప్రబోధించింది. కానీ భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి ఒక ఓటు, ఒక ఓటుకు ఒకే విలువను కల్పించి, కనీసం దానిలోనైనా ఒక సమానత్వ ప్రపంచాన్ని అందించింది. అందుకే భారత రాజ్యాంగం దానికదే ఒక విప్లవం. రెండు వేల సంవత్సరాలకు పైగా ఉన్న ఒక అసమాన వ్యవస్థ నిర్మాణాన్ని అది బద్దలు చేసింది.

అయితే కొంతకాలంగా భారత రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతియ్యడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగంగానే గతవారం కేంద్ర మాజీ మంత్రి సుబ్రహ్మణ్యస్వామి రాజ్యాంగ పీఠిక నుంచి 'సోషలిస్టు'(సామ్యవాద), 'సెక్యులర్' (లౌకిక వాద) పదాలను తొలగించాలని పిటిషన్ వేశారు. ఆ పిటిషన్ సెప్టెంబర్ 23న విచారణకు రానున్నది. ఇదే విషయమై, 2020 జూలైలో న్యాయవాది విష్ణు శంకర్ కూడా పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణకు అంగీకరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నేతృత్వంలోని ధర్మాసనం ముందు దీన్ని విచారించనున్నారు.

సోషలిస్టు, సెక్యులర్ అనే పదాలు రాజ్యాంగ సభ ద్వారా ఆమోదించిన పీఠికలో లేవనీ, 1976లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ వీటిని చేర్చారనీ, రాజ్యాంగ సభ చర్చలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లాంటి వాళ్ళు కూడా వీటిని వ్యతిరేకించారనీ ఈ పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషనర్‌గా ఉన్న సుబ్రహ్మణ్యస్వామి తన వాదనకు బలం చేకూర్చుకోవడానికి బాబాసాహెబ్ అంబేడ్కర్ మాటలను ఉటంకించినట్టు కనిపిస్తున్నది. అయితే, అంబేడ్కర్ మాటలను పరిశీలిస్తే సుబ్రహ్మణ్యస్వామియే అంబేడ్కర్‌ను తప్పుగా అర్థంచేసుకున్నట్టు కనిపిస్తున్నది. ఆ రోజు సభలో అంబేడ్కర్ మాట్లాడుతూ... ''రాజ్యాంగాన్ని మనం ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా రూపొందించుకోవాలి. భవిష్యత్‌లో ప్రజలు ఎటువంటి విధానాలను అవలంబించాలనుకుంటారో వారికి అవకాశం ఇవ్వాలి. అంతేగానీ ఇప్పుడే అన్ని విషయాలను ముగించకూడదు. అంతేకాకుండా, రాజ్యాంగంలోని నాలుగవ భాగమైన ఆదేశిక సూత్రాల్లో పొందుపరిచిన అంశాలన్నీ కూడా సోషలిస్టు భావనలను సమర్థిస్తున్నాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి'' అంటూ రాజ్యాంగ సభకు కేటీ షా ప్రతిపాదించిన సవరణకు సమాధానమిచ్చారు. అంబేడ్కర్ ఎక్కడా, సోషలిస్టు భావనను వ్యతిరేకించింది లేదు. పైగా దాని సారాంశాన్ని ఆదేశిక సూత్రాల్లో పొందుపరిచినట్టు పేర్కొన్నారు.

కొత్త కోణం



సరిగ్గా ఇక్కడే అంబేడ్కర్‌ను అర్థం చేసుకోవడానికి రాజ్యాంగ సభలో మాట్లాడింది మాత్రమే సరిపోదు. ఒకరకంగా అది అప్పటి నాయకుల ఉమ్మడి అభిప్రాయం కూడా కావచ్చు. అయితే అంబేడ్కర్ మొదటినుంచీ సమానత్వ సమాజ స్థాపనకు పాటుపడిన వ్యక్తి. అంతేకాకుండా, రాజ్యాంగ సభలో తాను సభ్యుడిగా ఉంటానో లేదో నని భావించి, 1946లో రాజ్యాంగ సభకు ఒక మెమోరాండంను సమర్పించారు. దానినే 'స్టేట్స్ అండ్ మైనారిటీస్' అంటారు. అందులో ప్రభుత్వం సోషలిస్టు విధానాలను అనుసరించాలని, దానికి స్టేట్ సోషలిజం అనే మాటను కూడా ఆయన వాడారు. అందులో ఆర్థికపరమైన అంశాలను పేర్కొంటూ– దేశంలోని భారీ పరిశ్రమలను ప్రభుత్వమే నిర్వహించాలనీ, ఇన్సూరెన్స్ లాంటి ఆర్థిక సంస్థలు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండాలనీ, దేశవ్యాప్తంగా ఉన్న భూములను జాతీయం చేయాలనీ ప్రతిపాదించారు. ఈ విషయాలన్నింటినీ రాజ్యాంగంలో పొందుపరచడానికి తన శాయశక్తులా కృషి చేశారు. అయినా సఫలం కాలేదు. అటువంటి సామాజిక మార్పును కోరుకుని, దాని కోసమే యావత్ జీవితాన్నే ప్రజలకు సమర్పించిన ఓ మహోన్నత వ్యక్తి వ్యాఖ్యలను తప్పుగా, తమ సోషలిస్టు వ్యతిరేక భావాలకు మద్దతుగా వాడుకోవడం విచారకరం.

ఈ విషయం అట్లా ఉంచితే, 1976లో అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణ ద్వారా పీఠికలో 'సోషలిస్టు, సెక్యులర్' అనే పదాలను మాత్రమే కాకుండా, ఇంకా చాలా విషయాలను రాజ్యాంగంలో చేర్చారు. అయితే 1977లో జనతాపార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత చాలా విషయాలను 43వ సవరణ ద్వారా తొలగించారు. అయితే రాజ్యాంగ పీఠికలోని ఆ రెండు పదాల జోలికి మాత్రం పోలేదు. ప్రస్తుత పిటిషనర్ సుబ్రహ్మణ్యస్వామి అప్పుడు జనతాపార్టీ లోక్‌సభ సభ్యుడిగా గెలిచారు. మరి అప్పుడు తన గొంతును ఎందుకు వినిపించలేదో ఆయనకే తెలియాలి. 2008లో 'గుడ్ గవర్నెన్స్ ఇండియా ఫౌండేషన్'కు చెందిన సంజీవ్ అగర్వాల్ ఇదే విషయమై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ నాయకత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఈ పిటిషన్‌ను తిరస్కరించింది. ''సోషలిజం అనగానే అదేదో కమ్యూనిస్టులకు సొంతమైనట్టు అనుకోవడం సరైనది కాదు. ప్రజల సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం కూడా అందులో భాగమే'' అని వ్యాఖ్యానించింది. అందువల్ల ఆ పదాలను తొలగించాల్సిన అవసరమే లేదని భారత అత్యున్నత న్యాయస్థానం ఆనాడు కుండ బద్దలుకొట్టింది.

ప్రస్తుతం మళ్ళీ ఎందుకు ఈ ప్రతిపాదన ముందుకుతెస్తున్నారనేది ప్రశ్న. దీనికి ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, సామాజిక విధానాలు... సోషలిస్టు, సెక్యులర్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వరంగ పరిశ్రమలను, ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం చూస్తూనే ఉన్నాం. అదేవిధంగా మైనారిటీ మతాలను, వాటికి సంబంధించిన సంస్థలను వేధిస్తుండడం ఎక్కువైందని అంతర్జాతీయ సంస్థలు ఎన్నో నివేదికల ద్వారా వెల్లడించాయి. ఎవరైనా ఈ విషయాలన్నింటినీ కోర్టుల్లో సవాల్ చేస్తారని ముందే ఊహించి, వాటిని తొలగిస్తే ఇక నైతికంగా కూడా తమకు ఎదురు ఉండదని భావించి అటువంటి పిటిషన్‌ను అధికార పార్టీ సభ్యుడే వేయడం జరిగి ఉండొచ్చనే అభిప్రాయానికి రావడం తప్పేమీకాదు. అదే విధంగా భారత దేశంలో హిందూమతాన్ని అధికార మతంగా చేయడానికి ఒక ప్రయత్నం జరుగుతున్నది. దానికి రాజ్యాంగాన్నే మార్చేయాలనే ప్రయత్నం చేస్తున్నట్టు సాధువులు, సంతులు స్వయంగా ప్రకటించారు. అందుకనుగుణంగానే ఇప్పటికే ముప్పై పేజీల డాక్యుమెంటు రూపొందించినట్టు కూడా ప్రకటించారు.

ఇటువంటి నేపథ్యం నుంచి ఈ పీఠికను చూడాల్సి ఉంది. నిజానికి రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు సోషలిస్టు, సెక్యులర్ స్ఫూర్తిని బలపరచడమే కాకుండా నిర్దిష్టమైన మార్గాన్ని చూపుతున్నాయి. సోషలిస్టు, సెక్యులర్ పదాలు భారత రాజ్యాంగాన్ని మరింత శక్తిమంతం చేస్తున్నాయే తప్ప ఎటువంటి దుష్ప్రభావాన్నీ కలిగించడం లేదు. భారత రాజ్యాంగ రక్షణ ఈ దేశ సామాజిక ప్రగతికీ, మనుగడకూ ఒక తక్షణ అవసరంగా ఉంది. అందువల్ల రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే ఇటువంటి కుట్రలను భారత సమాజం సహించబోదని ఆశిద్దాం.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । మొబైల్: 81063 22077

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అంతం ఉండదా?



ప్రతి మూడు నెలలకు ఒకసారి తీసుకోవాల్సి వస్తే, ఇక దాన్ని టీకా అనలేము.
– మాక్సీమ్ బెర్నియర్, కెనడా నాయకుడు

తేలే నగరం



మిత్రులారా! శివసేన ముంబయిని షాంఘై నగరం చేయలేకపోయింది. కానీ మనం మాత్రం బెంగళూరును వెనిస్ నగరం చేసేశాం (బెంగళూరు వరదలతో).
– మాధవన్ నారాయణన్, జర్నలిస్ట్

చూడకపోతే తప్పా?



ప్రజాస్వామ్యంలో నిరసన అనేది చట్టవ్యతిరేకమా? ఒకటేదైనా నచ్చకపోతే జనం ఎందుకు దానిగురించి మాట్లాడకూడదు? (మేము సినిమాలను చూడమని ఎవరైనా చెబితే) వాళ్లమీద బలప్రయోగం జరిపి సినిమాలు చూసేట్టు చేస్తారా? చాలామంది ఏం మాట్లాడుతున్నారో వారికి అర్థం కావడం లేదు.
– అజిత్ దత్తా, కామెంటేటర్

దానికి మాత్రమేనా?



మరో సైలెంట్ మాస్టర్ స్ట్రోక్. ఇండియాలోని ఆయుర్వేద పరిశ్రమ యావత్తూ జీవ వైవిధ్య చట్టం నుంచి మినహాయింపు పొందనుంది. విత్తన కంపెనీలు, ఆధునిక ఔషధ సంస్థలు కాకుండా కేవలం 'ఆయుష్' పరిశ్రమ దీన్నుంచి లబ్ధి పొందాలనేది దీని ఉద్దేశం.
– ఆశిష్ కె.మిశ్రా, కాలమిస్ట్

లేకుండా చేస్తోంది



ఇన్‌కమ్ ట్యాక్స్ దాడులు చాలా సరళంగా ఒక సందేశం ఇస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీలకు ఎవరైనా నిధులు ఇచ్చారంటే, ఏజెన్సీలు వారి తలుపులు తడతాయి. అత్యంత ధనిక పార్టీ అయిన బీజేపీ అత్యధిక నిధులను పొందుతోంది. వస్తున్న అరకొర నిధులు కూడా రాకుండా చేస్తూ ప్రతిపక్షాలను బీజేపీ నాశనం చేస్తోంది.
– రోహిణీ సింగ్, జర్నలిస్ట్

ఉపాధినిచ్చే పరిశ్రమ



ఒక సినిమా విడుదలైన ప్రతిసారీ ఎంపిక చేసుకుని నిరసించడం అనేది దానికదే పరిశ్రమ. లాబీ అయిపోయింది. సామూహికంగా దీన్ని ఎదుర్కోలేకపోతే ద్వేషం, భయం, నిశ్శబ్దమనే అగాథంలోకి వేగంగా కూరుకుపోతాం. వినోద పరిశ్రమ అనేది ఉపాధిని పుట్టించేది. లక్షలాది మంది దాని మీద ఆధారపడ్డారు. అందరూ మాట్లాడాలి. (బాయ్‌కాట్ బాలీవుడ్ ట్రోలింగ్‌ను ఉద్దేశించి.)
– ప్రియాంకా చతుర్వేది, రాజ్యసభ ఎంపీ

కరిస్తే దిక్కేంటి?




మనుషులు వెళ్తున్న లిఫ్టులోనే తమ పెంపుడు కుక్కలను పట్టుకెళ్లడం, అవి మనుషులను కొరికిన ఉదంతాలకు సంబంధించి రెండు వీడియోలు వెలుగులోకి వచ్చాయి. ఒకటి పిల్లాడిది, ఇంకోటి యువకుడిది. లిఫ్టుల్లో కుక్కలను తీసుకెళ్లడం గురించి స్పష్టమైన విధివిధానాలు ఉండాల్సిన అవసరం ఉంది.
– ఆంబర్ జైదీ, యాక్టివిస్ట్

ఇన్‌బాక్స్

కదిలించే విమర్శకులు

కేపీ అశోక్ కుమార్ విమర్శ 'పరిపక్వత'తో ఉంటుంది. కథ పాఠకునితో చదివించడం; అతని ఆలోచనా ప్రపంచంలో, హృదయ సంస్కారంలో కదలిక తీసుకురావడం సూక్ష్మంగా మంచి కథకు ప్రధాన లక్షణాలు అంటారు కేపీ. కథా విమర్శకుడిగా, సమీక్షకుడిగా వందలాది వ్యాసాలు రాశారు. రెండు పుస్తకాలూ వెలువరించారు. అవి 'కథావలోకనం', 'కథావిష్కారం'.

కేపీ చూపు ప్రత్యేకం అని చెప్పడానికి ఆధారాలు చాలా ఉన్నాయి. ఆయన కథారచయితలుగా ఎవరూ పట్టించుకోని వారిని గుర్తించి విశ్లేషిస్తారు. ఉదాహరణకు ఆలూరి బైరాగిని కవిగా గుర్తించిన సాహితీ లోకం, కథకుడిగా పట్టించుకోలేదు. కానీ కేపీ... బైరాగి కథల్ని విశ్లేషించారు. కొన్ని నిర్ధారణల్ని చేశారు. అలాగే శ్రీశ్రీ, కాళోజీ, జూకంటి జగన్నాథం లాంటి కవులు రాసిన కథల్ని ఎరుకతో చర్చించారు. కొనకళ్ళ వెంకటరత్నం కథల మీద వ్యాసం రాశారు. తీవ్రమైన అధ్యయనం తరువాతే, ఆయన వ్యాఖ్యానాలు చేస్తారు. కథా సంవిధానం, కథా కథనం, పాత్రలు, కథా ప్రయోజనం... ఇలా ప్రతి అంశాన్నీ పట్టి చూపగలరు. వారి విమర్శ ద్వారా రచయితలు మరింత మెరుగుపడతారనీ, రాసిన వ్యాసాలను పరిశోధకులు పరిశోధనాంశాలుగా కొనసాగించాలనీ ఆశిస్తూ... 'అద్దేపల్లి రామ్మోహనరావు విమర్శ పురస్కారం' అందుకుంటున్న అశోక్ కుమార్‌కు శుభాకాంక్షలు!




కేపీ అశోక్ కుమార్

– డా॥ సుంకర గోపాల్, తెలుగు సహాయాచార్యులు
(కేపీ అశోక్ కుమార్‌కు సెప్టెంబర్ 10న అద్దేపల్లి పురస్కార ప్రదానం)

ఏది ఉచితం? ఏది అనుచితం?

అభిప్రాయం



సారంపల్లి మల్లారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇస్తున్న రాయితీలను, సబ్సిడీలను ఉచితాలుగా ప్రకటించి... వాటిని రద్దు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం సూచనలు, సలహాలు ఇస్తూ ప్రకటన చేసింది. ఏవి ఉచితాలో, వేటిని ఉపసంహరించుకోవాలో స్పష్టంగా చెప్పలేదు. ఉచితం అంటే పూర్తి సబ్సిడీగా ఇచ్చేది. ఎలాంటి శ్రమ, ప్రతిఫలం ఆశించకుండా ఇచ్చేది. ఈరోజు దేశంలో 80 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన బతుకుతున్నారు. వారికి కనీస పౌష్టికాహారం అందుబాటులో లేదు. ఐదేళ్ల లోపు పిల్లలు వెయ్యికి 40 మంది మరణిస్తున్నారు. ఉత్పత్తి ధర చెల్లించి కొనుగోలు చేసే శక్తి ప్రజలలో లేదు. అలాంటి ప్రజలకు రాయితీలు ఇవ్వాలి. శ్రమ చేయడానికి శక్తిలేని వారు, వయస్సు మళ్లినవారు, అనారోగ్యానికి గురైన వారికి ప్రభుత్వం ఉచితంగా సహకారం అందించాలి. ప్రస్తుతం రాష్ట్రాలు చౌక డిపోల ద్వారా బియ్యం ఇస్తున్నాయి. వీటికి తోడు ఆసరా పింఛన్లు, భరోసా పింఛన్లు వికలాంగులకు, ఒంటరి మహిళలకు ఇస్తున్నారు. వీటితోనే వీరు బతుకుతున్నారు. ఈ ఉచితాలు రద్దు చేస్తే వీరిలో చాలామంది బతకలేరు.

వ్యవసాయ రంగానికి ఎరువులు, విత్తనాలు, విద్యుత్, రైతుబంధు, రైతుబీమా పేర్లతో రాయితీలు ఇస్తున్నారు. వ్యవసాయోత్పత్తులకు పెట్టిన పెట్టుబడిని శాస్త్రీయంగా ప్రభుత్వం లెక్కించడంలేదు. చివరికి మార్కెట్లలో రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రాక దేశంలో ఏటా 12,600 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఏదో రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణగారిన ప్రజలకు సబ్సిడీల పేరుతో రాయితీలు ఇస్తూనే ఉన్నాయి. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ రాయితీలన్నింటినీ రద్దు చేయాలని సలహా ఇస్తున్నది. వార్షిక తలసరి ఆదాయం దేశంలో రూ. 1,50,326గా కేంద్రం ప్రకటించింది (2021–22). అంతకు తక్కువ వచ్చిన వారు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు చెప్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల రాయితీలను గమనించి ఆహార సబ్సిడీ (రూ. 2,06,831 కోట్లు), ఎరువుల సబ్సిడీ (రూ. 1,06,222 కోట్లు), గ్యాస్ (రూ. 8,940 కోట్లు), పెట్రోల్ సబ్సిడీ (రూ.3.30 లక్షల కోట్లు) ఏటా ఇస్తున్నది. ఈ మధ్య రైతు కుటుంబానికి రూ. 6,000 చొప్పున కిసాన్ సమ్మాన్ పేర రూ.68,000 కోట్లు, వడ్డీమాఫీకి రూ. 19,500 కోట్లు, పంట బీమాకు రూ. 15,500 కోట్లు... మొత్తం రూ.1,03,000 కోట్లు సబ్సిడీగా ఇస్తున్నది. దళిత, గిరిజన, వెనుకబడిన, మైనారిటీ కార్పొరేషన్లు, ఆయా వర్గాలకు 20 శాతం సీడ్‌మనీ పేర సబ్సిడీలు ఇచ్చి బ్యాంకు రుణాలు ఇప్పిస్తున్నారు. వాటితో ఉపాధి చాలామంది సంపాదించుకుంటున్నారు. రాష్ట్రాలు రాయితీలను రద్దు చేయాలంటున్న కేంద్రం ఈ రాయితీలను కూడా రద్దు చేయాల్సి ఉంటుంది! పేదలు తమ పిల్లలను బడికి పంపకుండా కూలీకి తీసుకుపోవడంతో అక్షరాస్యత పెరగడం లేదు. అక్షరాస్యతను పెంచడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేద కుటుంబాలకు సంవత్సరానికి ఉచితంగా రూ. 12,500 ఇవ్వడంతో వారు పిల్లలను పాఠశాలకు పంపిస్తున్నారు. ఆ విధంగా విద్య వ్యాప్తి జరుగుతున్నది. మరి ఈ సహాయాన్ని ఆపాలంటారా? కాలేజీలలోగానీ, యూనివర్సిటీలలో గానీ పేదలకు అనేక రాయితీలు ఉన్నాయి. వైద్య రంగంలో ఆరోగ్యశ్రీ పేరుతో ఉచిత వైద్యం చేయిస్తున్నారు. ఈ ఉచితాలన్నింటినీ లెక్కవేసినా... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లలో 15 శాతానికి మించవు. కానీ, కార్పొరేట్ సంస్థలు ఈ రాయితీలను రద్దు చేయాలనీ, తమకు అనుకూల విధానాలు తేవాలనీ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి.



దీంతో ప్రభుత్వం కార్పొరేట్లకు తలొగ్గింది. సెప్టెంబర్ 2019న ఒక జీఓ ద్వారా కార్పొరేట్లు చెల్లించే 30 శాతం పన్నును 22 శాతానికి తగ్గించారు. మార్చి 2033 నాటికి 25 శాతం నుండి 15 శాతానికి తగ్గిస్తామని ప్రకటించారు. విదేశాలలో 35 నుండి 40 శాతం పన్నులు వసూలు చేస్తున్నారు. కానీ, ఇక్కడ పన్నులు తగ్గిస్తున్నారు. విజయ్ మాల్యా, నీరవ్ మోదీ లాంటివాళ్ళు 13 రంగాలలో మోసాలు చేసి లక్షల కోట్లు ఎగనామం పెట్టారు. 2019 ఏప్రిల్ 14కు ముందు రూ. 7 లక్షల కోట్లు వారి ఖాతాల నుండి 'రైట్ ఆఫ్' చేశారు. నిరర్థక ఆస్తుల పేర 10 లక్షల కోట్లు రీక్యాపిటలైజేషన్ చేశారు. రూ. 2.11 లక్షల కోట్లు బెయిల్ ఔట్ కింద ఇచ్చారు.

జర్మనీ, జపాన్, ఇంగ్లాండ్, ఇటలీ తదితర దేశాలలో కార్పొరేట్లపై 30–40 శాతం పన్నులు వసూళ్ళు చేయడంతోపాటు నెలవారీ వేతనాలపై పన్ను వసూలు చేస్తూ ఆహార, ఇతర సంక్షేమ సబ్సిడీలు పెద్ద ఎత్తున ఇస్తున్నారు. ఈ విషయాలు తెల్సినప్పటికీ భారత దేశంలో ఉచితాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రాయితీలను రద్దుచేసి, కార్పొరేట్లకు బహిరంగంగా లాభాలు కట్టబెట్టడానికి చేస్తున్న ప్రయత్నమే ఇది. కేంద్రం ప్రకటించిన 'ఉచితాల రద్దు విధానాన్ని' ఉపసంహరించుకోవాలి.

వ్యాసకర్త అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు

ఆ ఎరుకే వైరాగ్యం

చూడడం, వినడం వలన శరీరం మొదలు విశ్వమంతా వ్యాపించి ఉన్న అశాశ్వతమైన భోగ విలాసాల పట్ల విరక్తి కలగడమే వైరాగ్యం. చాలా మందికి వైరాగ్యమంటే భయం. సంపదలు, సంసారం అంటూ తాత్కాలిక సుఖాల వెంట పరుగుతీస్తారు. వైరాగ్యమిచ్చే సంతోషాన్ని మరేదీ అందించలేదని గీతాచార్యుడు బోధించింది తెలుసుకుని మసలుకోవాలంటే తగిన పరిపూర్ణత రావాలి.



సుకుమారంగా అంతఃపురం గోడల మధ్య పెరిగిన బుద్ధుడు, శవాన్నీ, రోగినీ, ముదుసలినీ చూసి 'మనుషులంతా రోగ పీడితులు, ముసలివాళ్ళు కావాల్సిందేనా? మరణించాల్సిందేనా?' అన్న ఆలోచనలతో మానవుల బాధలకు పరిష్కారం అన్వేషించడానికి బయల్దేరాడు. అదే ఆయనలో వైరాగ్యానికి తొలిమెట్టు వేసింది. 'నా మీద చూపించిన ప్రేమను, అనురాగాన్ని జగదభిరాముడి మీద చూపించి ఉంటే మీకు మోక్షం వచ్చేదని' పలికిన భార్య దెప్పి పొడుపులకు సంసార సుఖాల మీద వ్యామోహం పోయింది తులసీదాసుకు. జగానికి 'రామచరిత మానస్' దక్కింది.

మృతుల, యుద్ధవీరుల రక్తం ఏరులై ప్రవహించడాన్ని కళింగ యుద్ధంలో చూసిన అశోక చక్రవర్తిలో 'ఇంతమందిని చంపితే వచ్చే రాజ్యాన్ని ఎలా పరిపాలిస్తామనే' భావన ప్రవేశించింది. ఆయనలో వైరాగ్యం మొదలయింది. ప్రపంచంలోని సంపదలూ, బంధాలూ అన్నీ అశాశ్వతమనే ఎరుక వైరాగ్యానికి దారితీస్తుంది. ఇదే ప్రశాంత జీవనానికి మార్గం చూపుతుంది.
– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

క్లుప్తంగా

నర్సాపూర్-యశ్వంతపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నర్సాపూర్-యశ్వంత్‌పూర్ మధ్య నాలుగు ప్రత్యేక రైలు సర్వీసులను నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. నర్సాపూర్-యశ్వంత్‌పూర్ (07153) ప్రత్యేక రైలు ఈ నెల 9, 11 తేదీలలో మధ్యాహ్నం 3.20 గంటలకు నర్సాపూర్‌లో బయల్దేరి.. మరుసటిరోజు ఉదయం 10.50 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు(07154) ఈ నెల 10, 12 తేదీలలో మధ్యాహ్నం 3.50 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయల్దేరుతుంది. ఈ రైలు పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నర్సరావుపేట, దొనకొండ, మార్కాపురం రోడ్డు, నంధ్యాల, డోన్, అనంతపూర్, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, యలహంక స్టేషన్లలో ఆగుతుంది.

టీడీపీ నేత నారాయణ యూఎస్ పర్యటనకు హైకోర్టు అనుమతి

సాక్షి, అమరావతి: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ డిజైన్ల ముసుగులో సాగిన భూ దోపిడీపై ఇటీవల సీఐడీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో నిందితుడిగా ఉన్న టీడీపీ నేత, మాజీ మంత్రి పొంగూరు నారాయణ బెయిల్ షరతుల సడలింపు కోసం బుధవారం అత్యవసరంగా హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మూడు నెలల వైద్య చికిత్స కోసం అమెరికా వెళ్లేందుకు నారాయణకు అనుమతినిచ్చారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

కాకినాడ ఘటన.. విద్యార్థులంతా డిశ్చార్జ్

కాకినాడ క్రైం: కాకినాడ కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం అస్వస్థతకు గురై జీజీహెచ్‌లో చేరిన విద్యార్థులందరినీ బుధవారం డిశ్చార్జి చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీవీ బుద్ధా తెలిపారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి పూర్తి స్థాయిలో మెరుగుపడిందన్నారు. మరింత మెరుగైన పరీక్షలు నిర్వహించి అస్వస్థతకు కారణాలను తెలుసుకునేందుకు విద్యార్థుల రక్త, మూత్ర నమూనాలను హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఐఐసీడీ)కు పంపామన్నారు.

'బాబు అండ్ కోకు ప్రజా క్షేత్రంలో శిక్ష తప్పదు'

తాడికొండ : అవకాశవాద రాజకీయాలకు అమరావతిని అడ్డుపెడుతున్న బాబు అండ్ కోకు ప్రజా క్షేత్రంలో శిక్ష తప్పదని బహుజన పరిరక్షణ సమితి నేతలు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 710వ రోజు కొనసాగుతున్న రిలే దీక్షలకు బుధవారం పలువురు ప్రసంగించారు.

వైరల్ జ్వరాలకు ఆరోగ్యశ్రీ రక్ష

పథకం కింద ఉచితంగా చికిత్స చేస్తున్న ప్రభుత్వం

- ఎలీసా నిర్ధారణతోసంబంధం లేకుండానే డెంగ్యూకి ఉచిత వైద్యం
- జనవరి నుంచి ఆగస్టు చివరకు మలేరియాకు ఉచిత చికిత్స పొందిన 689 మంది
- డెంగీకి ఉచిత వైద్యం పొందినవారి సంఖ్య 6,343



సాక్షి, అమరావతి: సీజనల్ జ్వరాల బారినపడుతున్న ప్రజలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం అండగా నిలుస్తోంది. ఓ వైపు వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వం సమర్థవంతంగా చర్యలు చేపడుతూనే.. మరోవైపు జ్వరాలబారిన పడిన వారికి ఉచిత వైద్య సేవలు అందిస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు రాష్ట్రంలో 1,237 మలేరియా, 2,174 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో సీజనల్ వ్యాధుల బారినపడే వారికి ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స లభిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటే చికిత్సలన్నింటినీ ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీ కింద చేసే చికిత్సల సంఖ్యను ప్రభుత్వం ఏకంగా 2,446కు పెంచింది. త్వరలో వీటిని 3,118కి పెంచనుంది.

7,032 మందికి చికిత్స

ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు రాష్ట్రవ్యాప్తంగా 689 మంది మలేరియా బాధితులు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్స పొందారు. వైరల్ జ్వరాల బారినపడిన వారిలో ప్లేట్‌లెట్స్ తగ్గుదల సమస్య ఉంటోంది. ఈ క్రమంలో ఎలీసా నిర్ధారణ పరీక్షతో సంబంధం లేకుండా వైరల్ జ్వరంతో బాధపడుతూ.. ర్యాపిడ్ కిట్‌లో పాజిటివ్ ఉన్నవారికి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా డెంగ్యూ చికిత్స అందిస్తున్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా జనవరి నుంచి ఆగస్టు వరకు 6,343 మంది చికిత్స పొందారు. వీరిలో అత్యధికంగా అనంతపురం జిల్లా నుంచి 1,612 మంది ఉన్నారు.

పరీక్షతో సంబంధం లేకుండా డెంగ్యూకి ఉచిత చికిత్స..

ఎలీసా పరీక్ష ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 2,174 డెంగ్యూ కేసులను మాత్రమే నిర్ధారించారు. ఎలీసా పరీక్షలో పాజిటివ్‌గా నిర్ధారణ అయితేనే డెంగ్యూ ఉన్నట్టు. అయితే కొన్ని రకాల వైరల్ జ్వరాల్లో ఎముక మజ్జ అణచివేత (బోన్‌మ్యారో సప్రెషన్)తో ప్లేట్‌లెట్స్ తగ్గుతున్నాయి. ఈ క్రమంలో వైరల్ జ్వరాల బారినపడి.. ప్లేట్‌లెట్స్ తగ్గినవారికి ఎలీసా పరీక్షతో సంబంధం లేకుండా డెంగ్యూకు చికిత్స అందించాలని కేంద్రం సూచించింది. ఇలాంటి పరిస్థితులున్న బాధితులకు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్స అందిస్తున్నాం. – డాక్టర్ రామిరెడ్డి, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకులు

జనవరి నుంచి ఆగస్టు వరకు జిల్లాల వారీగా మలేరియా, డెంగ్యూకు ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు పొందినవారు ఇలా..

జిల్లా	డెంగ్యూ	మలేరియా
అల్లూరి సీతారామరాజు	70	91
అనకాపల్లి	84	28
అనంతపురం	1,612	22
అన్నమయ్య	182	26
బాపట్ల	46	0
చిత్తూరు	237	19
తూర్పుగోదావరి	118	7
ఏలూరు	158	6
గుంటూరు	67	4
కాకినాడ	529	17
అంబేద్కర్ కోనసీమ	90	2
కృష్ణా	303	44
కర్నూలు	151	3
నంద్యాల	279	33
ఎన్టీఆర్	158	33
పల్నాడు	86	2
పార్వతీపురం మన్యం	106	75
ప్రకాశం	195	5
ఎస్పీఎస్ఆర్ నెల్లూరు	272	7
శ్రీ సత్యసాయి	591	41
శ్రీకాకుళం	169	11
తిరుపతి	223	19
విశాఖపట్నం	130	9
విజయనగరం	104	107
పశ్చిమగోదావరి	54	5
వైఎస్సార్	329	73
మొత్తం	6,343	689

కారుతో ఢీకొట్టి తమ్ముడిని హత్య చేసిన అన్న

ప్రకాశం జిల్లాలో ఆస్తి వివాదం నేపథ్యంలో దారుణం

త్రిపురాంతకం : స్థల వివాదంతో తోడబుట్టిన తమ్ముడిని అన్న కారుతో ఢీకొట్టి ప్రాణం తీశాడు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం గొల్లపల్లికి చెందిన కంచర్ల ఏడుకొండలు(30), అతని అన్న వెంకటేశ్వర్లుకు మధ్య ఐదు సెంట్ల స్థలం విషయంలో వివాదం నెలకొంది. తరచూ దాని గురించి తగాదాలు పడుతున్నారు. అన్నదమ్ములిద్దరూ డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి కూడా స్థలం విషయమై ఘర్షణ పడ్డారు. గొడవ జరిగాక ఏడుకొండలు నేషనల్ హైవేపై నడుచుకుంటూ వెళ్తుండగా.. వెంకటేశ్వర్లు కారుతో ఢీకొట్టాడు. దీంతో ఏడుకొండలు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి మూడేళ్ల కుమార్తె ఉండగా.. గర్భిణి అయిన భార్య యల్లమ్మ కాన్పు కోసం పుట్టింటికి వెళ్లింది. తల్లి రమణమ్మ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి వెంకటేశ్వర్లును అరెస్టు చేశారు.

ప్రతిభావంత క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం

- మంత్రి ఆర్కే రోజా
- జగనన్న స్పోర్ట్స్ క్లబ్ యాప్ ఆవిష్కరణ



జగనన్న స్పోర్ట్స్ క్లబ్ యాప్ లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా. చిత్రంలో ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీ మోహన్, శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి, ఎండీ ప్రభాకర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం ఆమె సచివాలయంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీమోహన్, శాప్ ఎండీ ప్రభాకర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. క్రీడాకారులకు పలు ప్రయోజనాలను చేకూర్చే జగనన్న స్పోర్ట్స్ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జగనన్న స్పోర్ట్స్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు వివరించారు. ప్రతి గ్రామంలోను జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌ల ఏర్పాటు, రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, జగనన్న స్పోర్ట్స్ యాప్‌ను క్రీడాకారులు ఉపయోగించుకునే విధానం, నూతన స్పోర్ట్స్ పాలసీ సవరణలపై ఈ సందర్భంగా సమీక్షించారు. జగనన్న స్పోర్ట్స్ యాప్‌పై విస్తృతంగా ప్రచారం చేసి రాష్ట్రంలోని స్పోర్ట్స్ క్లబ్బులు, క్రీడాకారుల సమాచారం పొందుపరిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడాకారులు ఈ యాప్‌లో తమ క్రీడకు సంబంధించిన సమాచారాన్ని పొందుపరచడం ద్వారా క్రీడాశాఖ ద్వారా ప్రోత్సాహకాలు అందించేందుకు వీలవుతుందని మంత్రి పేర్కొన్నారు.

అన్న క్యాంటీన్ల పేరుతో ఘర్షణలకు టీడీపీ కుట్ర

అనవసర విషయాలను అడ్డంపెట్టుకొని టీడీపీ రాజకీయం చేస్తోందని మంత్రి ఆర్కే రోజా మండిపడ్డారు. బుధవారం ఆమె తాడేపల్లిలో మాట్లాడుతూ.. అన్న క్యాంటీన్ల పేరుతో రాష్ట్రంలో ఘర్షణ వాతావరణం సృష్టించేందుకు టీడీపీ కుట్రలు చేస్తోందని ధ్వజమెత్తారు. చంద్రబాబుకు ఎన్టీఆర్‌పై అంత ప్రేమ ఉంటే 2014లో టీడీపీ అధికారంలోకి రాగానే ఎందుకు అన్న క్యాంటీన్లను ప్రారంభించలేదని ప్రశ్నించారు.

కనుల పండువగా గణనాథుడి రథోత్సవం


అశేష భక్తజనం మధ్య వినాయకుడి రథోత్సవం

కాణిపాకం(యాదమరి): వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కాణిపాకంలో గణనాథుడి రథోత్సవం కనుల పండువగా సాగింది. రాష్ట్రం నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వర్షం కురుస్తున్నా భక్తులు ఏమాత్రం వెనక్కు తగ్గకుండా జై గణేషా.. జైజై గణేషా.. అంటూ రథాన్ని ముందుకు కదిలించారు. ఉదయం రథోత్సవ ఉభయదారుల ఆధ్వర్యంలో మూలమూర్తికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి పూజలు చేసి దర్శనం కల్పించారు. అనంతరం అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అభిషేకాలు చేసి సుగంధ పుష్పాలతో అలకరించి పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నత క్రీడా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప స్పోర్ట్స్ : దేశంలోనే అత్యున్నతమైన క్రీడా అవార్డులు మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న, అర్జున, ద్రోణాచార్య, రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహక్ పురస్కార్, మౌలానా అబుల్‌కలాం ఆజాద్ పురస్కార్ కోసం అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని శాప్ సీఈవో డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో 2018 నుంచి 2022 కామన్‌వెల్త్ గేమ్స్ వరకు పతకాలు సాధించిన మహిళ, పురుష క్రీడాకారులు ఈ నెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తూ అర్హత కలిగిన వారు విజిలెన్స్ విభాగం నుంచి పొందిన ధ్రువీకరణపత్రాన్ని తప్పనిసరిగా దరఖాస్తుతోపాటు జతచేయాలని తెలిపారు.

మరణం అంచున.. నరకయాతన!

- గోదావరి వంతెన రైలింగ్‌ను ఢీకొట్టిన బైక్
- నదిలో పడే క్రమంలో వంతెనకు ఉన్న చెక్క బల్లపై పడిపోయిన బాధితుడు
- క్రేన్ సాయంతో రక్షించిన పోలీసులు

ఆలమూరు : మరణానికి కేవలం ఒకే ఒక్క అడుగు దూరం ఉండి కొన్ని గంటల పాటు నరక యాతన అనుభవించి.. ఎట్టకేలకు ప్రాణాలతో బయటపడ్డాడు. కోనసీమ జిల్లా రావులపాలెం ఇందిరా కాలనీకి చెందిన చిర్రా ప్రదీప్‌కుమార్ రాజమహేంద్రవరంలోని ఓ ప్రయివేటు కంపెనీలో హోమ్‌గార్డ్. బుధవారం విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా గౌతమీ గోదావరి కొత్త వంతెనపై వాహనాన్ని తప్పించబోయి రైలింగ్ పక్కన ఉన్న కాంక్రీట్ గోడను ఢీకొట్టి గోదావరిలో జారిపోయాడు. అదృష్టవశాత్తు గోదావరి నదికి, వంతెన పైభాగానికి మధ్యనున్న చెక్కబల్లపై పడ్డాడు. తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో ప్రదీప్ కుమార్ హెల్మెట్ ధరించడం వల్ల బలమైన గాయాలు కాలేదు. గాయాలు తట్టుకోలేక, మరో పక్క గోదావరిలో పడిపోతానన్న భయంతో ఆర్తనాదాలు చేశాడు. ఆ అరుపులు విన్న ప్రయాణికులు వెంటనే పోలీసులకు, హైవే సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. క్రేన్‌ను తెప్పించి పోలీసులు కిందకు దిగి తాడు సాయంతో అతన్ని పైకి తీసుకొచ్చారు. వెంటనే ఎన్‌హెచ్ 16 అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించాక.. రావులపాలెంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ప్రదీప్‌కుమార్ ఒక్క అడుగు ముందుకైనా, వెనుకనైనా పడి ఉంటే.. నీటిలో మునిగి ప్రాణాలు పోయేవని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు, హైవే సిబ్బంది సకాలంలో స్పందించకున్నా పరిస్థితి మరోలా ఉండేదంటున్నారు.



క్రేన్ సాయంతో ప్రదీప్‌కుమార్‌ను పైకి లాగుతున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) బ్రిడ్జి దిగువన చెక్కపై పడి ఉన్న బాధితుడు

పేదరికాన్ని నిర్మూలించే సామర్థ్యం ఎనర్జీ రంగానికి ఉంది

- గ్రీన్ కాలర్ అగ్రిటెక్ సొల్యూషన్స్ వ్యవస్థాపకురాలు హేమలత అన్నామలై
- విశాఖలో ఘనంగా ఐఐపీఈ రెండో స్నాతకోత్సవం



బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): ప్రపంచవ్యాప్తంగా విద్యుత్, వంటకు సరైన ఇంధనం లేక అనేక కుటుంబాలు ఎదురుచూస్తున్నాయని గ్రీన్ కాలర్ అగ్రిటెక్ సొల్యూషన్స్ వ్యవస్థాపకురాలు హేమలత అన్నామలై అన్నారు. వారి పేదరికాన్ని నిర్మూలించే సామర్థ్యం ఎనర్జీ రంగానికి ఉందని చెప్పారు. బుధవారం విశాఖపట్నంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) యూనివర్సిటీ రెండో స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన హేమలత అన్నామలై మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎనర్జీ రంగం నుంచి ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం ఐఐపీఈ అందించిందని భావిస్తున్నట్లు తెలిపారు. ఇంధన రంగానికి సంబంధించి విద్యార్థుల భవిష్యత్తుతో దేశ భవిష్యత్ ముడిపడి ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏడుగురిలో ఒకరికి విద్యుత్ అందుబాటులో లేదన్నారు. ఇంకా మూడు బిలియన్ల ప్రజలు కిరోసిన్, కలప, బొగ్గు ఆధారంగానే వంటలు చేస్తున్నారని చెప్పారు. ఐఐపీఈ విద్యార్థులు నూతన ఆవిష్కరణలను చేసి ఎనర్జీ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. వేడుకల్లో భాగంగా 87 మందికి డిగ్రీ పట్టాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఐఐపీఈ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పీకే బానిక్, ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై యాసిడ్ దాడి కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్) : బాలికపై యాసిడ్‌తో దాడి చేసి గొంతుకోసి నగదు, బంగారంతో ఉడాయించిన ఘటనలో నిందితుడు నాగరాజును బుధవారం నెల్లూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్పీ సీహెచ్ విజయారావు వివరాలు వెల్లడించారు. వెంకటాచలం మండలం చెముడుగుంట నక్కల కాలనీకి చెందిన దంపతులకు 14 ఏళ్ల కుమార్తె ఉంది. ఆ బాలిక మేనత్త కుమారుడు నెల్లూరు నాగరాజు వ్యసనాలకు బానిసై ఎలాగైనా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 5వ తేదీ బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండటంతో ఆమెపై యాసిడ్‌తో దాడి చేసి చెవి కమ్మలు దోచుకుని ఆమె గొంతుకోశాడు. బాలిక అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో మృతి చెందిందనుకుని బీరువాలోని రూ.నాలుగు వేలు దోచుకెళ్లాడు. కేసు నమోదు చేసిన వెంకటాచలం పోలీసులు నిందితుడిని అతని ఇంటి వద్దే అరెస్ట్ చేసి చోరీ సొత్తు, యాసిడ్ బాటిల్, కత్తి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ వివరించారు.

కుటుంబ పరిరక్షణ యాత్ర: బీజేపీ

భారత్ జోడో యాత్రను సోనియా కుటుంబాన్ని, కాంగ్రెస్ పార్టీపై వారి పెత్తనాన్ని కాపాడుకునేందుకు, రాహుల్‌గాంధీని నాయకునిగా నిలబెట్టేందుకు చేస్తున్న విఫలయత్నంగా బీజేపీ అభివర్ణించింది. సొంత పార్టీనే ఐక్యంగా ఉంచుకోలేని వాళ్లు దేశాన్ని సమైక్యపరుస్తామంటూ బయల్దేరడం విడ్డూరమని బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్ ఎద్దేవా చేశారు.

కవలలే గానీ... తండ్రులు వేరు



బ్రెజిల్‌లో ఓ 19 ఏళ్ల యువతి కవలలకు జన్మనిచ్చింది. ఇందులో విశేషం ఏముందంటారా? చాలా పెద్ద విశేషమే ఉంది. ఆ కవలలిద్దరికీ తండ్రులు వేర్వేరు! నమ్మశక్యంగా లేకపోయినా ఇది నిజమే. సదరు యువతి ఒకే రోజున ఇద్దరు యువకులతో శారీరకంగా కలవడం ఇందుకు దారి తీసిందట!! పిల్లలకు 8 నెలలు వచ్చాక అసలు వారి తండ్రి ఎవరా అని ఆమెకు అనుమానం వచ్చింది. వారి తండ్రిగా తాను భావిస్తున్న యువకునికి పితృత్వ పరీక్ష చేయించగా కవలల్లో ఒకరి డీఎన్ఏతో మాత్రమే సరిపోయిందట. దాంతో ఆమెతో పాటు డాక్టర్లు కూడా ఆశ్చర్యపోయారు. కాసేపు ఆలోచించిన మీదట, తాను అదే రోజు మరో యువకునితో శారీరకంగా కలిసిన విషయం ఆమెకు గుర్తొచ్చింది. డీఎన్ఏ పరీక్ష చేయించగా రెండో బాబుకు అతనే తండ్రి అని తేలింది! ''ఇది అత్యంత అరుదైన సంగతి. 10 లక్షల్లో ఒక్క కేసులో మాత్రమే ఇలా జరిగేందుకు ఆస్కారముంటుంది'' అని డాక్టర్లు చెబుతున్నారు. శాస్త్రీయంగా దీన్ని హెటరో పేరెంటల్ సూపర్ ఫెకండేషన్ (బహుళ పిండోత్పత్తి)గా పిలుస్తారట. ఒకే రోజు ఇద్దరు పురుషులతో శారీరకంగా కలిసి, సదరు స్త్రీ తాలుకు రెండు అండాలు వారి వీర్య కణాలతో వేర్వేరుగా ఫలదీకరణ చెందితే ఇలా జరుగుతుందట. ఫలితంగా తయారయ్యే రెండు పిండాలూ వేర్వేరు మావి (ఉమ్మనీటి సంచి)లో పెరుగుతాయట. మనుషుల్లో అత్యంత అరుదే అయినా పలు జంతువుల్లో మాత్రం ఇది కాస్త సాధారణమేనని వైద్య నిపుణులు చెబుతున్నారు.

47 శాతం యాంటీబయోటిక్స్‌కు అనుమతుల్లేవ్

బోస్టన్ వర్సిటీ, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: భారత్‌లో ప్రైవేట్ రంగంలో యాంటీ బయోటిక్స్ వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది. సెంట్రల్ డ్రగ్ రెగ్యులేటర్ అనుమతులు లేని యాంటీబయోటిక్స్‌ను సైతం వైద్యులు యాంటీబయోటిక్స్‌ను సిఫార్సు చేస్తున్నారు. 2019లో దేశంలో ఉపయోగించిన వాటిలో 47 శాతానికి పైగా యాంటీ బయోటిక్స్‌కు ఎలాంటి అనుమతులు లేవని తాజా అధ్యయనంలో తేలింది. అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీ, న్యూఢిల్లీలోని పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన ఈ అధ్యయనం వివరాలను 'లాన్సెట్ రీజినల్ హెల్త్–సౌత్‌ఈస్టు ఆసియా' జర్నల్‌లో ప్రచురించారు. 2019లో అత్యధికంగా అజిత్రోమైసిన్ 500 ఎంజీ ట్యాబ్లెట్‌ను 7.6 శాతం మంది, సెఫిక్సైమ్ 200 ఎంజీ ట్యాబ్లెట్‌ను 6.5 శాతం మంది ఉపయోగించినట్లు అధ్యయనంలో తేలింది. ఇదంతా ప్రైవేట్ రంగంలో సాగిందే. ప్రభుత్వ రంగంలో వాడిన యాంటీబయోటిక్స్‌ను ఇందులో చేర్చలేదు. అనుమతుల్లేని యాంటీబయోటిక్స్ ఫార్ములేషన్స్‌లో తొలి మూడు స్థానాల్లో సెఫాలోస్పోరిన్స్, మాక్రోలైడ్స్, పెన్సిలిన్స్ ఉన్నాయి. ఇండియాలో యాంటీబయోటిక్స్ వాడకంపై నిఘా పెట్టేందుకు సరైన వ్యవస్థలు లేవని హైదరాబాద్‌లోని యశోదా హాస్పిటల్‌లో కన్సల్టింగ్ ఫిజీషియన్, డయాబెటాలజిస్టుగా పనిచేస్తున్న డాక్టర్ హరికిషన్ బూగూరు చెప్పారు. అనుమతి లేని ఔషధాలను విచ్చలవిడిగా వాడితే రోగులకు ముప్పు తప్పదని హెచ్చరించారు.

క్లుప్తంగా...

రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి నెలకొనాలి: మోదీ



న్యూఢిల్లీ : రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతియుత వాతావరణం నెలకొనడానికి తాము పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. రష్యాతో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి సిద్ధంగా ఉన్నామని ఇంధన రంగంలో పరస్పర సహకారానికి అవకాశాలున్నాయని చెప్పారు. రష్యాలోని వ్లాడివోస్తోక్‌లో బుధవారం నిర్వహించిన ఈస్టర్న్ ఎకనామిక్ ఫోరమ్‌లో ఆన్‌లైన్ ద్వారా పాల్గొని ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ సదస్సుకి రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ కూడా హాజరయ్యారు. ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలైనప్పట్నుంచి చర్చల ద్వారా శాంతియుత పరిష్కారం జరగాలనే భారత్ గట్టిగా చెబుతోందని గుర్తు చేశారు. ఇరు దేశాల మధ్య శాంతి నెలకొనడానికి తాము మద్దతునిస్తామని చెప్పారు. ప్రపంచమంతా ఒక్కటే కుటుంబంగా మారిపోవడంతో ఎక్కడ ఏం జరిగినా యావత్ ప్రపంచంపై దాని ప్రభావం పడుతోందని మోదీ అన్నారు. దీనికి ఉక్రెయిన్ యుద్ధం, కరోనాయే ఉదాహరణని పేర్కొన్నారు.

సరిహద్దు వాణిజ్యానికి వసతులు పెంచండి

షేక్ హసీనాను కోరిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రాలు, బంగ్లాదేశ్ మధ్య బోర్డర్ హాట్స్, ఇంటిగ్రేటెడ్ చెక్ పాయింట్లు, ల్యాండ్ కస్టమ్ స్టేషన్స్ వ్యవస్థలను బలోపేతం చేయడం వంటి చర్యల ద్వారా సరిహద్దు వాణిజ్యానికి మరింత ఊతం లభిస్తుందని కేంద్ర ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సరిహద్దు వాణిజ్యానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని బుధవారం ఢిల్లీలో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో భేటీ సందర్భంగా కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. విద్యుత్, వ్యవసాయం, తేయాకు ఎగుమతికి బంగ్లాదేశ్ రేవుల సహకారం, పర్యాటకం తదితర రంగాల్లో భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే అంశాలనూ కిషన్‌రెడ్డి, హసీనా చర్చించారు. హసీనా సమక్షంలో ఇరుదేశాల పారిశ్రామిక వేత్తల సదస్సు (సీఈవో కాన్ఫరెన్స్)ను ఉద్దేశించి కిషన్ ప్రసంగించారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇరుదేశాల మధ్య అనుసంధానత తదితర అంశాలకు పుష్కలమైన అవకాశాలున్నాయని తెలిపారు.

'నీట్-యూజీ' ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: నీట్–అండర్ గ్రాడ్యుయేట్(యూజీ) మెడికల్ ప్రవేశ పరీక్ష ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బుధవారం ప్రకటించింది. దేశ వ్యాప్తంగా 9.93 లక్షల మంది అర్హత సాధించారు. రాజస్తాన్‌కు చెందిన తనిష్క టాప్ ర్యాంకు దక్కించుకున్నారు. ఢిల్లీకి చెందిన వత్స ఆశిష్ బాత్రా రెండో ర్యాంకు, కర్ణాటకకు చెందిన హృషికేశ్ నాగభూషణ్ గంగూలీ మూడో ర్యాంకు సాధించారు. ఈ ఏడాది నీట్–యూజీ మెడికల్ ప్రవేశ పరీక్షకు 17.64 లక్షల మంది హాజరయ్యారు. అత్యధికంగా ఉత్తరప్రదేశ్ నుంచి 1.17 లక్షల మంది, మహారాష్ట్ర నుంచి 1.13 లక్షల మంది, రాజస్తాన్ నుంచి 82,548 మంది అర్హత పొందారు.

యాత్ర మొదలైంది

కాంగ్రెస్ 'భారత్ జోడో' పాదయాత్రకు కన్యాకుమారిలో రాహుల్ శ్రీకారం

- మతం, భాష పేరిట దేశ విభజన
- ప్రమాదపుటంచున త్రివర్ణ పతాకం
- మోదీ పాలనపై రాహుల్ నిప్పులు
- పెరంబుదూర్‌లో రాజీవ్‌కు నివాళులు
- ఆయన్ను బలిగొన్నది విద్వేషమే
- దేశాన్ని బలి కానివ్వనని వ్యాఖ్య





పాదయాత్ర ప్రారంభించి నడుస్తున్న రాహుల్

సాక్షి, చెన్నై: బీజేపీ, ఆరెస్సెస్ దేశాన్ని పథకం ప్రకారం మతం, భాష పేరిట నిలువునా విభజిస్తున్నాయంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దుయ్యబట్టారు. ''అన్ని మతాలకు, ప్రాంతాలకు, రాష్ట్రాలకు సొంతమైన త్రివర్ణ పతాకాన్ని తమ సొంత ఆస్తిగా బీజేపీ, ఆరెస్సెస్ భావిస్తున్నాయి. దేశంలో మోదీ సర్కారు దాడికి గురవని వ్యవస్థ, సంస్థ అంటూ లేవు. బీజేపీ అసమర్థ పాలన వల్ల దేశం ఎన్నడూ లేనంతటి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. నిరుద్యోగిత ఎన్నడూ లేనంతగా పెరిగిపోయింది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు, త్రివర్ణ స్ఫూర్తిని కాపాడుకునేందుకు పౌరులంతా కలిసి రావాలి'' అంటూ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ భారత్ జోడో పాదయాత్రను బుధవారం తమిళనాడులోని కన్యాకుమారిలో ఆయన త్రివర్ణ పతాకాన్ని ఊపి లాంఛనంగా ప్రారంభించారు. సముద్ర తీరంలో దివంగత సీఎం కె.కామరాజ్ స్మారక మందిరం దాకా పాదయాత్ర చేశారు. అనంతరం పార్టీ నేతలను, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ''దేశ సమైక్యత కోసం తక్షణం చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని కోట్లాది మంది పౌరులు భావిస్తున్నారు. అందుకే ఈ యాత్ర'' అని ప్రకటించారు.

''మోదీ సర్కారు అచ్చం బ్రిటిష్ పాలకుల్లా విభజించి పాలించు సూత్రాన్నే అమలు చేస్తోంది. రైతులు, ఉద్యోగులు, కార్మికులు, వ్యాపారులు... ఇలా ప్రతి వర్గాన్నీ పథకం ప్రకారం పీడిస్తోంది. వారిని కొట్టి ఒకరిద్దరు బడా బాబులకు దేశాన్ని దోచిపెడుతోంది. వారు లేకుండా మోదీ ఒక్క రోజు కూడా రాజకీయంగా మనలేరు. అప్పట్లో ఈస్టిండియా కంపెనీ దేశాన్ని నియంత్రించేది. ఇప్పుడు దేశాన్ని ఓ మూణ్నాలుగు బడా కంపెనీల నియంత్రణలోకి బీజేపీ సర్కారు నెట్టింది. దీనిపై ప్రశ్నించకుండా మీడియాను అణగదొక్కుతోంది. విపక్షాలు నిలదీయకుండా ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థల ద్వారా భయపెట్టజూస్తోంది. కానీ ఎంత వేధించినా ఒక్క విపక్ష నాయకుడూ భయపడబోడు. ఈ త్రివర్ణం మనకు అంత తేలిగ్గా లభించలేదు. కానుకగానూ రాలేదు. ప్రాణాలకు తెగించి పోరాడి సాధించుకున్నది. అలాంటి జాతీయ పతాకమే ఇప్పుడు ఆరెస్సెస్, బీజేపీ కాషాయీకరణ తాలూకు ముట్టడిలో ఉంది'' అన్నారు.

12 రాష్ట్రాలు, 150 రోజులు, 3,570 కి.మీ.

కన్యాకుమారి నుంచి కశ్మీర్ దాకా సాగే భారత్ జోడో యాత్రకు రాహుల్ సారథ్యం వహించనున్నారు. 119 మంది కాంగ్రెస్ నేతలు ఆయనతో పాటు కలిసి నడుస్తారు. 12 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల గుండా 3,570 కిలోమీటర్ల దూరం 150 రోజుల పాటు యాత్ర సాగుతుంది. దీన్ని స్వతంత్ర భారతదేశంలో ఒక రాజకీయ పార్టీ తలపెట్టిన అత్యంత సుదీర్ఘ యాత్రగా కాంగ్రెస్ అభివర్ణిస్తోంది. డీఎంకే అధినేత, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ రాహుల్ చేతికి జాతీయ పతాకాన్ని అందించారు. కన్యాకుమారిలోని గాంధీ స్మారకం వద్ద రాహుల్‌కు ఆయన స్వాగతం పలికారు. సామూహిక ప్రార్థనల అనంతరం ప్రఖ్యాత వివేకానంద శిలా స్మారకాన్ని రాహుల్ సందర్శించారు. గాంధీ స్మారక మండపంలో ధ్యానం చేశారు. రఘుపతి రాఘవ రాజారాంతో పాటు తమిళ మహాకవి సుబ్రమణ్య భారతి రచించిన పలు దేశభక్తి గీతాల ఆలాపన నడుమ యాత్రను ప్రారంభించారు. ''దేశ సమగ్రతకు, సమైక్యతకు, వైవిధ్యానికి, ఆత్మగౌరవానికి చిహ్నమైన త్రివర్ణాన్ని చేబట్టి భారత్ జోడో యాత్రలో ఈ రోజు తొలి అడుగు వేస్తున్నాం. నడవాల్సిన దూరం ఎంతో ఉంది. అంతా కలిసి దేశాన్ని మరోసారి సమైక్యం చేద్దాం రండి'' అంటూ ట్వీట్ చేశారు.

చరిత్రాత్మక సందర్భం: సోనియా

భారత్ జోడోయాత్రను చరిత్రాత్మక సందర్భంగా కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ అభివర్ణించారు. పార్టీ పునరుజ్జీవానికి ఇది దోహదపడుతుందని ఆశాభావం వెలిబుచ్చారు. ఇది దేశ రాజకీయాలను కూడా మేలిమలుపు తిప్పే సందర్భమన్నారు. ''వైద్య పరీక్షల నిమిత్తం విదేశాల్లో ఉన్నందున యాత్రలో పాల్గొనలేకపోతున్నా. కానీ మానసికంగా యాత్రలో ప్రతి రోజూ పాల్గొంటూనే ఉంటా'' అంటూ ఆమె సందేశం పంపారు.

రాజీవ్‌కు నివాళులు



యాత్ర ప్రారంభానికి ముందు శ్రీపెరంబుదూరులో దివంగత ప్రధాని, తన తండ్రి రాజీవ్‌గాంధీకి రాహుల్ ఘనంగా నివాళులు అర్పించారు. విద్వేష, విభజన రాజకీయాలే తన తండ్రిని బలి తీసుకున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. దేశాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వాటికి బలిపెట్టబోనన్నారు. ''ద్వేషాన్ని ప్రేమ, భయాన్ని ఆశ జయిస్తాయి (అన్బు వెరుప్పె వెల్లుం). . కలసికట్టుగా సమస్యలను అధిగమిద్దాం'' అంటూ తమిళంలో ట్వీట్ చేశారు. రాజీవ్ స్మారకం వద్ద మొక్క నాటారు. 1991 మే 21న లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా శ్రీపెరంబుదూరులో ఎల్టీటీఈ ఆత్మాహుతి దాడికి రాజీవ్ బలవడం తెలిసిందే.

యాత్ర సాగేదిలా...



గురువారం ఉదయం ఏడింటికి కన్యాకుమారిలో రాహుల్ తదితరులు యాత్రకు శ్రీకారం చుడతారు. ఉదయం 10.30 దాకా, తిరిగి మధ్యాహ్నం 3.30 నుంచి 6.30 దాకా సగటున రోజుకు 23 కిలోమీటర్లు పాదయాత్ర సాగుతుంది. తిరువనంతపురం, కొచ్చి, నీలంబూర్, మైసూర్, బళ్లారి, రాయచూర్, వికారాబాద్, నాందేడ్, జల్‌గావ్, ఇండోర్, కోటా, దౌసా, ఆళ్వార్, బులంద్‌షహర్, ఢిల్లీ, అంబాలా, పఠాన్‌కోట్, జమ్మూ గుండా సాగి శ్రీనగర్‌లో ముగుస్తుంది. సెప్టెంబర్ 11న యాత్ర కేరళలో ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో 18 రోజులు సాగాక సెప్టెంబర్ 30న కర్నాటకలోకి ప్రవేశిస్తుంది. 21 రోజుల అనంతరం వికారాబాద్ వద్ద తెలంగాణలోకి ప్రవేశించనుంది. యాత్రలో పాల్గొనేందుకు ఇప్పటిదాకా 50 వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారు.

గుర్తింపులేని పార్టీలపై ఐటీ కన్ను

దేశవ్యాప్తంగా 110 ప్రాంతాల్లో దాడులు

న్యూఢిల్లీ: రిజిస్టర్ అయినా గుర్తింపులేని రాజకీయ పార్టీల కార్యకలాపాలపై ఆదాయ పన్ను శాఖ ముకుమ్మడి దాడులు జరిపింది. ఢిల్లీ, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హరియాణా సహా పలు రాష్ట్రాల్లోని 110 ప్రాంతాల్లో ఐటీ శాఖ అధికారులు ఆకస్మిక సోదాలు చేపట్టారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. చట్టవ్యతిరేక మార్గాల్లో పొందిన నిధుల గురించి దర్యాప్తు కొనసాగుతోంది. నమోదైన గుర్తింపులేని రాజకీయ పార్టీలు పన్ను ఎగవేతకు పాల్పడ్డాయని, వాటి చట్టవ్యతిరేక ఆర్థిక లావాదేవీల గుట్టుమట్లు తేల్చేందుకు కేసులు నమోదుచేసి ఐటీ శాఖ దర్యాప్తు కొనసాగిస్తోంది. సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్(సీపీఆర్), ఎక్స్‌ఫామ్ ఇండియా, ఒక మీడియా ఫౌండేషన్ కార్యాలయాల్లోనూ సోదాలు జరిగాయి. విదేశీ నిధుల(నియంత్రణ)చట్టాన్ని ఉల్లంఘించారనే ఆరోపణలపై దాడులు చేశారు. రాజకీయ పార్టీల సారథులు, పార్టీలతో సంబంధమున్న సంస్థల ఆదాయ వనరులు, వ్యయాలపై అధికారులు ఆరాతీస్తున్నారు. నేరుగా తనిఖీచేసినపుడు ఆయా పార్టీలు మనుగడలో లేవని తేలడంతో 198 పార్టీలను ఈసీ ఇటీవల ఆర్‌యూపీపీ జాబితా నుంచి పక్కన పెట్టి ఐటీ శాఖకు సమాచారమిచ్చింది. నగదు విరాళాలు, కార్యాలయాల చిరునామాల అప్‌గ్రేడ్, పదాధికారుల జాబితా ఇవ్వడం, పారదర్శకత పాటించడంలో విఫలమైన 2,100 పార్టీలపై ఈసీ చర్యలు తీసుకుంటోంది.

నేడు కర్తవ్య పథ్‌ను ప్రారంభించనున్న ప్రధాని

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలో రాష్ట్రపతి భవన్ నుంచి ఇండియా గేట్ దాకా ఉన్న ప్రఖ్యాత 'రాజ్‌పథ్' మార్గం పేరు కర్తవ్య పథ్‌గా మారనుంది. ఆధునీకరించిన కర్తవ్యపథ్ పరిసరాలను ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ప్రారంభించనున్నారు. అలాగే ఇండియా గేట్ వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని కూడా మోదీ ఆవిష్కరించనున్నారు. తెలంగాణలోని ఖమ్మంలో సేకరించిన ఏకశిలా గ్రానైట్ రాయితో 28 అడుగుల ఎత్తైన ఈ విగ్రహాన్ని శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కారు. దీని బరువు 65 మెట్రిక్ టన్నులు.

బెంగాల్ న్యాయ మంత్రిపై సీబీ'ఐ'



న్యూఢిల్లీ/కోల్‌కతా: బొగ్గు కుంభకోణం వ్యవహారంలో పశ్చిమ బెంగాల్ న్యాయ శాఖ మంత్రి మొలోయ్ ఘటక్ నివాసాల్లో సీబీఐ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. పశ్చిమ బర్ధమాన్ జిల్లా అసన్‌సోల్‌లోని మూడు ఇళ్లు, కోల్‌కతాలోని రెండు ఇళ్లల్లో ఈ సోదాలు జరిగాయి. కోల్‌కతాలో ఘటక్ సన్నిహితుడికి చెందిన ఒక ఇంట్లో, దక్షిణ 24 పరగణాల జిల్లాలోని డైమండ్ హార్బర్‌లో మరో ఇంట్లోనూ సోదాలు చేపట్టినట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు. అసన్‌సోల్‌లో ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్‌కు చెందిన గనిలో తవ్విన బొగ్గును కొందరు స్వాహా చేసినట్లు ఫిర్యాదు అందడంతో సీబీఐ ఇప్పటికే కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తోంది. మంత్రి మొలోయ్ ఘటక్‌ను కోల్‌కతాలోని ఆయన అధికారిక నివాసంలో సీబీఐ బృందం ప్రశ్నించింది. బొగ్గు స్మగ్లింగ్ కుంభకోణంలో మంత్రిపేరు తెరపైకి వచ్చిందని, ఇందులో ఆయన భాగస్వామ్యం ఉన్నట్లు తమకు సాక్ష్యాధారాలు లభించాయని అధికారులు పేర్కొన్నారు. మంత్రి నుంచి కొన్ని ప్రశ్నలకు సమాధానాలు రాబట్టేందుకు ప్రయత్నించామని చెప్పారు. ఘటక్ వద్ద పనిచేస్తున్న చార్టెర్డ్ అకౌంటెంట్‌ను కూడా ప్రశ్నించామన్నారు. అసన్‌సోల్‌లో ఘటక్ ఇంట్లో బీరువా తాళాలు అందుబాటులో లేకపోవడంతో అధికారులు దాన్ని బద్దలు కొట్టినట్లు తెలిసింది. మంత్రి ఇళ్లల్లో సీబీఐ సోదాల సందర్భంగా కేంద్ర పారామిలటరీ సిబ్బంది భారీగా మోహరించారు. బొగ్గు స్మగ్లింగ్ కేసులో ఘటక్ గతంలో ఒకసారి ఢిల్లీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఎదుట విచారణకు హాజరయ్యారు.

రూ.27,360 కోట్లతో 'పీఎం-శ్రీ'

- ఐదేళ్లలో దేశవ్యాప్తంగా 14,597 పాఠశాలల అభివృద్ధి
- కేంద్ర మంత్రివర్గం ఆమోదం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం–శ్రీ) పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పీఎం–శ్రీ యోజన, పీఎం గతిశక్తికి సంబంధించిన రైల్వే ల్యాండ్ పాలసీ సవరణకు ఆమోదం తెలిపారు. పలు ఇతర కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేరళలో రూ.1,957 కోట్లతో కొచ్చీ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో పరస్పరం సహకరించుకోవడానికి వీలుగా భారత్–మాల్దీవుల మధ్య ఇటీవల కుదిరిన అవగాహనా ఒప్పందానికి(ఎంఓయూ) ఆమోదం తెలియజేసింది. విద్యార్థులకు లబ్ధి చేకూరేలా ఒక దేశంలోని కోర్సులు, విద్యార్హతలను మరో దేశం గుర్తించేలా యూకే–భారత్ మధ్య కుదిరిన అవగాహనా ఒప్పందాన్ని కేబినెట్ ఆమోదించింది. పీఎం–శ్రీ కింద ఐదేళ్లలో రూ.27,360 కోట్లతో దేశవ్యాప్తంగా 14,597 పాఠశాలలను పీఎం–శ్రీ స్కూళ్లుగా అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు.

35 ఏళ్లకు రైల్వే భూముల లీజు

రైల్వే కొత్త ల్యాండ్ పాలసీ ప్రతిపాదనలో కార్గో, పబ్లిక్ యుటిలిటీ, రైల్వేల ప్రత్యేక వినియోగాల్లో సవరణలు చేశారు. రైల్వే భూమిని దీర్ఘకాలిక లీజుకు ఇచ్చే విధానం రాబోయే 90 రోజుల్లో అమలవుతుందని కేంద్ర సమాచార మంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు. ''ఐదేళ్లలో 300 కార్గో టెర్మినళ్లను అభివృద్ధి చేస్తాం. తద్వారా 1.25 లక్షల మందికి ఉపాధి దొరుకుతుంది. కార్గో టెర్మినళ్లతో సరుకు రవాణాలో రైల్వే వాటా కూడా పెరుగుతుంది'' అని తెలిపారు. దన్నారు.

ఆధునిక విద్యకు పెద్దపీట

పీఎం–శ్రీ స్కూళ్లలో ఆధునిక విద్యావిధానం అమలు చేస్తారు. స్మార్ట్ తరగతి గదులు, క్రీడలు, సదుపాయాలపై పథకం దృష్టి సారిస్తుంది. వీటిని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారు. దీనికింద రాష్ట్రాలు, స్కూళ్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పథకంతో 18.7 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని అంచనా.

కాస్త తేరుకున్న బెంగళూరు



ఓ గేటెడ్ కమ్యూనిటీలో పడవ ప్రయాణాలు

బెంగళూరు: రెండ్రోజులుగా బెంగళూరుపై పగబట్టిన వరుణుడు కాస్త శాంతించాడు. దీంతో నగరం కొంచెం తెరిపిన పడింది. అయినా, వర్ష బీభత్సం తాలూకు ఆనవాళ్లు ఇంకా స్పష్టంగా కనిపిస్తున్నాయి. వరద నీరు కొన్ని చోట్ల తగ్గిపోయినా, ఇంకా జనం రవాణాకు ట్రాక్టర్లనే ఆశ్రయిస్తున్నారు. ఉత్తర బెంగళూరులోని ఎప్సిలాన్ వంటి విలాసవంత గేటెడ్ కమ్యూనిటీ వంటి కొన్ని ప్రాంతాల్లో వరద నీరు ఏ మాత్రం తగ్గుముఖం పట్టలేదు. బైక్‌లు, ఖరీదైన కార్లు ఇంకా వరదనీటిలోనే మునిగి ఉన్నాయి. సంపన్నులు నివసించే మాన్యతా టెక్‌పార్క్ ప్రాంతాన్ని వరదనీరు చుట్టుముట్టడంతో జనం ఇళ్లలోంచి బయటకురాలేక అవస్థలు పడుతున్నారు. ట్రాక్టర్లు, చిన్నపాటి పడవల్లో సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. వరదమయమైన ప్రాంతాలు ఇప్పుడు బురదమయమయ్యాయి. వర్షపు నీటిని కాలనీల నుంచి తొలగించేందుకు స్థానిక సిబ్బంది ఆపసోపాలు పడుతున్నారు. నగరం జలమయం కావడంతో పాలనాయంత్రాంగంపై బెంగళూరు వాసులు ఆగ్రహంతో ఉన్నారు.

'ఆ తర్వాతే' ప్రధాని అభ్యర్థి: నితీశ్

న్యూఢిల్లీ: బీజేపీని ఓడించేందుకు ప్రధాన విపక్షాలన్నీ ఒకే తాటి మీదకు రావడం అత్యంత ప్రధానమని జేడీ(యూ) నేత, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పునరుద్ఘాటించారు. బుధవారం ఢిల్లీలో ఆయన ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌ను కలిశారు. 'ముందుగా అందరం ఒక్కటవుదాం. తర్వాత మన నేతగా ఒకరిని ఎంచుకుందాం. బీజేపీయేతర పార్టీల కూటమి ఎప్పటికీ మూడో ఫ్రంట్ కాబోదు. దాన్ని ప్రధాన ఫ్రంట్‌గానే చూడాలి'' అని నితీశ్ వ్యాఖ్యానించారు. సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్యతోనూ ఆయన భేటీ అయ్యారు. ''రాహుల్ గాంధీ, సీతారాం ఏచూరి, డి.రాజా, కేజ్రీవాల్, ములాయం సింగ్, అఖిలేశ్‌లను కలిశా. బీజేపీతో తెగతెంపులు చేసుకుని మంచిపనే చేశావని వారు అభినందించారు. బీజేపీకి బలమైన ప్రత్యామ్నాయం ఏర్పడాల్సిన సమయం ఆసన్నమైంది'' అని నితీశ్ అన్నారు.

అందరికీ విద్య అందేదెన్నడు?



దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయినప్పటికీ అక్షరాస్యతలో ఇంక వెనుకబడే ఉన్నాం. 2030 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. విద్యా రంగంలో నెలకొన్న సవాళ్లతో పాటు పులి మీద పుట్రలా కరోనా మహమ్మారి విసిరిన పంజాతో 100% అక్షరాస్యత సుదూర స్వప్నంగా మారింది. ప్రజల్లో విద్యపై అవగాహన పెంచడానికి యునెస్కో ప్రతీ ఏడాది సెప్టెంబర్ 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.1966 నుంచి విద్యపై విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రపంచ నిరక్షరాస్యుల్లో 34% మంది భారత్‌లోనే ఉండడం ఆందోళన కలిగించే అంశం. ప్రపంచవ్యాప్తంగా కరోనా తర్వాత 2.4 కోట్ల మంది తిరిగి బడిలో చేరలేదు. వారిలో 1.1 కోట్ల మంది అమ్మాయిలున్నారు.

కరోనా ప్రభావం

కరోనా లాక్‌డౌన్లతో దేశంలో 15లక్షల స్కూళ్లు మూత పడ్డాయని, 24.7 కోట్ల విద్యార్థులు ఏడాది పాటు చదువుకి దూరమయ్యారని యునెస్కో వెల్లడించింది. తర్వాత కూడా 30% విద్యార్థులు తిరిగి స్కూళ్లలో చేరలేదని చెబుతోంది.

సాధించిన పురోగతి ఇదీ..

దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పట్నుంచి ఇప్పటివరకు అక్షరాస్యతలో గణనీయమైన పురోగతి సాధించాం. ఏడేళ్ల వయసు కంటే ఎక్కువ ఉన్న వారు ఏదో ఒక భాషలో చదవడం, రాయడం వస్తే వారిని అక్షరాస్యులుగా పరిగణిస్తారు. 1951లో 18.3% ఉన్న అక్షరాస్యత రేటు 2022 వచ్చేసరికి 77.7శాతానికి పెరిగింది. మొదట్లో అక్షరాస్యతలో లింగ వివక్ష అధికంగా ఉండేది. దానిని కూడా క్రమక్రమంగా దాటుకుంటూ వస్తున్నప్పటికీ అమ్మాయిల్లో అక్షరాస్యత ఇంకా సవాళ్లు విసురుతోంది. 1961లో కేవలం 15.4% మంది మహిళా జనాభా అక్షరాస్యులైతే ఆ తర్వాత పదేళ్లకి 1971లో 22% 2001 నాటికి 53.7% , 2022 నాటికి 70శాతం మహిళలు అక్షరాస్యులయ్యారు. అన్నింటికంటే మైనార్టీ విద్యార్థుల్లో డ్రాప్‌అవుట్‌ల నివారించడంలో భారత్ కొంతమేరకు విజయం సాధించింది. కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ గణాంకాల ప్రకారం 2015–16లో ఒకటి నుంచి ఆరో తరగతి వరకు దాదాపుగా 9% ఉన్న డ్రాపవుట్లు 2020–21కి 0.8శాతానికి తగ్గాయి. ప్రాథమిక పాఠశాలలు 10 రెట్లు పెరిగాయి.

ప్రపంచ అక్షరాస్యత	86.5%
దేశంలో అక్షరాస్యత	77.7%
పురుషుల అక్షరాస్యత	84.7%
మహిళల అక్షరాస్యత	70.3%
పట్టణాల్లో అక్షరాస్యత	87.7%
గ్రామాల్లో అక్షరాస్యత	73.5%

అక్షరాస్యతలో టాప్ 5 రాష్ట్రాలు

రాష్ట్రం పేరు	అక్షరాస్యత	పురుషులు	మహిళలు
కేరళ	96.2%	96.11%	92.07%
ఢిల్లీ	88.7%	90.94%	87.33%
ఉత్తరాఖండ్	87.6%	87.4%	70.01%
హిమాచల్ ప్రదేశ్	86.6%	89.53%	75.93%
అసోం	85.9%	77.85%	66.27%

ఎదురవుతున్న సవాళ్లు

సంపూర్ణ అక్షరాస్యత సాధనకు పలు సవాళ్లు ఎదురవుతున్నాయి. పేదరికం, తల్లిదండ్రుల అవగాహన లేమి, లింగ, కుల వివక్ష, సదుపాయాల లేమి, సాంకేతిక పరిజ్ఞానం అందకపోవడం వంటివన్నీ భారత్‌లో అనుకున్న స్థాయిలో అక్షరాస్యతను పెంచలేకపోతున్నాయి. గ్రామీణ నిరుపేదలకు స్కూళ్లు అందుబాటులో ఉండటం లేదు. పూట గడవని ఉండే కుటుంబాలు పిల్లల్ని పలక బలపం బదులు పలుగు పార పట్టిస్తున్నారు. దేశంలో ఏకంగా కోటి మంది చిన్నారులు బడికి వెళ్లడానికి బదులుగా బాలకార్మికులుగా మారారు. 2022 నాటికి పట్టణ ప్రాంతాల్లో అక్షరాస్యత 87.7% ఉంటే గ్రామీణ భారతంలో 73.5% ఉన్నట్టుగా నేషనల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక చెబుతోంది. దీనికి కారణం గ్రామాల్లో ఉన్న తల్లిదండ్రులకే అక్షరజ్ఞానం లేకపోవడంతో వారికి చదువు ప్రాధాన్యం గురించి తెలియక పిల్లల్ని బడికి పంపించడం లేదు. అమ్మాయిల్లో అక్షరాస్యత తక్కువగా ఉండడానికి బాల్య వివాహాలు, పాఠశాలల్లో టాయిలెట్ సదుపాయం లేకపోవడమే ప్రధాన కారణాలని పలు సర్వేల్లో తేలింది. ఇప్పటికీ దేశంలో 40% పాఠశాలల్లో టాయిలెట్ సదుపాయం లేదు. జీడీపీలో 6% విద్యా రంగానికి ఖర్చు చేస్తేనే అక్షరాస్యత రేటు పెరుగుతుందని నిపుణులు సూచిస్తూ ఉంటే 3% కూడా పెట్టడం లేదు.

– సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 8 । సెప్టెంబర్ । 2022



అందరినీ ఆకట్టుకునే 'అల్లూరి'

అల్లూరి చిత్ర యూనిట్ విజయవాడలో సందడి చేసింది. హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ అల్లూరి సినిమా సకుటుంబ సమేతంగా చూడదగినదని పేర్కొన్నారు. -8లో▸



ఘనంగా బీఓఐ వ్యవస్థాపక దినోత్సవం

బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) 117వ వ్యవస్థాపక దినోత్సవం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. -8లో▸



బాలగణపతి సన్నిధిలో పీవీ సింధు

వన్‌టౌన్: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా విజయవాడ వన్‌టౌన్ పూజారి వారి వీధిలోని బాలగణపతిని బుధవారం బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు దర్శించుకున్నారు.

కేడీసీసీబీకి కన్నం!

- బినామీ పేర్లతో రూ.35 కోట్లు హాంఫట్
- టీడీపీ హయాంలో అక్రమాలు జరిగాయని నిగ్గుతేల్చిన అధికారులు
- సొమ్ము రికవరీపై దృష్టి
- లోతుగా విచారిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయంటున్న ఖాతాదారులు

వెలుగులోకి టీడీపీ నాయకుల స్వాహా పర్వం

సాక్షి, మచిలీపట్నం: కేడీసీసీ బ్యాంకులో అధికారాన్ని అడ్డంపెట్టుకుని టీడీపీ నాయకులు సాగించిన స్వాహా పర్వం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉన్నవి లేనట్లు చూపిస్తూ.. బినామీ పేర్లతో రూ. కోట్ల రుణాలు దండుకున్న వ్యవహారం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. కొందరు బ్యాంకు అధికారులు వారితో కుమ్మక్కై ఈ తంతు జరిగించినట్లు తెలుస్తోంది.

ఇదీ పరిస్థితి..

కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(కేడీసీసీబీ) పరిధిలో 2017–18 కాలంలో మాత్రమే రూ.35 కోట్లకుపైగా నిధులను టీడీపీ నేతలు స్వాహా చేశారు. పక్కా గృహాలు, నిర్మించిన నివాసాల కొనుగోలు పేరుతో రుణాలు తీసుకున్నారు. అంతగా విలువ లేని భూములకు మార్కెట్ విలువ ఉన్నట్లు చూపించారు. మరి కొందరు లేని భూములను ఉన్నట్లు చూపించి బ్యాంకు సొమ్మును దోచుకున్నారు. నిధులు దండుకున్న టీడీపీ నేతలు ఆ సొమ్మును సంబంధం లేని వ్యక్తులు తీసుకున్నట్లు రికార్డులు తారుమారు చేశారు. బాధిత ఖాతాదారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వం మారిన తర్వాత బాధిత ఖాతాదారులు మరోసారి పాలకవర్గానికి, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. స్పందించిన ప్రభుత్వం నిధుల స్వాహాపై విచారణ చేపట్టాలని ఆదేశించింది. పూర్తిస్థాయిలో విచారించిన అధికారులు ఆ అక్రమాలు నిజమేనని నిగ్గు తేల్చారు.



పెడనలోని కేడీసీసీబీ బ్రాంచ్

నిధుల రికవరీపై దృష్టి సారించారు.

కొన్ని ఉదాహరణలు..

- పెడన బ్రాంచ్‌లో ఓ రైతుకు 11 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అతను 2017లో కేడీసీసీ బ్యాంకులో తన భూమి పత్రాలను పెట్టి రూ.25 లక్షల రుణం తీసుకున్నారు. అయితే ఇదే భూమి 10 మందికి చెందినది అని పత్రాలను తారుమారు చేసి రూ.2 కోట్ల మేర రుణాలు తీసుకుని స్వాహా చేశారు. ఈ వ్యవహారంలో బ్యాంకులో పనిచేసే ఉన్నతాధికారి ఒకరు, పాలక వర్గానికి చెందిన కొందరు కలిసి వాటాలు పంచుకున్నట్లు తెలుస్తోంది. మొత్తం రూ.2.25 కోట్లు రుణం తీసుకున్న సొమ్మును ఏటా వాయిదాల పద్ధతిలో కట్టాల్సిన వివరాలతో బ్యాంకు అధికారులు సంబంధిత రైతు చిరునామాకు నోటీసు పంపారు. షాక్ తిన్న బాధిత రైతు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.
- పెడనకు చెందిన టీడీపీ నాయకులు, బ్యాంకు అధికారి ఒకరు కలిసి రెసిడెన్షియల్ ఏరియాలోని ఓ సర్వే నంబర్‌కు డాక్యుమెంట్లు సృష్టించారు. ఆ భూమిలో రియల్ ఎస్టేట్ వెంచర్ వేసినట్లు, అందుకు ఆ భూమిని కన్వర్షన్ చేసినట్లు రికార్డులు సృష్టించారు. ఆ పత్రాలతో కేడీసీసీ బ్యాంకులో రుణాలు తీసుకున్నారు. ఇలా రూ.20 కోట్లకుపైగా సొమ్మును స్వాహా చేశారు. సొమ్ము రికవరీ కోసం నోటీసులు పంపినా పట్టించుకోకపోవటంతో బ్యాంకు అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకునేందుకు వెళ్లారు. అయితే టీడీపీ నేతలు చూపించిన సర్వే నంబర్, ఆ అడ్రస్‌లో భూమి లేదని తేలటంతో షాక్ తిన్నారు.
- బందరుకు చెందిన టీడీపీ నేతలు ఆరుగురు కలిసి పక్కా గృహాలు నిర్మించుకునేందుకు గానూ రుణం కోసం కేడీసీసీ బ్యాంకును ఆశ్రయించారు. బ్యాంకు అధికారులు విచారణే జరపకుండా ఒక్కొక్కరికీ రూ.30 లక్షల చొప్పున రుణం మంజూరు చేశారు. రుణం తీసుకున్న వారు తిరిగి సొమ్ము చెల్లించకపోవటంతో బ్యాంకు అధికారులు విచారణ జరిపారు. ఇల్లు కట్టకుండానే, డూప్లికేట్ పత్రాలను పెట్టి రుణాలు తీసుకున్నట్లు తేలింది.
- బందరులో ఓ వ్యక్తికి చెందిన రూ.15 కోట్లు విలువచేసే భవనాన్ని ఆరుగురు వ్యక్తులకు సంబంధించినదిగా రికార్డులు సృష్టించారు. ఒక్కో వ్యక్తి రూ.40 లక్షల చొప్పున రుణాలను మంజూరు చేశారు. ఏటా కట్టాల్సిన సొమ్ము కట్టకపోవటంతో బ్యాంకు అధికారులు విచారణ జరపగా.. రుణాలు పొందిన వారికి ఆ భవనానికి ఎటువంటి సంబంధం లేదని తేలింది. అదేవిధంగా రూ.5 కోట్లు విలువచేసే ఓ భవనానికి పది రెట్లు విలువ పెంచి రుణాలు పొందినట్లు గుర్తించారు. ఇలా జిల్లా వ్యాప్తంగా టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున కేడీసీసీ బ్యాంకు నిధులను స్వాహా చేసినట్లు తేలింది. దీనిపై సీఈఓ శ్యామ్ మనోహర్‌ను వివరణ కోరగా.. ఖాతాదారుల ఫిర్యాదులపై దృష్టి సారించామని, స్వాహా అయిన సొమ్ము రికవరీ చేస్తున్నట్లు చెప్పారు.

రికవరీ చేస్తున్నాం..

గతంలో కొందరు టీడీపీ నాయకులు, అధికారులు కుమ్మక్కై నిధులు స్వాహా చేశారు. రికార్డులను తారుమారు చేసి, బినామీ పేర్లతో రుణాలు తీసుకున్నారు. తక్కువ విలువ ఉన్న భూములు, ప్లాట్లకు అత్యధిక విలువ చూపించి రుణాలు పొందారు. విచారణలో నిజాలు బహిర్గతమయ్యాయి. రూ.50 లక్షలు కూడా విలువ చేయని భూములను రూ.15 కోట్లు అని చూపించి లోన్‌లు తీసుకున్నారు. ఆ మొత్తం సొమ్మును రికవరీ చేస్తున్నాం. ఖాతాదారులకు ఎట్టి పరిస్థితుల్లో నష్టం జరగనివ్వం.

- తన్నీరు నాగేశ్వరరావు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్

అలసత్వాన్ని సహించం

గృహ నిర్మాణ శాఖ అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): 'రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహ నిర్మాణాలపై అలసత్వం వహిస్తే సహించేది లేదు. శాఖాపరమైన చర్యలు తీసుకోవడంలో వెనకాడబోం. అప్పగించిన పనులను గడువులోపు పూర్తి చేయాలి' అంటూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అధికారులను హెచ్చరించారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి జిల్లాలో గృహ నిర్మాణాల ప్రగతిపై బుధవారం కలెక్టర్ ఢిల్లీరావు ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణశాఖ ఏఈలు, మండల స్పెషల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని.. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. నిర్మాణాలకు అవసరమైన సామగ్రిని సమకూరుస్తున్నప్పటికీ లక్ష్యాలను సాధించలేకపోవడం సరికాదన్నారు. ఇకపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

డిసెంబర్ నెలాఖరుకు..

డిసెంబర్ చివరి నాటికి 15 వేల ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలన్న లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. వివిధ దశలలో ఉన్న నిర్మాణాలను పూర్తి చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించుకుని అమలు చేయాలన్నారు. వారం వారీగా నిర్దేశించుకున్న లక్ష్యాలను పూర్తి చేయడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్, డీఆర్వో కె. మోహన్ కుమార్, హౌసింగ్ పీడీ వి. శ్రీదేవి, ఈఈలు రవికాంత్, విజయబాబు, ఖాజావలి, రాంప్రసాద్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మకు బంగారపు హారం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు విశాఖపట్నంకు చెందిన భక్తులు బుధవారం బంగారు హారాన్ని కానుకగా అందజేశారు. విశాఖపట్నానికి చెందిన సారిపల్లి ఉమాదేవి కుటుంబం బుధవారం కనక దుర్గమ్మ వారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ ఈవో భ్రమరాంబను కలిసి సుమారు రూ. 2.50 లక్షల విలువైన 51. 5 గ్రాముల బంగారంతో తయారు చేసిన హారాన్ని బహూకరించింది. అమ్మవారి ఉత్సవాలలో బంగారు హారాన్ని అలంకరించాల్సిందిగా ఆలయ ఈవోను కోరింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితులు ఆశీర్వచనం అనంతరం దాతలకు ప్రసాదాలను అందజేశారు.

ఆర్థిక అంశాలపై అప్రమత్తత అవసరం

కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు



చిలకలపూడి(మచిలీపట్నం): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు, సంఘాలకు సంబంధించిన ఆర్థికపరమైన అంశాలపై అప్రమత్తంగా ఉండాలని కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు సూచించారు. మచిలీపట్నంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆప్కాబ్ ఆధ్వర్యంలో 'సహకార సంఘాల వ్యాపార వికేంద్రీకరణ–వాటి పరిపాలన' అనే అంశంపై శిక్షణ తరగతలను నిర్వహించారు. వీటిని ప్రారంభించిన అనంతరం చైర్మన్ తన్నీరు మాట్లాడుతూ సహకార సంఘాలను అభివృద్ధిలోకి తీసుకురావాలంటే సంఘ అధ్యక్షులు వారి బాధ్యతలు, హక్కులు తెలుసుకుని ఉండాలన్నారు. సహకార సంఘాల రోజువారీ లావాదేవీలను సంఘ అధ్యక్షులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. అప్పుడే ఏ సహకార సంఘంలో ఎలాంటి అవకతవకలు జరగవన్నారు. అశ్రద్ధ వహిస్తే సంఘాల్లో జరిగే అవినీతికి కార్యదర్శులతో పాటు అధ్యక్షులు బాధ్యులవుతారన్నారు. బ్యాంకు పాలకవర్గ సభ్యులు నల్లమోతు కోటి సూర్యప్రకాశరావు, గడిదేశి పెదవెంకయ్య, బ్యాంకు సీఈవో శ్యామ్‌మనోహర్, జీఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పెనమలూరు టీచర్‌కు ఇండియన్ ఐకాన్ అవార్డు



పెనమలూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్రకళ ఉపాధ్యాయుడిగా (డ్రాయింగ్ టీచర్) పని చేస్తున్న డాక్టర్ నడింపల్లి రవికుమార్‌కు 2022 సంవత్సరానికి గాను టాప్ టెన్ ఆర్టిస్టు ఆఫ్ ది ఇయర్ ఇండియన్ ఐకాన్ అవార్డు వరించింది. జాతిపిత మహాత్మా గాంధీ 150వ జయంతి సందర్భంగా 4x1 సెంటీ మీటర్‌ల పొడవు వెడల్పుతో పెన్సిల్ కొనపైన మినియేచర్ క్వారింగ్‌కు టాప్ టెన్ ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే చిత్రకళలలో తనకు 18 ప్రపంచ రికార్డులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు యలమంచిలి దుర్గాభవాని, ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు.

సాఫీగా.. సాగిపో

బందరులో ట్రా'ఫికర్'కు చెక్

- రూ. 2 కోట్లతో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ
- నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు
- శరవేగంగా పనులు, నెలాఖరుకు ప్రారంభం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని నాని కృషితో నిధులు మంజూరు

మచిలీపట్నంటౌన్: జిల్లాల విభజనతో మచిలీపట్నం నగరం అభివృద్ధిలో దూసుకుపోతోంది. భవిష్యత్తులో మెడికల్ కాలేజీ, పోర్టు ఏర్పాటు కానున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీ మరింత పెరగనుంది. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని తలంచిన ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) రాష్ట్ర రవాణాశాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే నగరానికి రోడ్డు సేఫ్టీ నిధులు రూ.2 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో రోడ్లు, భవనాలశాఖ ఇంజినీరింగ్ అధికారులు నగరంలోని ఐదు కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందుకు సంబంధించిన పనులు కూడా ప్రారంభించారు.

పనులు చకచకా..

ప్రధాన కూడళ్లైన కోనేరుసెంటర్, మూడు స్తంభాల సెంటర్, రేవతి సెంటర్, లక్ష్మీటాకీస్ సెంటర్, జెడ్పీ సెంటర్లలోని నాలుగు రోడ్లలోనూ ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను నెలకొల్పేందుకు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా ఆయా కూడళ్లలో అవసరమైన పైప్‌లైన్లను, విద్యుత్‌వైర్లను ఏర్పాటు చేశారు. పోల్స్‌కు సిగ్నల్ లైట్లను బిగించారు. మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేసి, సెప్టెంబరు నెలాఖరు నాటికి ప్రారంభించాలనే లక్ష్యంతో ఆర్‌అండ్ బీ, పోలీస్ అధికారులు అడుగులు వేస్తున్నారు.

సిద్ధమవుతున్న 100 ఐరన్ స్టాపర్లు..

ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగపడే 100 ఐరన్ స్టాపర్లను కూడా తయారు చేశారు. రోడ్ సేఫ్టీ నిధులతోనే వీటిని ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో తయారు చేశారు. ప్రస్తుతం వీటికి రంగులు వేసే పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తికాగానే పోలీస్‌శాఖకు వీటిని అప్పగించనున్నారు. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు వీటిని వినియోగించనున్నారు.



లక్ష్మీటాకీసు సెంటర్‌లో ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లు



సిద్ధమవుతున్న ఐరన్ స్టాపర్లు

నెలాఖరులోపు పనులు పూర్తి

నగరంలో ఐదు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. ఈ నెలాఖరులోపు పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం. ప్రస్తుతం పోల్స్, విద్యుత్ వైర్లు బిగించే పనులు పూర్తయ్యాయి. లైట్లు, ఇతర సాంకేతిక పనులు నిర్వహిస్తున్నాం.

- కాగిత శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ డీఈ

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా..

నగరంలో భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. రోడ్ సేఫ్టీ నిధులతో ఈ పనులు కొద్ది రోజుల్లో పూర్తి కానున్నాయి. సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే ట్రాఫిక్‌ను నియంత్రించే వీలు కలుగుతుంది. దీంతో రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు.

- పి.భరత్‌మాతాజీ, ట్రాఫిక్ డీఎస్పీ

ఐదు చోట్ల మహిళా మార్ట్‌లు

కృష్ణా డీఆర్‌డీఏ పీడీ దుర్గాప్రసాద్

పెడన : కృష్ణా జిల్లా వ్యాప్తంగా చేయూత మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని డీఆర్‌డీఏ పీడీ టి. శివరామప్రసాద్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో పెడన మండల మహిళా సమాఖ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా ఉప్పాడలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పెడన మండల మహిళా సమాఖ్య సభ్యులకు చూపించారు.

లాభాలు పంచుతాం..

అనంతరం పీడీ మహిళా సమాఖ్య సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో పెడన, మచిలీపట్నం, పెనమలూరు, ఉయ్యూరు, గుడివాడలో వీటిని ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్రణాళికలు రూపొందించామని, మూలధనం కింద డ్వాక్రా మహిళల నుంచి రూ.200 కట్టాల్సి ఉంటుందన్నారు. దీనికి గానూ మహిళా మార్ట్‌లో వచ్చే లాభాలను కూడా ఆయా గ్రూపులకు అందిస్తామని ఇదే విషయాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించామన్నారు. ఇప్పటికే చాలా మంది రూ.100 చొప్పున కట్టారని, అయితే మహిళా మార్ట్ ఏర్పాటు చేయడానికి ప్రస్తుత మార్కెట్ ధరను బట్టి చూస్తూ గతంలో రూ.20లక్షలు ఉండేది ఇప్పుడు రూ. 40లక్షలు వరకు అయిందని వివరించారు. అందుకే మూలధనం పెంచామన్నారు. డ్వాక్రా మహిళలు తీర్మానం పుస్తకంలో రాసుకుని.. సంబంధిత మండల స్థాయి అధికారులు ఆ తీర్మానంలో సంతకం చేస్తే అదే రశీదుగా పరిగణించి మహిళా మార్ట్ ద్వారా వచ్చే లాభాలను పంచుతామని స్పష్టం చేశారు. సమావేశంలో చేయూత డీపీఎం పి. రాజగోవింద్, స్త్రీ నిధి ఏజీఎం శ్యామలా, ఉన్నతి ఏపీఎం ఎ. విజయలక్ష్మి, పెడన ఏసీ పి. కనకారావు, ఏపీఎం వి. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శివరామప్రసాద్

అంకితభావంతో పనిచేయండి



కారుణ్య నియామకం, ఉద్యోగోన్నతి పొందిన సిబ్బందితో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో కారుణ్య నియామకాల ద్వారా నియమితులైన ఉద్యోగులు సీనియర్ల సూచనలను తీసుకుంటూ అంకితభావంతో పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక సూచించారు. జిల్లా పరిషత్ సమావేశపు హాలులో 21 మందికి కారుణ్య నియామకపత్రాలు, ముగ్గురు లైబ్రరీ అసిస్టెంట్లకు జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ బుధవారం నియామకపత్రాలు అందజేశారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ తమ పాలకవర్గం ఏర్పడిన అనంతరం 27 మందికి కారుణ్యనియామకాలు, 53 మందికి ఉద్యోన్నతులు కల్పించామన్నారు. ఇంకా కారుణ్య నియామకాలు ఇవ్వాల్సినవారు ఎక్కువ మంది ఉన్నారని వారికి కూడా త్వరలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈవో ఎస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




ముస్తాబవుతున్న దుర్గమ్మ



దసరా సమీపించడంతో దుర్గమ్మ విగ్రహాల తయారీ ఊపందుకుంది. ఈ నెల 25 నుంచి దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం కానుండటంతో అందుకనుగుణంగా తయారీ దారులు ప్రతిమలను సిద్ధం చేస్తున్నారు. కళాకారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విగ్రహాలకు జీవం పోస్తున్నారు. రెండేళ్లుగా కరోనా కారణంగా అమ్మవారి విగ్రహాల ఊసే లేకుండా పోయింది. అయితే ఈ ఏడాది ఎటువంటి ఆంక్షలు లేకపోవడంతో తయారీదారుల్లో ఉత్సాహం నెలకొంది. ముందస్తు ఆర్డర్లు కూడా వస్తుండటంతో వారు ఫుల్ జోష్‌లో ఉన్నారు. నున్న మ్యాంగో మార్కెట్ వద్ద దుర్గమ్మ ప్రతిమలకు తుది రూపునిస్తున్న కళాకారులను చిత్రంలో చూడొచ్చు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ. 1.85 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు రూ. 1.85 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడులు, ముడుపుల రూపంలో సమర్పించారు. ఆది దంపతులకు భక్తులు సమర్పించిన కానుకలను మహామండపం ఆరో అంతస్తులో బుధవారం లెక్కించారు. 14 రోజులకు 40 హుండీల ద్వారా రూ. 1,85,55,426 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో భ్రమరాంబ తెలిపారు. నగదుతో పాటు 488 గ్రాముల బంగారం, 4.215 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఇక ఆన్‌లైన్ ద్వారా రూ.75,601ను భక్తులు కానుకలుగా సమర్పించారన్నారు. లెక్కింపులో ఆలయానికి చెందిన వివిధ విభాగాల అధికారులు, సేవా సిబ్బంది పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లోనూ ఖడ్గమాలార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై ప్రతి నిత్యం అమ్మవారికి నిర్వహించే ఖడ్గమాలార్చనను ఈ ఏడాది దసరా ఉత్సవాలలోనూ నిర్వహించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. అయితే పూజను మూలవిరాట్ వద్ద కాకుండా ఉత్సవ మూర్తికి నిర్వహించనున్నారు. గతంలో దసరా ఉత్సవాలలో ఖడ్గమాలార్చనను అంతరాలయంలో ఆలయ అర్చకులు జరిపించేవారు. ఉభయదాతలెవరినీ పూజకు అనుమతించేవారు కాదు. ఈ ఏడాది దసరా ఉత్సవాలలో ఖడ్గమాలార్చన ప్రత్యేక్ష, పరోక్ష సేవగా నిర్వహించాలని ఆలయ అధికారులు వైదిక కమిటీ ముందు ప్రతిపాదన ఉంచడంతో.. పూజ టికెట్ ధర, సమయం, ఇతర అంశాలను ఈవో భ్రమరాంబ ఖరారు చేసి, టికెట్లను అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఆరో అంతస్తులో..

ఉత్సవాలలో ఖడ్గమాలార్చనను మహా మండపం ఆరో అంతస్తులో తెల్లవారుజామున 5 గంటల నుంచి ఆరు గంటల వరకు ఉత్సవ మూర్తి వద్ద నిర్వహించనున్నారు. టికెట్ ధరను రూ. 5,116గా నిర్ణయించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు అమ్మవారి దర్శనం కల్పిస్తారు. టికెట్లను ఆన్‌లైన్, దేవస్థాన టికెట్ల కౌంటర్‌లలో పొందవచ్చు. ఈ పూజను ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ నిర్వహిస్తారు. ఉత్సవాల్లో తొలి రోజు ఈ పూజ ఉండదని ఆలయ అధికారులు తెలిపారు.

కాకాని విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని వినతి



భవానీపురం (విజయవాడ పశ్చిమ): విజయవాడ బెంజి సర్కిల్ పై ఓవర్ నిర్మాణ పనుల నిమిత్తం తొలగించిన మాజీ మంత్రి, స్వాతంత్య్ర సమర యోధుడు కాకాని వెంకటరత్నం విగ్రహాన్ని అదే ప్రాంతంలో పునఃప్రతిష్ఠించాలని కాకాని ఆశయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను తరుణ్, సమితి గౌరవ అధ్యక్షుడు కోనేరు విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు మధు కోనేరు బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తరుణ్ మాట్లాడుతూ.. కాకాని వెంకటరత్నం నాయకత్వం వహించిన జై ఆంధ్ర ఉద్యమానికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి, 1972లో ప్రభుత్వం జారీ చేసిన జీఓ ప్రకారం సర్కిల్‌కు కాకాని సర్కిల్‌గా నామకరణం చేసేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని విన్నవించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా గత నెల 13న తనతోపాటు సమితి గౌరవ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం తరఫున సత్కరించారని గుర్తు చేశారు.

నందిగామకు చినవెంకన్న ధర్మ ప్రచార రథం



ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ధర్మ ప్రచార రథం ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామకు బుధవారం సాయంత్రం పయనమైంది. ముందుగా దేవస్థానం అధికారులు ఆలయ అనివెట్టి మండప ప్రాంతంలో కొబ్బరికాయ కొట్టి రథాన్ని ప్రారంభించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ రథం నందిగామకు తరలివెళ్లింది. నందిగామలో శ్రీవారు, అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని గురువారం ఉదయం 10 గంటలకు అట్టహాసంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. సాయంత్రం ధర్మ ప్రచార రథం తిరిగి క్షేత్రానికి చేరుకుంటుందని చెప్పారు.

పచ్చందాల వయ్యారి



నాడు వెలవెల.. పెనమలూరు శివారులో ఖరీఫ్‌కు ముందు బీడులా కనిపిస్తున్న పొలాలు



నేడు కళకళ.. కనుచూపు మేర పచ్చందాలు పులుముకుని కనువిందు చేస్తున్న వరి పొలాలు

కనుచూపు మేర ఎండిపోయిన భూములు. ఎడారిని తలపించిన వరి చేలు. ఒక్క వాన జల్లుతో దాహార్తి తీర్చుకున్నాయి. కృష్ణమ్మ జలాలతో అణువణువూ చివురు తొడిగాయి. రైతు స్వేదంతో తడిసి ముద్దయ్యాయి. ఎటు చూసినా పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. పల్లె అందాలకు పచ్చని పైర్లు మెరుగులు దిద్దాయి. కృష్ణా జిల్లా పెనమలూరు ప్రాంతంలో ఖరీఫ్‌కు ముందు, తరువాత వరి చేలు ఇలా దర్శనమిచ్చాయి.

– కందుల చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నదిలో దూకి వివాహిత ఆత్మహత్య

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): కృష్ణానదిలో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పెనమలూరు మండలం, పోరంకికి చెందిన కొత్తపల్లి తిరుమలరావు, కస్తూరి దంపతులకు ముగ్గురు సంతానం. రెండో కుమార్తె మౌనికను చిల్లకల్లు గ్రామానికి చెందిన వడ్రాణపు సతీష్‌కు ఇచ్చి 2019లో వివాహం చేశారు. పెళ్లయినప్పటి నుంచి సతీష్, వారి కుటుంబ సభ్యులు మౌనికను వేధిస్తుండటంతో తరచూ వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో తిరుమలరావు దంపతులు వారికి సర్దిచెప్పి వచ్చేవారు. అనంతరం మౌనిక దంపతులు వేరు కాపురం పెట్టారు. అయినా అత్తింటి వారి వేధింపులు తగ్గలేదు. ఈ నెల ఆరో తేదీ రాత్రి కస్తూరికి సతీష్ ఫోన్ చేసి మళ్లీ గొడవ జరిగిందని చెప్పాడు. దీంతో కస్తూరి తన కుమార్తెకు నచ్చజెప్పి ఓదార్చింది. బుధవారం ఉదయం ఏడున్నర గంటలకు సతీష్ మళ్లీ కస్తూరికి ఫోన్ చేసి మౌనిక ఇంట్లో కనపడటం లేదని చెప్పాడు. కొద్దిసేపటికి మౌనిక ఫోన్ నుంచి కస్తూరికి ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి మాట్లాడుతూ.. ఈ ఫోన్ కలిగిన అమ్మాయి ప్రకాశం బ్యారేజీ సమీపంలో కృష్ణా నదిలోకి దూకిందని చెప్పాడు. ఆందోళన చెందిన తిరుమలరావు దంపతులు హుటాహుటిన ప్రకాశం బ్యారేజీ వద్దకు చేరుకున్నారు. అప్పటికే గద్ద బొమ్మ సెంటర్ సమీపంలోని మెయిన్ కెనాల్‌లో మౌనికను స్థానికులు గుర్తించి బయటకు తీశారు. అప్పటికే ఆమె మృతిచెందిందని 108 సిబ్బంది నిర్ధారించారు. తల్లి కస్తూరి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బీఓఐ వ్యవస్థాపక దినోత్సవం



లబ్ధిదారులకు చెక్ అందజేస్తున్న ఎంపీ బాలశౌరి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, బీఓఐ అధికారులు

భవానీపురం (విజయవాడ పశ్చిమ): బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) 117వ వ్యవస్థాపక దినోత్సవం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి, ముఖ్యఅతిథిగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు తరాల ఖాతాదారులు, ఐదు దశాబ్దాలకుపైగా బ్యాంక్‌తో అనుబంధం కలిగిన ఖాతాదారులు, బ్యాంక్ పూర్వ సిబ్బందిని జోనల్ మేనేజర్ వి.వి.సోమశేఖర్, డెప్యూటీ జోనల్ మేనేజర్ డి.రామప్రసాదరావు, సిబ్బంది సన్మానించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతను నిర్వహిస్తున్న సాయి సందీప్ (బాడ్మింటన్), అభయ ఓపెన్ షెల్టర్ సంస్థ సేవలను కొనియాడుతూ వారిని సత్కరించారు. ఈ సందర్భంగా బ్యాంక్ విజయవాడ జోన్ బ్రాంచీస్ నుంచి మంజూరు చేసిన రూ.117 కోట్ల రుణాలను లబ్ధిదారులకు అందజేశారు. కొంత మంది ఖాతాదారులకు రుణ మంజూరు లేఖలను అందించారు.

నేత్ర దానంపై అపోహలను తొలగించాలి



మాట్లాడుతున్న ఫరీదా

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ ఏకే ఫరీదా అన్నారు. పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో బుధవారం రాత్రి ఎల్‌వీ ప్రసాద్ (కోడె వెంకట్రాది చౌదరి క్యాంపస్) ఆధ్వర్యంలో 37వ జాతీయ నేత్రదాన దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఫరీదా మాట్లాడుతూ.. నేత్రదానం చేయడం అంటే మరొకరికి చూపు ప్రసాదించినట్లేనని అన్నారు. నేత్ర దానంపై ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, చాలా మంది నేత్ర దానం చేసేలా ప్రోత్సహిస్తున్నాయని కొనియాడారు. ప్రభుత్వపరంగా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. 37 ఏళ్లుగా సేవలు అందిస్తున్న ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్ ప్రతినిధులను అభినందించారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు చదలవాడ నాగేశ్వరరావు, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ డాక్టర్లు అరవింద్ రాయ్, అనసువ తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఏడాదిగా నేత్ర దానం చేసిన వారిని, నేత్రదానం చేసేలా ప్రోత్సహించిన స్వచ్ఛంద సంస్థల సభ్యులు 88 మందిని అతిథులు సత్కరించారు. జాతీయ నేత్ర దాన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

ట్రాలీ ఢీకొని మహిళ దుర్మరణం



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు రింగ్ సమీపంలో బుధవారం ద్విచక్రవాహనాన్ని ట్రాలీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. పోలీసుల కథనం మేరకు.. మైలవరం సమీపంలోని గణపవరం రెడ్డి బజారుకు చెందిన వెంకటనరసమ్మ, భాస్కరరెడ్డి భార్యాభర్తలు. వారు విజయవాడ ప్రభుత్వాస్పత్రికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. రామవరప్పాడు రింగ్ సమీపంలోకి వచ్చే సరికి గన్నవరం నుంచి గుంటూరు వైపు ఐరన్ లోడుతో వెళ్తున్న ట్రాలీ అదుపు తప్పి వెంకటనరసమ్మ, భాస్కరరెడ్డి ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భాస్కరరెడ్డి ఎగిరి ఒకవైపు పడటంతో తీవ్రగాయాలయ్యాయి. కింద పడిన వెంకట నరసమ్మ మీదుగా ట్రాలీ చక్రాలు వెళ్లడంతో శరీరం ఛిద్రమై అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఈ సమాచారం అందుకున్న పటమట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కృష్ణా వర్సిటీ రిజిస్ట్రార్ పదవీకాలం పొడిగింపు

మచిలీపట్నం టౌన్: కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఎం.రామిరెడ్డి పదవీకాలాన్ని ఏడాది పాటు పెంచుతూ ఉపకులపతి కె.బి.చంద్రశేఖర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 9వ తేదీతో రిజిస్ట్రార్ రామిరెడ్డి పదవీకాలం ముగియనుంది. ఈ నేపథ్యంలో పదవీకాలాన్ని పెంచుతూ ఉన్నత విద్యామండలి నిబంధనలకు అనుగుణంగా వీసీ చంద్రశేఖర్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. మరో ఏడాది పాటు రామిరెడ్డి రిజిస్ట్రార్‌గా కొనసాగుతారు.

12న ప్లేస్‌మెంట్ డ్రైవ్

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఎన్టీఆర్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటు విద్యాసంస్థలో ఉద్యోగాలు చూపించేందుకు ఈ నెల 12వ తేదీన ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎన్టీఆర్ జిల్లా అధికారి పి.నరేష్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీచైతన్య విద్యాసంస్థలోని వివిధ విభాగాల్లో 153 పోస్టులను భర్తీ చేసేందుకు ఈ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ పోస్టులకు అర్హులని సూచించారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు ఈ నెల 12వ తేదీలోగా ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. 12వ తేదీ ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మొగల్రాజపురం కోనేరు లక్ష్మయ్య వీధిలో ఉన్న శ్రీచైతన్య ఐఐటీ అకాడమీ ఆవరణలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 77996 69907 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): వివాహిత అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కొత్తూరు తాడేపల్లి అంబేద్కర్ బొమ్మ ప్రాంతానికి చెందిన మౌనికకు వివాహం కాగా భర్తతో విభేదాల కారణంగా కొన్ని రోజులుగా పుట్టింట్లోనే ఉంటుంది. 6వ తేదీ సాయంత్రం దుర్గ నిద్రలేచి చూసే సరికి ఇంట్లో మౌనిక కనిపించ లేదు. దీంతో కుమార్తె కోసం తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోయింది. తన కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మౌనిక కొద్ది రోజులుగా ఓ వ్యక్తితో వీడియో కాల్ చేసి మాట్లాడటం వల్లే భార్యభర్తల మధ్య విభేదాలు వచ్చినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ):యువకుడిపై దాడి చేసి గాయపరిచిన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీకి చెందిన కొమ్మిరెడ్డి హరిబాబు రైల్వే పార్సిల్ ఆఫీసులో పని చేస్తుంటాడు. ఈ నెల 6వ తేదీన ఉదయం హరిబాబు పాముల కాల్వ సమీపంలోని బార్ వద్ద మద్యం తాగుతుండగా, సందీప్, ఆసిఫ్ అనే వ్యక్తులు బార్‌లోకి వచ్చారు. ముగ్గురు కలిసి మద్యం తాగిన తర్వాత చిట్టినగర్‌కు వెళ్లారు. అక్కడ హరిబాబు ఫోన్‌ను ఆసీఫ్ తీసుకెళ్తుండగా సందీప్ అడ్డుకున్నాడు. దీంతో హరిబాబును స్నేహితులిద్దరు కొట్టడంతో గాయాలయ్యాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

4 శాతం రిజర్వేషన్లు కాపాడాలని వినతి



ఇంతియాజ్ అహ్మద్‌కు వినతి పత్రం ఇస్తున్న మైనార్టీ ప్రతినిధులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లిం మైనార్టీలకు కల్పించిన 4 శాతం రిజర్వేషన్‌ను కాపాడాలని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, మైనార్టీ నాయకులు కోరారు. ఆంధ్రప్రదేశ్ ముస్లింలకు (ముస్లిం బీసీ–ఇ) కల్పించిన రిజర్వేషన్‌పై ఈ నెల 6న సుప్రీం కోర్టులో జరిగిన వాదనల అంశంపై మైనార్టీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్‌ను పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు షేక్ రెహతున్నీసా, ఎండీ ఇర్ఫాన్, ఏపీ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ వాజిద్‌ఖాన్, వైఎస్సార్ సీపీ మైనార్టీ కార్యదర్శి ఎండీ మొహమూద్, ఎస్‌కె మహమ్మద్ అనీస్ బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతి పత్రం అందచేశారు. సానుకూలంగా స్పందించిన ఇంతియాజ్ అహ్మద్ ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని చెప్పినట్లు కార్పొరేటర్లు తెలిపారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి



పోటీల్లో తయారు చేసిన అంశాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మహిళలు వృత్తి విద్యా కోర్సులు నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ పూర్ణిమ చెప్పారు. జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వారికి బుధవారం జనశిక్షణ సంస్థాన్ ట్రెనింగ్ సెంటర్లల్లో స్కిల్ కాంపిటీషన్‌ను నిర్వహించారు. పోటీల ప్రారంభ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులను నేర్చుకోవడం వల్ల సామాజికంగా, ఆర్థికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వృత్తి విద్యా కోర్సులను నేర్చుకోవాలని సూచించారు. వృత్తి విద్యా కోర్సులను నేర్చుకున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయన్నారు. వృత్తి విద్య అనేది కేవలం ఉపాధి మార్గంగానే కాకుండా అది మనలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుందని చెప్పారు.

వైద్య రంగంలో బయోసెన్సార్ల పాత్ర కీలకం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వైద్య రంగంలో బయో సెన్సార్ల పాత్ర చాలా కీలకమని కేఎల్ యూనివర్సిటీ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ఆవరణలోని సెమినార్ హాల్లో సదస్సు నిర్వహించారు. ప్రదీప్‌కుమార్ అతిథిగా హాజరై మాట్లాడుతూ వైద్య రంగంలో బయో సెన్సార్ల వినియోగం వల్ల వైద్య పరీక్షలకు అయ్యే ఖర్చు బాగా తగ్గించవచ్చని చెప్పారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపల్ రమేష్‌తో పాటుగా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం ప్రదీప్‌కుమార్‌ను సత్కరించారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ రెహమతున్నీసా

భవానీపురం(విజయవాడ పశ్చిమ):అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా 86వ రోజు బుధవారం 38వ డివిజన్ 113వ వార్డ్ సచివాలయం పరిధిలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసాతో కలిసి ఆయన పర్యటించారు. వన్‌టౌన్ రథం సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ పర్యటన బ్రాహ్మణ వీధి, వడ్డేవారి వీధి, అర్జున్ వీధి, గుంటూరువారి వీధి, వాడపల్లివారి వీధి, రాయలవారి వీధి ప్రాంతాలలో సాగింది. పథకాలు అందుతున్నాయా లేదా అనేది తెలుసుకునేందుకే నియోజకవర్గంలోని ఇంటింటికీ తిరుగుతున్నామని తెలిపారు. గడిచిన మూడేళ్ల కాలంలో ప్రభుత్వపరంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వలన ప్రతి కుటుంబానికి ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరించారు. పథకాలు అందని వారికి ఎందుకు అందలేదో సంబంధిత అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లను అడిగి తెలుసుకున్న వెలంపల్లి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి చేత దరఖాస్తు చేయించి వచ్చేలా చూడాలని ఆదేశించారు.

అగ్రవర్ణాలవారికీ సంక్షేమ పథకాలు...

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలతోపాటు అగ్రవర్ణ పేదలకూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందచేస్తుందని వెలంపల్లి తెలిపారు. కాపులకు కాపు నేస్తం, ఓసీలకు ఈబీసీ నేస్తం పథకాల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ చంద్రబాబు చేయలేని ఎన్నో పనులను సీఎం జగనన్న చేసి చూపిస్తున్నారని తెలిపారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సంకల్పించిన సాగునీటి ప్రాజెక్టులను ఆయన మరణం తరువాత చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ స్ఫూర్తితో సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో నిర్మిస్తున్నారని వివరించారు.

మూడు ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే లక్ష్యం...

రాష్ట్రంలోని మూడు ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం విడిపోవాలని జరిగిన ఉద్యమాలు ఇక్కడ జరగకూడదన్న సదుద్దేశంతో సీఎం జగనన్న ఆలోచన చేస్తుంటే చంద్రబాబు కొన్ని వ్యవస్థలను అడ్డం పెట్టుకుని రాష్ట్ర ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేందుకు చంద్రబాబు చేస్తున్న యత్నాలు విఫలంకాక తప్పదన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వం మధ్యలోనే నిలిపివేసిన అనేక కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను తమ ప్రభుత్వం పూర్తి చేస్తుందని చెప్పారు. టీడీపీ పాలనలో శంకుస్థాపనలు తప్ప ప్రారంభోత్సవాలు లేవన్నారు. 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ హయాత్ షరీఫ్, సంపర రాంబాబు, విశ్వనాథ రవి, డి రాం ప్రసాద్ (కొండ), కె దుర్గారావు, రహీంఖాన్, కొత్తమాసు పిచ్చయ్య, బొమ్ము మధు, ఎస్‌కె నజీర్, అండిమాని బాబ్జి, బి శాంతి, రేలంగి బాజ్జి, జోసఫ్ శివమణి, మహమ్మద్ బాషా, బూదాల శ్రీనివాస్, పోలిమెట్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజలకు దగ్గరగా ఉంటూ మెరుగైన సేవలు అందించడంతో పాటు సచివాలయానికి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సూచించారు. దుర్గాపురం 199, గులాబీ తోట 200 వార్డు సచివాలయాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, ఉద్యోగుల మూమెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల క్యాలెండర్, రాష్ట్ర ప్రభుత్వం హెల్ప్ లైన్ నంబర్లు, వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న అమ్మఒడి, రైతు భరోసా వివిధ పథకాల అర్హుల, అనర్హుల జాబితా, ఇతర రికార్డులు పరిశీలించారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇంటి పట్టాలకు సంబంధించి ఇంకనూ ప్రారంభం కాని, బిలో బేస్మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్లను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వార్డు సచివాలయం పరిధిలో ఎంత మంది గర్భిణులున్నారు..? ఎంత మంది రక్తహీనతతో బాధపడుతున్నారు... మాతృమరణాలు ఏమైనా జరిగాయా..? వంటి వివరాలను ఏఎన్ఎంను అడిగి తెలుసుకున్నారు. జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజన పథకం ఎలా అమలవుతోంది? సమయానికి భోజనం అందిస్తున్నారా వంటి వివరాలపై వెల్ఫేర్ అసిస్టెంట్‌తో మాట్లాడారు. పాఠశాలలను తనిఖీలు చేస్తూ మధ్యాహ్నం భోజనం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా సమయాలను పాటించాలని తెలిపారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నార్త్ తహసీల్దార్ దుర్గాప్రసాద్ ఉన్నారు.

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు

రూ.4.26 లక్షల జరిమానా వసూలు



మాట్లాడుతున్న విద్యుత్ డీఈ హరిబాబు.

ఆటోనగర్(విజయవాడతూర్పు): అనధికారికంగా విద్యుత్ వాడితే కఠిన చర్యలు తప్పవని డీఈ పి. హరిబాబు హెచ్చరించారు. ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. మొత్తం 35 బృందాలుగా సిబ్బంది పాల్గొని ఎన్టీఆర్ సర్కిల్, మహానాడురోడ్డు తో పాటు ఐలా, ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేశారు. అదనంగా విద్యుత్‌లోడు వాడుతున్న 112 మందిపై జరిమానా విధించారు. వీరి నుంచి రూ.4.26 లక్షలు వసూలు చేసినట్టు చెప్పారు. మొత్తం 1562 సర్వీస్‌లను తనిఖీలు చేశారు. విలువైన విద్యుత్‌ను సక్రమంగా వాడుకోవాలని సూచించారు. అదనంగా లోడు అవసరమైతే సంబంధిత అధికారులకు విన్నవించుకోవాలని తెలిపారు. విద్యుత్ లోడు అదనంగా కావాల్సిన వారు సంబంధిత కార్యాలయంలో డిపాజిట్ చెల్లించి వాడుకోవాలన్నారు. విజిలెన్స్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నవీన్‌కుమార్, ఆటోనగర్ ఏడీఏ శివకుమార్, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాం చిరస్మరణీయుడు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న జూపూడి, చిత్రంలో వెలంపల్లి, గౌతంరెడ్డి తదితరులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): దళిత సామాజికవర్గ అభ్యున్నతికి విశేష సేవలు అందించిన ఆదాం చిరస్మరణీయుడని పలువురు ప్రజానిధులు తెలిపారు. చిట్టినగర్‌లో 47వ డివిజన్‌లో దళిత నేత, సీనియర్ రాజకీయ నాయకులు వరకాల ఆదాం నివాసం వద్ద బుధవారం ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ చైర్మన్ జూపూడి ప్రభాకరరావు, మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ పి.గౌతంరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ సభ్యుడు కాలే పుల్లారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జమల పూర్ణమ్మ, 47, 49 డివిజన్ల కార్పొరేటర్లు గోదావరి గంగ, బుల్లా విజయ్, ఎస్సీ నాయకులు దాసి జయప్రకాష్ కెనడి, మధిర ప్రభాకర్, బూదాల శ్రీనివాస్, మద్దిరాల కమాలకర్, 47వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కూరాకుల నాగ తదితరులు హాజరై ఆదాం చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆదాం పెద్ద కుమారుడు వరకాల జోషి తోపాటు కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

ప్రమాదం అని తెలిసినా...

రైలు పట్టాలపై పాదచారులు రాకపోకలు సాగించవద్దని రైల్వే శాఖ ఎన్నిమార్లు హెచ్చరిస్తున్నా కొందరిలో మార్పు రావడం లేదు. రైలు పట్టాలు దాటవద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసినా వాటిని ఖాతరు చేయడం లేదు. రైళ్లు రాకపోకలు సాగిస్తున్న క్రమంలోనూ అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో పట్టాలు దాటడం చూస్తుంటే భయాందోళన కలుగుతుంది. పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ సమీపంలో ఉన్న పూల మార్కెట్ లో బ్రిడ్జ్ రైల్వే ట్రాక్‌పై నుంచి బస్టాండ్ వైపు పట్టాల మీద రైలు సమీపంలోకి వస్తున్నా పట్టించుకోకుండా నెత్తిపై పూల సంచులు పెట్టుకొని వెళ్తున్న వ్యక్తి చిత్రమిది.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



సమతుల్య ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): సమతుల్యమైన ఆహారాన్ని తీసుకున్న ప్రతి ఒక్కరూ చక్కని ఆరోగ్యాన్ని సొంతం చేసుకుంటారని డాక్టర్ సుష్మ గుమ్మా అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మెకానికల్, ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో లాస్ యువర్ ఫ్యాట్ అంశంపై సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ సుష్మ మాట్లాడుతూ ఆధునిక ఆహారపు అలవాట్లతో జీవనశైలిని దిగజార్చటం వలన అనేక వ్యాధులు వస్తున్నాయని చెప్పారు. సరైన పౌష్టికాహారాన్ని తీసుకోవటం ద్వారా చక్కని ఆరోగ్యంతో పాటుగా దీర్ఘకాలిక వ్యాధులను సైతం దూరం పెట్టవచ్చన్నారు. అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సెప్టెంబర్ మొదటి వారం జాతీయ పోషకాహార వారోత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతాంజలి శాస్త్రి, అధ్యాపకులు డాక్టర్ అబిద్‌అలీ, వై రాజేంద్రబాబు, ఎస్వీ మాళవిక, బీ జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



కండ్రిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో మొక్కను నాటుతున్న రామిరెడ్డి, శాస్త్రి, సుహాసిని

పాయకాపురం(విజయవాడరూరల్): మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ వి.రామిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ స్వచ్ఛ వాతావరణం దినోత్సవం సందర్భంగా కండ్రికలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆసుపత్రి లో సిబ్బంది ఒక్కో మొక్కను పెంచాలని సూచించారు. రాష్ట్ర ఎన్‌సీడీసీడీ జాయింట్ డైరెక్టర్ టీవీఎస్ఎన్ శాస్త్రి మాట్లాడుతూ నేటి నుంచి పదవ తేదీ వరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం.సుహాసిని ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మొక్కలు నాటడంతో పాటు వాటిని పెంచి పోషించి, పరిశుభ్రమైన గాలి, వాతావరణం పరిస్థితులు కల్పించడం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్పొరేటర్ తిరుపతమ్మ, పార్టీ నాయకులు శ్రీరాములు, మాధవి, డాక్టర్ షేక్.బాసిద్ ఉన్నారు.

ఎమ్మెల్యే విష్ణుకు అభినందనలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడిగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఎంపిక కావడంతో స్కేటింగ్ అసోసియేషన్ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఆయన్ను కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం గత నెలలో జరిగిన కేంద్రీయ విద్యాలయ రీజనల్స్‌లో అండర్–14 విభాగంలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన ఈడీ యక్షిత (13)ను ఎమ్మెల్యే అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కోచ్ శివనాగసేన్, అసోసియేషన్ సభ్యులు ధనకోటిరెడ్డి, నరేంద్ర, స్కేటర్లు, చిన్నారులున్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యంలో పరిశ్రమలలో తనిఖీలు నిర్వహించి ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. పరిశ్రమలలో జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుడివాడ అమర్నాథ్, పరిశ్రమలశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాల వలవన్ సచివాలయం నుంచి బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 98 పరిశ్రమలను ఏ, బీ, సీ కేటగిరిలుగా గుర్తించామని తెలిపారు. ఏ కేటగిరిలో భారీ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్న 9 పరిశ్రమలు ఉన్నాయని చెప్పారు. వీటిలో జి. కొండూరులోని గెయిల్ ఇండియా లిమిటెడ్ బూస్టర్ స్టేషన్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ ఆయిల్ కంపెనీలు, బీపీసీఎల్ గ్యాస్ కంపెనీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఇబ్రహీంపట్నంలోని హిందూస్థాన్ పెట్రోలియం, లాంకో పవర్ స్టేషన్, డాక్టర్ ఎన్టీటీపీఎస్ వంటి పరిశ్రమలు ఉన్నాయన్నారు. బి కేటగిరిలో 37 పరిశ్రమలు గుర్తించామని పేర్కొన్నారు. వీటిలో మిల్క్ ఫ్యాక్టరీ, మోడల్ డెయిరీ, స్పెక్ట్రా ఫుడ్స్, బెవరేజస్, రవీంద్ర సాల్వెంట్ ఆయిల్, లక్ష్మి ఆర్గానిక్స్, ఎఎస్ బల్క్ డ్రగ్స్, ఆర్చీ లేబరేటరీ, జియంకే ల్యాబ్స్, రాణి లైఫ్ సైన్స్, ఇంకెమ్ లేబరేటరీ, కాకుల లైఫ్ సైన్స్, శ్రీనిజ డ్రగ్స్, నిఫ్టీ ల్యాబ్స్, కెయంటికె లేబరేటరీస్, కొండపల్లి ఎన్విరోటెక్, రాయిస్ ఆర్గానిక్స్, రాఛంఫార్మా లిమిటెడ్, ఇంటిగ్రిన్ లైఫ్ సైన్స్, దినకర్ లైఫ్ సైన్స్, ఐనేషా ఫార్మా, సికెఎస్ ఫార్మా, సహస్రా లైఫ్ సైన్స్, ఇన్విత కెమికల్స్, భాగ్యనగర్ గ్యాస్, విజయ్ గ్రో ప్రొడక్ట్స్, శాండ్రూస్ ప్రైవేట్ లిమిటెడ్, సాయికృష్ణ ఐస్ ఫ్యాక్టరీ, త్రిపురాంబ కోల్డ్ స్టోరేజ్, తిరుమలగిరి ఆగ్రో ప్రొడక్ట్స్, యలమంచిలి కోల్డ్ స్టోరేజ్, స్ఫూర్తి కోల్డ్ స్టోరేజ్, పరిటాల కోల్డ్ స్టోరేజ్, కాకర్ల కోల్డ్ స్టోరేజ్, శ్రీ సాయి భార్గవ కోల్డ్ స్టోరేజ్, వాసు కోల్డ్ స్టోరేజ్, హరిత కోల్డ్ స్టోరేజ్ వంటి పరిశ్రమలు ఉన్నట్లు వెల్లడించారు. వీటితో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న సీ కేటగిరిలో మరో 44 పరిశ్రమలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ గుర్తించినట్లు తెలిపారు. ఆయా పరిశ్రమలను మూడు నెలల్లోగా జిల్లా స్థాయి కమిటీ సందర్శించి పూర్తి స్థాయిలో ఆడిట్ తనిఖీలు నిర్వహిస్తామన్నారు. డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ కె. శ్రీనివాస్ రావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యం శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడ తూర్పు): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆమె చాంబర్లో బుధవారం వివిధ సంఘాల నాయకులతో ఆమె మాట్లాడారు. సమస్యలను రాత పూర్వకంగా తెలియజేస్తే విద్యాశాఖ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తాను మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించామని చెప్పారు. నగర పాలక సంస్థలో పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు, ఎరియర్లు, వి. శ్రాంత ఉపాధ్యాయుల అర్ధ జీతపు పెండింగ్ బిల్లులు, నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రాన్ ఎకౌంట్ కంటే ముందు ఉన్న సీపీఎస్ అమౌంట్లు, తెలుగు పండిట్ల పదోన్నతులు, 398 స్పెషల్ టీచర్ల నోషనల్ ఇంక్రిమెంట్లు, తదితర సమస్యలను ఉపాధ్యాయ సంఘాలు ప్రస్తావించాయి. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అంశాలు ట్రెజరీ అధికారులతో కలిసి చర్చించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి బొత్సా సత్యనారాయణ వద్దకు ఉపాధ్యాయ సంఘాలను తీసుకెళ్తానన్నారు. వీఎంసీ అదనపు కమిషనర్ (జనరల్) యం. శ్యామల, సూపరింటెండెంట్ శారద, పాఠశాల సూపర్‌వైజర్స్ కె. రాజశేఖర్, మహమ్మద్ హుస్సేన్, షేక్ సైదా, వివిధ సంఘాల నాయకులు నయీమ్ అహ్మద్, కె. శ్రీనివాసరావు, ఎం. శ్రీనివాసరావు, కిషోర్, ఇంతియాజ్, కుమార్‌రెడ్డి, మణిబాబు, టీఎస్ఎన్ ప్రసాద్, గణేస్, చంటి, ఇక్బాల్ బాషా, మస్తాన్, హఫీజ్, ఇంటిరాజు. ఎంఎస్ ప్రసాద్, సత్యం పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలతో ఆధ్యాత్మిక చైతన్యం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): గణపతి ఉత్సవాలతో సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యం మరింత పెరుగుతుందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. రాయల్ హోటల్ సెంటర్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. తొలుత వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతబస్తీలో వినాయకచవితి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయన్నారు. ప్రతి వీధిలోనూ వేడుకల ద్వారా పశ్చిమ నియోజకవర్గం కళకళలాడుతుందని పేర్కొన్నారు. రాత్రి స్వామి వారి నిమజ్జనోత్సవం కనులపండువుగా నిర్వహించారు. జానపద కళారూపాలతో సందడిగా ఊరేగింపు చేశారు. రాయల్‌హోటల్ సెంటర్ నుంచి ప్రారంభమైన ఊరేగింపు బాబూరాజేంద్రప్రసాద్ రోడ్డు, గణపతిరావురోడ్డు, కేటీరోడ్డు తదితర ప్రాంతాల మీదుగా కృష్ణానదికి చేరుకుంది. కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు, సీనియర్ న్యాయవాది నరహరశెట్టి శ్రీహరి, నాయకులు సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా గణపతి కల్యాణం



సిద్ధిబుద్ధి కల్యాణ గణపతిగా బాలగణపతి

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): సిద్ధిబుద్ధి సమేత గణపతి స్వామి వారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. వన్‌టౌన్ పూజారివారివీధిలోని బాలగణపతి మందిరంలో జరుగుతున్న గణపతి నవరాత్రి మహోత్సవంలో భాగంగా బుధవారం స్వామి వారి వివాహ మహోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత దేవతామూర్తులను ఊరేగింపుగా వేదిక వద్దకు తీసుకువచ్చారు. అనంతరం అత్యంత రమణీయంగా అలంకరించిన వేదికపై ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. సామూహిక కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులు స్వామి వారి తలంబ్రాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. బాలగణపతి స్వామి సిద్ధిబుద్ధి సమేత కల్యాణ గణపతిగా బుధవారం దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా కలశాల డెకరేషన్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమాలను మందిరం కమిటీ ప్రముఖులు గ్రంధి శ్రీనివాసరావు, ఆతుకూరి రాంబాబు, మామిడి లక్ష్మీవెంకటకృష్ణారావు తదితరులు పర్యవేక్షించారు.

15న సీజ్ చేసిన వాహనాలకు వేలం

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ తూర్పు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ వద్ద ప్రొహిబిషన్, ఎక్సైజ్ కేసుల్లో సీజ్ అయిన వాహనాలకు వేలం నిర్వహిస్తున్నామని సెబ్ తూర్పు స్టేషన్ అధికారి ఎ.స్వామినాథం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా దాడుల్లో సీజ్ చేసిన 11 ద్విచక్రవాహనాలు, ఒక కారుకు వేలం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీన ఉదయం 10 గంటలకు రామవరప్పాడులోని సుందరయ్య నగర్‌లో వద్ద ఉన్న తమ కార్యాలయంలో వేలం నిర్వహిస్తామని తెలిపారు. ద్విచక్రవాహనాలకు రూ. 5 వేలు, కారుకు రూ.10 వేలు ఈఎండీ కట్టి వేలంలో పాల్గొవాలని పేర్కొన్నారు. వివరాలకు 9440902424, 9959841282 నంబర్లో సంప్రదించాలన్నారు.

ఏపీలో రాజకీయ భవిష్యత్ బీజేపీదే

బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీకి రాజకీయ భవిష్యత్ పుష్కలంగా ఉందని ఎంపీ జీవీఎల్ నరసింహారావు అభిప్రాయపడ్డారు. విశాఖపట్నంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీకి ప్రత్యామ్నాయం లేదని, రాహుల్ గాంధీ ఎన్ని పాదయాత్రలు చేసినా ఫలితం ఉండదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో 400 లోక్‌సభ సీట్లు గెలుపే లక్ష్యంగా బీజేపీ కృషి చేస్తుందన్నారు. 2024 ఎన్నికలు లక్ష్యంగా ఏపీలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 175 ఎమ్మెల్యే నియోజకవర్గాల్లో విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. రాష్ట్రంలో అధికార వైఎస్సార్‌సీపీ, ప్రతిపక్ష టీడీపీలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ, జనసేన కలిసే ఉన్నాయని, అయితే రెండు పార్టీలు సొంతంగా ప్రజాబలాన్ని కూడగట్టుకుంటున్నాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణు కుమార్ రాజు, విశాఖ పార్లమెంట్ జిల్లా పార్టీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పాల్గొన్నారు.

నాడు - నేడు స్ఫూర్తితో 'పీఎం శ్రీ' స్కూళ్లు

సాక్షి, అమరావతి: విద్యారంగ సంస్కరణల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక 'మనబడి నాడు - నేడు' కార్యక్రమం పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవగా తాజాగా కేంద్ర ప్రభుత్వానికీ స్ఫూర్తిదాయకమైంది. నాడు – నేడు తరహాలో అన్ని సదుపాయాలతో 'పీఎం శ్రీ' పేరిట కొత్తగా స్కూళ్లను ప్రారంభించాలని తాజాగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం. మంగళవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో దీనికి ఆమోదం లభించింది. దేశవ్యాప్తంగా 14,500కు పైగా స్కూళ్లను ప్రారంభించనున్నారు. ప్రాజెక్టు ప్రాతిపదికన ఐదేళ్లపాటు కొనసాగనున్నాయి.



ఆహ్లాదకరంగా విద్యాభ్యాసం..

ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనబడి నాడు - నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. పాఠశాలల్లో పూర్తి మౌలిక సదుపాయాలను సమకూర్చడమే కాకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువులు కొనసాగేలా చర్యలు చేపట్టారు. విద్యా ప్రమాణాలు పెరిగేలా పాఠ్యాంశాల్లో కీలక మార్పులు చేపట్టారు. జగనన్న విద్యాకానుకతోపాటు ఆంగ్ల మాధ్యమం, ఇంగ్లిష్ ల్యాబ్‌లు, సీబీఎస్‌ఈ విధానం అమలు, డిజిటల్ తరగతులకు శ్రీకారం, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, బైజూస్ కంటెంట్ ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందిస్తున్నారు. ఇవన్నీ మంచి ఫలితాలనిస్తుండటంతో పలు రాష్ట్రాల ప్రభుత్వ బృందాలు ఈ కార్యక్రమాలపై అధ్యయనం చేశాయి. ఉత్తరప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాల్లో వీటి అమలుకు శ్రీకారం చుట్టాయి.

సదుపాయాలతో మెరుగైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు కింద నీటి వసతితో కూడిన మరుగుదొడ్లు, మంచినీరు, మేజర్, మైనర్ మరమ్మతులు, విద్యుత్తు, ఫ్యాన్లు, డ్యూయెల్ డెస్కులు, బెంచీలు, కుర్చీలు, బీరువాలు, టేబుళ్లు, గ్రీన్ చాక్ బోర్డులు, పాఠశాల మొత్తానికి పెయింటింగ్, ఇంగ్లిష్ ల్యాబ్, కాంపౌండ్ వాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా అన్ని హైస్కూళ్లలో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటవుతున్నాయి. 4 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ అందుబాటులోకి తెస్తున్నారు. 8వ తరగతికి వచ్చే విద్యార్థులందరికీ ట్యాబ్‌లు అందిస్తున్నారు. ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థ బైజూస్ సహకారంతో అత్యుత్తమ పాఠ్యాంశాలతో కూడిన డిజిటల్ కంటెంట్ అందిస్తున్నారు. రూ.36,843 విలువైన ట్యాబ్, కంటెంట్‌ను ప్రతి విద్యార్థికి ఉచితంగా అందిస్తున్నారు. పదో తరగతి వరకు విద్యార్థులకు ఈ కంటెంట్ అందుతుంది. జగనన్న విద్యాకానుక కింద బైలింగ్యువల్ టెక్ట్స్ బుక్స్, వర్కు బుక్కులు, బ్యాగు, 3 జతల యూనిఫారం, షూ, సాక్సులతోపాటు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను కూడా ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న సంగతి తెలిసిందే.

61,661 విద్యాసంస్థల్లో నాడు-నేడు

కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల కాలపరిమితితో 14,500కు పైగా పీఎం శ్రీ స్కూళ్లను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించగా రాష్ట్రంలో మాత్రం నాడు - నేడు ద్వారా శాశ్వత ప్రాతిపదికన ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. నాడు-నేడు తొలిదశ కింద 15,715 స్కూళ్లలో సదుపాయాలను కల్పించగా గతేడాది ఆగస్టు 16న ముఖ్యమంత్రి జగన్ వీటిని జాతికి అంకితం చేశారు. రెండో విడత నాడు - నేడు కూడా మొదలైంది. ప్రభుత్వ స్కూళ్లతో పాటు జూనియర్ కాలేజీలు, హాస్టళ్లు, భవిత కేంద్రాలు, జిల్లా విద్యాబోధనా శిక్షణ కళాశాలల (డైట్స్)లతో పాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెస్తున్న శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లనూ నాడు-నేడులోకి చేర్చింది. తొలివిడతతో కలిపి మొత్తం 61,661 విద్యాసంస్థల్లో పది రకాల సదుపాయాలను సమకూరుస్తున్నారు.

ప్రతివాళ్లు సుప్రీంకోర్టుకు వస్తే ఎలా?

- హైకోర్టుకు ఎందుకు వెళ్లరు?
- ఎంపీ రఘురామకృష్ణరాజు కుమారుడి న్యాయవాదిని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- రఘురామ కస్టడీ వ్యవహారంపై విచారణ
- ఏపీ ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చాలని ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ : 'ఎంపీ రఘురామకృష్ణరాజు కస్టడీ విచారణ వ్యవహారంపై హైకోర్టుకు ఎందుకు వెళ్లరు? ప్రతి వాళ్లు సుప్రీంకోర్టుకు వస్తే ఎలా' అని రఘురామ కుమారుడి తరఫు న్యాయవాదిని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. సీబీఐతో విచారణ చేయించాలన్న అంశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చాలని ఆదేశించింది. ఈమేరకు జస్టిస్ ఎఆర్ గవాయ్, జస్టిస్ సి.టి.రవిలతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రఘురామకృష్ణరాజు కస్టోడియల్ విచారణ వ్యవహారంలో సీబీఐతో విచారణ చేయించాలని ఆయన కుమారుడు భరత్ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం సుప్రీంకోర్టు రెండోసారి విచారణ చేపట్టింది. తొలిసారి విచారణ జరిగినప్పుడు సీబీఐకి, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. బుధవారం విచారణ సందర్భంగా ఇప్పటివరకు కేంద్రం, సీబీఐ కౌంటర్లు దాఖలు చేయలేదని భరత్ తరఫున సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు తెలిపారు. ఈ పిటిషన్‌లో ప్రతివాదుల జాబితాలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఇతరులను ఎందుకు తొలగించారని ధర్మాసనం ప్రశ్నించగా.. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ అధికారులే టార్చర్‌కు గురి చేశారని, నిర్ణయం తీసుకునే ముందు నిందితుల వాదనలు వినాల్సిన అవసరం లేదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులు ఉన్నాయని ఆయన చెప్పారు. హైకోర్టు విచారణ తర్వాతే తాము విచారణకు తీసుకుంటేనే అర్థం ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా ప్రతివాదిగా చేర్చాలని భరత్ తరఫు న్యాయవాదులను ధర్మాసనం ఆదేశించింది. దీనికి సమయం కావాలని పిటిషనర్ కోరగా, రెండు వారాల గడువు ఇచ్చింది.

మా ప్రభుత్వం వస్తే ఆ అధికారులు అందరినీ డిస్మిస్ చేస్తాం

కావలిలో ఎమ్మెల్సీ నారా లోకేష్

కావలి (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రస్తుత ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న అధికారులందరినీ డిస్మిస్ చేస్తామని టీడీపీ ఎమ్మెల్సీ నారా లోకేష్ హెచ్చరించారు. బుధవారం నెల్లూరు జిల్లా కావలిలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితులు, మైనార్టీలపై వైఎస్సార్‌సీపీ నాయకుల దాడులు పెరిగిపోయాయని మండిపడ్డారు. తాము వైఎస్సార్‌సీపీ నాయకులపై వీరోచితంగా పోరాడతాం తప్ప భయపడమన్నారు. నెల్లూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ నేతల దాడులు శ్రుతి మించి పోయాయని.. అందుకే జిల్లా నేరాల రాజధానిగా మారిపోయిందన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో జిల్లాలో మినీ మహానాడు నిర్వహిస్తామన్నారు. తర్వాత వైఎస్సార్‌సీపీ నేతల వల్ల బాధితులైన కుటుంబాలను పరామర్శించేందుకు నేతలు జిల్లాలో పాదయాత్ర చేస్తారని చెప్పారు. కాగా కావలిలోని ట్రంక్ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహాన్ని దాటుకొని ముందుకు వెళ్లిపోయిన లోకేష్.. నేతలు చెప్పడంతో వెనుకకు వచ్చి విగ్రహానికి పూలమాల వేశారు.

పరిశ్రమల్లో భద్రతపై స్పెషల్ డ్రైవ్

- మూడు నెలల్లో పూర్తిస్థాయిలో భద్రత ప్రమాణాలు పాటించేలా చర్యలు
- ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- 'పరిశ్రమలు–భద్రతా ప్రమాణాల'పై స్టేట్ మానిటరింగ్ కమిటీ ఆదేశాలు



పరిశ్రమలు-భద్రతా ప్రమాణాలపై సచివాలయంలోని 5వ బ్లాక్ లో మంత్రుల కమిటీ సమావేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించాల్సిందేనని 'పరిశ్రమలు–భద్రతా ప్రమాణాల'పై మంత్రులతో ఏర్పాటైన స్టేట్ మానిటరింగ్ కమిటీ స్పష్టం చేసింది. ప్రమాదాలు జరిగినప్పుడు స్పందించడం కాకుండా ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మూడు నెలల్లోగా పరిశ్రమల్లో పూర్తిస్థాయి భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. బుధవారం సచివాలయంలో జరిగిన సమావేశంలో పరిశ్రమల్లో భద్రతపై కమిటీ సమీక్షించింది. ఈ సమావేశంలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరాం, గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిశ్రమలకు తోడు రాష్ట్రంలో కొత్తగా పెద్ద సంఖ్యలో పరిశ్రమలు రాబోతున్నాయని తెలిపారు. పరిశ్రమల్లో భద్రతపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్దిష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. పరిశ్రమల్లో భద్రత కోసం రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ కమిటీలు అన్ని పరిశ్రమలను తనిఖీ చేయాలని, పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి, కార్మికశాఖ అధికారులు ఆరు నెలలకు ఒకసారి సంయుక్త తనిఖీలు నిర్వహించాలన్నారు. రెడ్ కేటగిరీ పరిశ్రమలకు సమీపంలో జనావాసాలు ఉండకూడదని చెప్పారు. పరిశ్రమల చుట్టూ జనావాసాలు పెరిగితే ప్రజల భద్రతకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ (పర్యావరణం) నీరబ్ కుమార్ ప్రసాద్, కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ ఎకె ఫరిడా, మెంబర్ సెక్రటరీ విజయ్ కుమార్, పరిశ్రమలశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాల వలవన్ పాల్గొన్నారు.

హైకోర్టు దారిలో కల్పిస్తున్న వసతులేమిటి?

- పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, సీఆర్‌డీఏ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు
- హైకోర్టు ఉద్యోగుల సంఘం పిటిషన్‌పై విచారణ

సాక్షి, అమరావతి: హైకోర్టుకు వచ్చే రోడ్లు బాగోలేవంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. విజయవాడ, గుంటూరు జిల్లాల నుంచి హైకోర్టు వచ్చే రహదారులను అధికారులు సక్రమంగా నిర్వహించడంలేదని, దీని వల్ల రాత్రి వేళ ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని, ఈ మార్గాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాలరావు ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శికి, సీఆర్‌డీఏ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. హైకోర్టుకొచ్చే దారిలో మౌలిక సదుపాయాల కల్పనకు ఏం చేస్తున్నారో తెలియజేయాలని ఆదేశించింది. ఈ మార్గంలో నెలలో ఒకటో రెండో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొంది. కనీసం వీధి దీపాలను ఏర్పాటు చేయవచ్చు కదా అని ప్రశ్నించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈమేరకు న్యాయమూర్తి జస్టిస్ దొనడి రమేశ్ ఉత్తర్వులు జారీ చేశారు.

'నీట్'లో ఏపీ విద్యార్థులు 61.77% ఉత్తీర్ణత

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ–2022 ఫలితాలు బుధవారం రాత్రి విడుదలయ్యాయి. నీట్ యూజీ పరీక్షలను దేశ వ్యాప్తంగా ఈ ఏడాది జూలై 17న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించింది. ఈ పరీక్షలకు దేశవ్యాప్తంగా 17.64 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 9,93,069 మంది (56.27 శాతం) అర్హత సాధించారు. ఏపీ నుంచి 61.77 శాతం విద్యార్థులు అర్హత సాధించారు. మొత్తం 65,305 మంది పరీక్షకు హాజరు కాగా, 40,344 మంది అర్హత సాధించారు. రాజస్థాన్‌కు చెందిన విద్యార్థిని తనిష్క 715 స్కోర్ సాధించి, 99.99 పర్సంటైల్‌తో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఢిల్లీకి చెందిన వి. ఆశిష్‌బాత్రా రెండో ర్యాంకు, కర్ణాటకకు చెందిన హృషికేష్ నాగభూషణ్ మూడో ర్యాంకు, రూచ పవాషే నాలుగో ర్యాంకు సాధించారు. తెలంగాణకు చెందిన ఇ.సిద్ధార్థ్ రావు ఐదో ర్యాంక్ సాధించారు. ఏపీకి చెందిన ఎం. దుర్గ సాయి కీర్తి తేజ 12వ ర్యాంక్, ఎస్.వెంకటసాయి వైష్ణవి 15వ ర్యాంక్ కైవసం చేసుకున్నారు. జి.హర్షవర్ధన్ నాయుడు 25వ ర్యాంకు సాధించాడు. ఆంధ్రప్రదేశ్‌లో 11 ప్రభుత్వ, 15 ప్రైవేటు, 2 మైనార్టీ వైద్య కళాశాలలు ఉన్నాయి. వీటిలో కన్వీనర్, యాజమాన్య, ఎన్ఆర్ఐ ఇలా కోటాలు కలిపి 5,060 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2,185 సీట్లు (ఈడబ్ల్యూఎస్ అదనపు సీట్లు కలిపి) ఉన్నాయి. అత్యధికంగా ఆంధ్రా వైద్య కళాశాల, గుంటూరు వైద్య కళాశాల, కర్నూలు వైద్య కళాశాల, రంగరాయ (కాకినాడ) కళాశాలల్లో 250 చొప్పున సీట్లున్నాయి. అత్యల్పంగా ఒంగోలు రిమ్స్‌లో 120 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని సీట్లలో ఆల్ ఇండియా కోటా 325 సీట్లు, రాష్ట్ర కోటాలో 1,890 సీట్లు భర్తీ చేస్తారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో 175 సీట్లు ఉన్నాయి. కాగా 2 ప్రభుత్వ డెంటల్ కాలేజీల్లో 140 సీట్లు, 14 ప్రైవేటు డెంటల్ కాలేజీల్లో 1400కు పైగా బీడీఎస్ సీట్లు ఉన్నాయి.

కటాఫ్ వివరాలు ఇలా

కేటగిరి	స్కోర్
అన్‌రిజర్వ్‌డ్ /ఈడబ్ల్యూఎస్	715-117
ఓబీసీ	116-93
ఎస్సీ	116-93
ఎస్టీ	116-93

ఔషధ రహితం.. నొప్పులు దూరం

- వైద్యరంగంలో కీలకంగా మారిన ఫిజియోథెరపీ
- పోస్టు కోవిడ్ రిహాబిలిటేషన్‌లోనూ ముఖ్యపాత్ర
- నేడు ప్రపంచ ఫిజియోథెరపీ డే

లబ్బీపేట (విజయవాడ తూర్పు): వైద్య రంగంలో ఫిజియోథెరపీ కీలకంగా మారింది. ముఖ్యంగా మొండి నొప్పుల నుంచి విముక్తి కోసం ఎక్కువ మంది ఫిజియోథెరపిస్టులను ఆశ్రయిస్తున్నారు. ఎలాంటి మందులూ వాడకుండా, చిన్న చిన్న వ్యాయామాలు, చేతులతో చేసే వైద్యమే ఫిజియోథెరపీ. నొప్పుల నుంచి విముక్తి కోసమే కాకుండా, మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స, లిగమెంట్ సర్జరీ చేసిన తర్వాత మళ్లీ సాధారణ స్థితికి వచ్చేందుకు ఫిజియోథెరపీ కీలకంగా మారింది. భుజం నొప్పి, స్పోర్ట్స్ గాయాల నుంచి ఉపశమనం కోసం ఫిజియో సేవలు ఉపయోగపడుతున్నాయి. ఫిజియోథెరపీ సేవలపై అవగాహన కలిగించేందుకు ఏటా సెప్టెంబర్ ఎనిమిదో తేదీన ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపిస్టులు అందించే సేవలపై అవగాహన కలిగిస్తుంటారు.

పెరిగిన వెన్నునొప్పి సమస్య

ప్రస్తుతం అనేక మంది వెన్నునొప్పి (నడుము నొప్పి) సమస్యతో బాధపడుతున్నారు. 30 ఏళ్ల వయస్సు దాటిన ప్రతి వంద మందిలో 60 మంది నడుమునొప్పితో ఇబ్బంది పడుతున్నారు. శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం, కుర్చీలో సరిగా కూర్చోవకపోవడం, ఎముకల్లో సాంద్రత తగ్గడం, ఎక్కువ సమయం కూర్చుని ఉండటం, డ్రైవింగ్ చేయడం, ఒక్కసారిగా అధిక బరువులు ఎత్తడం వంటి కారణంగా వెన్నెముక డిస్కు ప్రొలాప్స్ సమస్య తలెత్తి నడుము నొప్పి వస్తుంది.

ఫిజియోథెరపీతో నొప్పి దూరం

వెన్నునొప్పికి మాన్యువల్ థెరపీ (చేతులతో చేసే వైద్యం)తో విముక్తి కలిగిస్తున్నారు. ముఖ్యంగా స్టేజ్–1, స్టేజ్–2లో ఎలాంటి శస్త్ర చికిత్స అవసరం లేకుండా నొప్పినుంచి విముక్తి పొందొచ్చు. రెండు నుంచి మూడు వారాలు ఫిజియోథెరపీ చేయడం ద్వారా వెన్నునొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. అమెరికా వంటి దేశాల్లో వెన్ను నొప్పికి 12 వారాల పాటు ఫిజియోథెరపీ, విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా తగ్గకపోతేనే శస్త్ర చికిత్స వైపు ఆలోచిస్తున్నారు. ఇప్పుడు విజయవాడలో సైతం మాన్యువల్ థెరపీ సేవలు అందిస్తూ నడుము నొప్పి, మెడనొప్పి నుంచి విముక్తి కలిగిస్తున్నారు.

పోస్టు కోవిడ్ రోగులకు..

సెకండ్ వేవ్‌లో కోవిడ్ సోకిన వారిలో ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపింది. ఊపిరి తిత్తులు 50 శాతం వరకూ గట్టిపడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న వారికి శ్వాస వ్యాయామం, ఏరోబిక్, చిన్న చిన్న వ్యాయామాలతో సాధారణ స్థితికి తీసుకొచ్చారు. ఇలా ఇప్పటికీ కోవిడ్ బాధితులు ఊపిరితిత్తులను సాధారణ స్థితికి తీసుకురావడం కోసం ఫిజియోథెరపిస్టులను ఆశ్రయిస్తున్నారు.



వెన్నునొప్పికి మాన్యువల్ థెరపీ చేస్తున్న దృశ్యం

కండరాలకు బలం



నడుము కండరాలు బలహీనపడటం వల్ల వెన్నెముక డిస్కుల ప్రొలాప్స్‌తో నడుము నొప్పి వస్తుంది. అలాంటి వారికి ఫిజియోథెరపీ చేయడం వల్ల కండరాలకు బలం చేకూరి నొప్పుల నుంచి విముక్తి లభిస్తుంది. ప్రమాదాల్లో గాయపడి ఎక్కువ కాలం బెడ్‌పై ఉండటంతో జాయింట్లు బిగుసుకుపోతాయి. వాటిని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు ఫిజియోథెరపీ అవసరం. ఎముకలు, కండరాల సమస్యలకు ఫిజియోథెరపీ కీలకంగా మారింది.

– డాక్టర్ పిపవన్‌కుమార్, ఇన్‌చార్జి ప్రొఫెసర్, ఆర్థోపెడిక్ విభాగం, జీజీహెచ్

ఫిజియోథెరపీతో ఉపశమనం



వెన్నునొప్పి, మెడనొప్పితో వచ్చే వారికి మాన్యువల్ థెరపీ చేస్తాం. రెండు వారాల పాటు థెరపీ చేస్తే నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. మా వద్దకు పది మంది వస్తే వారిలో ఏడుగురు వెన్నునొప్పితో బాధపడేవారే. పోస్టు కోవిడ్ రోగుల్లో ఊపిరితిత్తుల సమస్య తలెత్తిన వారు కూడా వస్తున్నారు. బ్రీతింగ్ వ్యాయామంతో వారిని సాధారణ స్థితికి తీసుకొస్తున్నాం. కండరాల్లో బలం చేకూరేందుకు, ఎముకల పటిష్టతగా వ్యాయామం దోహదపడుతుంది.

– డాక్టర్ వి.జి.రాజేంద్రప్రసాద్, ఫిజియోథెరపిస్టు, విజయవాడ

మార్కెట్‌లోకి విజయ నూతన ఉత్పత్తులు



నూతన ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలక వర్గ సభ్యులు

చిట్టినగర్ (విజయవాడ పశ్చిమ): విజయ బ్రాండ్‌తో కృష్ణా మిల్క్ యూనియన్ మ్యాంగో లస్సీ, ఆవు పాలు, రెండు రుచుల్లో ఎనర్జీ డ్రింక్స్‌లను మార్కెట్‌లోకి తీసుకొచ్చిందని సంస్థ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. పాలప్రాజెక్టు ఆవరణలోని బోర్డు మీటింగ్ హాల్‌లో కృష్ణా మిల్క్ యూనియన్ సభ్యుల సర్వసభ్య సమావేశం చైర్మన్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలను చర్చించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో నూతన ఉత్పత్తులను చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యుల చేతుల మీదుగా మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ.. వినియోగదారులకు అవసరమైన మంచి పోషకాలు అందించే లక్ష్యంతో రెండు రుచులలో ఎనర్జీ డ్రింక్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. యాపిల్, ఆరంజ్ రుచుల్లో 200 మిల్లీలీటర్ల టెట్రాప్యాక్ డ్రింక్‌ను రూ.10కి అందిస్తున్నామన్నారు. మామిడి రుచితో 175 మిల్లీలీటర్ల కప్‌లో లభించే లస్సీ రూ.30, అర లీటరు ఆవుపాల ప్యాకెట్ రూ.27 చొప్పున మార్కెట్‌లో లభిస్తాయని పేర్కొన్నారు. ఆవుపాలను గురువారం నుంచి విజయ అవుట్‌లెట్లలో అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లాలోని పాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని, పాల సంఘాల నుంచి 16 శాతం అధికంగా పాల సేకరణ చేస్తున్నామని చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. ఇక విజయ పాల ఉత్పత్తుల విక్రయాలు ఆరు శాతం వృద్ధి చెందాయని, పెరుగు విక్రయాల్లో 17 శాతం, ఇతర ఉత్పత్తుల్లో 120 శాతం వృద్ధి నమోదైందని వివరించారు. వచ్చే దసరా నాటికి వీరవల్లి వద్ద నిర్మిస్తున్న విజయ డెయిరీ రెండో యూనిట్‌ను ప్రారంభించే దిశగా పనులు సాగుతున్నాయన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరం రూ.1150 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా యూనియన్ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పాలకవర్గ సభ్యులు, జిల్లా బోర్డు డైరెక్టర్లు, సమితి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అందరినీ ఆకట్టుకునే అల్లూరి



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీవిష్ణు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పౌరుషం, పోలీస్ పవర్ కలిపితేనే అల్లూరి చిత్రమని హీరో శ్రీవిష్ణు అన్నారు. ఈ సినిమా సకుటుంబ సమేతంగా చూడదగినదని పేర్కొన్నారు. ప్రచారంలో భాగంగా బుధవారం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో చిత్ర యూనిట్ సభ్యులు సందడిచేశారు. ఈ సందర్భంగా హీరో శ్రీ విష్ణు విలేకరులతో మాట్లాడారు. అల్లూరి సినిమా యాక్షన్ డ్రామా అని, పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో తొలిసారిగా నటిస్తున్నానని చెప్పారు. ఈ సినిమా కచ్చితంగా యూత్‌తో పాటు, ప్రతి ఒక్కరినీ అలరిస్తుందని అన్నారు. ట్రెయిలర్‌కి ఇప్పటికే ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చిందని సంతోషం వ్యక్తంచేశారు. ఈ నెల 23వ తేదీన రెండు తెలుగు రాష్ట్రాల్లో అల్లూరి సినిమా విడుదలవుతుందని తెలిపారు. తన కెరీర్‌లో ఒక బిగ్గెస్ట్ మూవీగా నిలవనుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ సినిమాల్లో చాలా పాత్రలు చేశానని, పోలీస్ క్యారెక్టర్‌తో ఇండస్ట్రీలో మంచి గుర్తింపు వస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు.

ఏపీ పవర్ డిప్లొమా ఇంజినీర్ల సంఘ కార్యవర్గం ఎన్నిక



ఏపీ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ నూతన కార్యవర్గం

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ విజయవాడ సర్కిల్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం బందరు రోడ్డులోని హోటల్ జరిగింది. ఈ సమావేశంలో నూతన డివిజనల్, సర్కిల్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏపీ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ విజయవాడ సర్కిల్ అధ్యక్షుడుగా వి.మత్స్యేంద్రరాజు, కార్యదర్శిగా పి.సాంబశివరావు, కోశాధికారిగా వి.భాస్కరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.మురళి, ఆర్గనైజింగ్ ఉమన్ సెక్రటరీగా కె.దివ్య ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఏపీసీపీడీసీఎల్ కంపెనీ ప్రెసిడెంట్ కె.వి.రమణారావు, జనరల్ సెక్రటరీ ఎ.గురునాథం, ఏపీ స్టేట్ ఫైనాన్స్ సెక్రెటరీ కె.వి.చౌదరి, స్టేట్ ఆఫీస్ సెక్రటరీ ఆర్.సాంబశివరావు, విజయవాడ సర్కిల్ సెక్రటరీ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏపీఎన్ఎస్ఏ ప్రెసిడెంట్ ఎలక్ట్‌గా డాక్టర్ విజయ



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ (ఏపీఎన్ఎస్ఏ) రాష్ట్ర స్థాయి వార్షిక సమావేశం ఈ నెల మూడు, నాలుగో తేదీల్లో తిరుపతిలో జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ 2022–23 కాలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయను ప్రెసిడెంట్ ఎలక్ట్‌గా సమావేశంలో ఎనుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు 1994లో ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం అసోసియేషన్‌లో 600 మందికి పైగా సభ్యులు క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. డాక్టర్ విజయ 2022–23లో సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా, 2023–24లో ప్రెసిడెంట్‌గా వ్యవహరించనున్నారు. ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంటర్స్, జిల్లాస్థాయిలో ఉండే న్యూరోక్లబ్ వారి సహకారంతో, సమన్వయంతో సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానని డాక్టర్ విజయ తెలిపారు. న్యూరోక్లబ్స్ లేనిచోట కొత్తవి స్థాపించేందుకు కృషి చేస్తానని, ప్రతి ఏడాది పీజీ వైద్యులకు న్యూరోక్లబ్‌ను, న్యూరో సైంటిస్టుల కోసం సదస్సులు ఏర్పాటు చేస్తానన్నారు. మెదడు, నరాల జబ్బులపై రాష్ట్రం అంతా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తానని డాక్టర్ విజయ వెల్లడించారు. ప్రెసిడెంట్ ఎలక్ట్‌గా ఎన్నికైన డాక్టర్ విజయకు గుంటూరుకు చెందిన పలువురు న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు అభినందనలు తెలిపారు.

13న పీఎంఎఫ్‌ఎంఈ స్కీమ్‌పై అవగాహన సదస్సు

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ అభియాన్, మేక్ ఇన్ ఇండియా పిలుపులో భాగంగా పీఎంఎఫ్ఎంఈ (ప్రైమ్ మినిస్టర్ ఫార్మలైజేషన్ ఫర్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్) స్కీమ్‌పై ఈనెల 13న అవగాహన, ఫుడ్ బిజినెస్ – ఉపాధి ఎగుమతి అవకాశాలపై శిక్షణ సదస్సు నిర్వహించనున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ దాసరి దేవరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవగాహన సదస్సు ఈనెల 13వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు సత్యనారాయణపురం నాడార్స్ ఫంక్షన్ హాల్ సమీపంలోని ఎంఎస్ఎంఈ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరుగుతుందన్నారు. 2025 లోపు రెండు లక్షల ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు స్థాపించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన పలు ఫుడ్ ప్రాసెసింగ్ స్కీములపై అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సర్టిఫికెట్‌తో పాటు హ్యాండ్ మెటీరియల్స్, ఎంఎస్ఎంఇసీసీ సభ్యత్వం రాయితీ కూడా కల్పించటం జరుగుతుందన్నారు. మరింత సమాచారం కోసం ఎంఎస్ఈ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో స్వయంగా కానీ, 8919737517, 6305941717 నంబర్లలో కానీ సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

సైబర్ టాక్

సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను స్క్రోల్ చేస్తున్నప్పుడు అనేక ప్రకటనలు పాప్ అప్ అవుతూ ఉంటాయి. కానీ, అవి ఎలాంటి రిజిస్టర్ కాని వాణిజ్య పోర్టల్స్. ఎవరైనా నమ్మి వీటిలో మెంబర్స్‌గా చేరితే, అధిక మొత్తంలో నష్టపోయే అవకాశాలు ఉన్నాయి. గృహిణులను లక్ష్యం చేసుకునే ఈ మోసాలు జరుగుతుంటాయి. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు కోసం చూస్తున్న వ్యక్తులను మోసం చేయడానికి స్కామర్లు కొత్తమార్గాలను ఎంచుకుంటుంటారు. ఇలాంటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తప్పక తెలిసుండాలి. అప్పుడే మోసాల బారిన పడకుండా ఉండగలం.



ప్రతీకాత్మక చిత్రం

• ఆన్‌లైన్ ట్రేడింగ్

ఎంత భద్రం?

ఇంటర్నెట్ ఆధారిత సమాచారం రోజు రోజుకూ పెరుగుతున్న ఈ కాలంలో ఎక్కువ మంది వ్యక్తులు తమ పెట్టుబడి నిర్ణయాలను తీసుకోవడానికి ఆన్‌లైన్, సోషల్ మీడియాపై అధికంగా ఆధారపడుతున్నారు. ఎందుకంటే ప్రతిదీ ఫింగర్ టిప్స్ మీద లభిస్తుండటమే కారణం. అందుకే, స్కామర్లు కూడా ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడుల కోసం చూస్తున్న వ్యక్తులను మోసం చేయడానికి వేగవంతంగా కొత్త మార్గాలను అమలు చేస్తుంటారు.

■ **ఫ్యాన్సీ ప్రకటనలు**

చాలావరకు ఆన్‌లైన్ ప్రకటనలన్నీ ఆకర్షణీయంగా ఉంటాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా సమాచారం కోసం స్క్రోలింగ్ చేస్తున్నప్పుడు అనేక ప్రకటనలు కనిపిస్తూ ఉంటాయి. అవి అలా కుప్పలు తెప్పలుగా ఆన్‌లైన్‌లోకి రావడం కూడా బ్రోకరేజీ రహితంగా ఉండటం, సులభమైన వాణిజ్య పోర్టల్, తక్షణ పరిష్కారాలు ఉండటం వల్లనే. వీటిలో చాలా ఏజెన్సీలు రిజిస్టర్ చేసి ఉండవు. కానీ ప్రముఖ అధికారిక కార్పొరేట్ ట్రేడింగ్ కంపెనీల కంటే మరింత శక్తిమంతమైన ఫ్యాన్సీ ప్రకటనలను ఉంచుతుంటారు.

స్కామర్లు ఆకర్షణీయంగా ఉన్న ప్రకటనలను ఎర వేసి ఈ బోగస్ యాప్‌లు, వెబ్‌సైట్‌లలో తమ వివరాలతో రిజిస్టర్ చేసుకున్న వారికి మొదట్లో కొంత మొత్తంలో డబ్బులు జమ చేస్తుంటారు. ఈ విధానం ద్వారా డబ్బు సంపాదించినట్లు చెప్పుకునే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లను వీరు అనుసరిస్తారు. పాయింట్లకు బదులుగా వారు యాప్ వాలెట్‌లో డబ్బును డిపాజిట్ చేయమని అడుగుతారు, అది తర్వాత ట్రేడింగ్ కోసం ఉపయోగిస్తారు.

మోసగాళ్లు ఉపయోగించే కొన్ని పథకాలు

■ **పోంజీ పథకం**

ఇది కొత్త పెట్టుబడిదారుల నుండి సేకరించిన డబ్బుతో చేసే మోసం. ఇప్పటికే ఉన్న పెట్టుబడిదారులకు కొంత మొత్తం చెల్లిస్తూ వారి ద్వారా మరిన్ని పెట్టుబడులను రాబట్టడం.

■ **పంప్, డంప్ స్కీమ్**

ఇది ఒక పెట్టుబడి మోసం. ఇక్కడ సలహాదారులు పెట్టుబడిదారులను తప్పుదోవ పట్టించేలా సమాచారాన్ని అందించి, షేర్ల ధరను బంప్ చేయడానికి (పెంచడానికి) ప్రయత్నిస్తారు. అప్పుడు ఈ పెట్టుబడిదారులు సలహాదారులను నమ్మి తమ షేర్లను (అవి మంచి విలువ కలిగినప్పుడు) అమ్మేస్తారు.

■ **యాప్ ఆధారిత స్కీమ్‌లు**

పెట్టుబడిదారులకు మోసగాళ్లు తరచు వాలెట్ బ్యాలెన్స్‌ల నకిలీ చిత్రాలను చూపుతూ ఫిషింగ్ ఇ-మెయిల్స్‌ను పంపుతారు. సాధారణంగా క్రిప్టో కరెన్సీలు స్టాక్‌లు లేదా ఈ కామర్స్ ఉత్పత్తులు.. వీటిలో భాగంగా ఉంటాయి.

■ **తప్పుదారి పట్టించడానికి..**

పెట్టుబడి పోకడలు, పరిశోధన స్టాక్‌లపై సమాచారాన్ని సేకరించడానికి, ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా వేగవంతంగా ఆదాయ అవకాశాలను చర్చించడానికి పెట్టుబడిదారులు ఫేస్‌బుక్, ట్విటర్, టీమ్ వ్యూవర్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్.. వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగిస్తారు. స్కామర్‌లు నకిలీ సిఫారసులు చేస్తారు. అయాచిత పెట్టుబడి చిట్కాలు ఇస్తారు. వీటిలో నకిలీ గుర్తింపు లేదా తప్పుదారి పట్టించే సమాచారం ద్వారా పెట్టుబడిదారులను ఒప్పించే కొన్ని పద్ధతులు ఉంటాయి.

మోసానికి మార్గాలు

• స్కామర్లు తాము విజయవంతమైన వ్యాపారులుగా, గ్యారెంటీ రిటర్న్ ఇస్తున్నట్టుగా, ట్రేడింగ్ సలహాలను అందిస్తున్నట్లు క్లెయిమ్ చేసుకుంటారు • ఇందుకోసం సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు చేసిన ఫోనీ టెస్టిమోనియల్ యూట్యూబ్ వీడియోలను ఉపయోగిస్తారు • 'పంప్ అండ్ డంప్' కార్యకలాపాలను నిరోధించడానికి ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తారు • నకిలీ సమాచారంతో ఆన్‌లైన్ పెట్టుబడి చిట్కాలు, నకిలీ ఎండార్స్‌మెంట్‌లను పంపుతుంటారు • స్టాక్ సిఫార్సులు లేదా పెట్టుబడి సలహాలకు బదులుగా సబ్‌స్క్రిప్షన్ రుసుమును సేకరించేందుకు ఉద్దేశించిన స్టాక్ పోర్ట్ ఫోలియో స్క్రీన్‌షాట్‌లను ప్రదర్శిస్తుంది • పెట్టుబడిదారులను టెక్నికల్ అనలిస్ట్‌లు లేదా ట్రేడింగ్ నిపుణులను చేస్తానని నమ్మబలికి స్కామర్లు వర్క్‌షాప్‌ల కోసం రిజిస్ట్రేషన్ ఫీజులను తీసుకుంటారు కానీ వారికి హోస్ట్ చేయరు.

■ **పెట్టుబడిని ఎరగా వేస్తారు**

చాలా మంది పెట్టుబడిదారులు మొదట్లో సంస్థ నుండి కొంత రాబడిని పొందుతారు. దీంతో ఇన్వెస్టర్ల ట్రేడింగ్ విజయవంతమైందని స్కామర్లు అనుకుంటారు. స్కామర్‌లు ఎక్కువ పెట్టుబడి పెట్టడానికి శిష్యుడిని లేదా స్నేహితుడిని పరిచయం చేయడానికి మరింత ప్రోత్సహిస్తారు. డబ్బులు వస్తాయి కదా అని తమకు తెలిసినవారికి సదరు యాప్ లేదా వెబ్‌సైట్ వివరాలు ఇచ్చి వారిని కూడా చేరమని అంటారు. అయితే, చివరికి రిటర్న్‌లు ఆగిపోతాయి, కస్టమర్ ఖాతా సస్పెండ్ చేయబడుతుంది. డబ్బు వాలెట్‌లో ఇరుక్కుపోయి ఉంటుంది. సంస్థతో తదుపరి ఎలాంటి పరిచయం ఉండకపోవడంతో తాము పెట్టిన పెట్టుబడిని ఎలా పొందాలో తెలియక చాలా ఇబ్బంది పడతారు.

■ **అవకాశాల కోసం 7 రకాల వలలు**

దశ 1: ముందుగా బాధితులను వాట్సాప్ / టెలిగ్రామ్ గ్రూపుల్లో చేరమని అభ్యర్థిస్తారు.

దశ 2: లింక్‌ల ద్వారా యాప్‌లను డౌన్‌లోడ్ చేయమని అడుగుతారు. ఈ కొత్త సభ్యులందరికీ మొదట్లో జాయినింగ్ బోనస్ లభిస్తుంది. అయితే అది వారి వాలెట్‌లో మాత్రమే కనిపిస్తుంది.

దశ 3: ట్రేడింగ్ జరుగుతుంది (బాధితులు విధులు నిర్వర్తించమని అడుగుతారు), అంటే, షేర్ల అమ్మకం/కొనుగోలు, లేదా కొన్నిసార్లు బాధితులు ఇ-కామర్స్ ఉత్పత్తులను కొనుగోలు చేయమని లేదా విక్రయించమని అడుగుతారు.

దశ 4: బాధితులను సిస్టమ్‌కి కొత్త వ్యక్తులను పరిచయం చేయమని అడుగుతారు. ఇది నిజమని, తమకూ కొంత పెట్టుబడి చేరుతుందన్న ఆశతో మంచి పార్టీలను పరిచయం చేస్తారు. అలా పరిచయం చేసిన వ్యక్తి ద్వారా స్కామర్లు వారి వాలెట్‌కి డబ్బు చేరేలా చేస్తారు.

దశ 5: చేసిన పనుల ఆధారంగా వాలెట్ డబ్బును కూడగట్టుకుంటుంది.

దశ 6: బాధితుడు వారి వాలెట్ల నుండి తమ ఆదాయాన్ని ఉపసంహరించుకోవడానికి ప్రయత్నించినప్పుడు వీలుపడదు. ఒక్కోసారి వీలున్నా ఆదాయపు పన్ను, ప్రాసెసింగ్ ఫీజు, జీఎస్టీ రుసుము మొదలైనవి చెల్లించాల్సి ఉంటుంది.

దశ 7: కోరిన ఫీజు చెల్లించిన తర్వాత, యాప్‌లు పని చేయవు. అవి ఏదో ఒక సాంకేతిక లోపాన్ని చూపుతాయి. కస్టమర్ సేవను చేరుకోవడానికి చేసే ప్రయత్నాలూ ఫలించవు.

పెట్టుబడులకు డేంజర్ సిగ్నల్స్

బాధితుల ఆశను లక్ష్యంగా చేసుకుని రూపొందించిన విభిన్న పద్ధతులతో మోసగాళ్ల వారి లక్ష్యాన్ని ఛేదిస్తారు. అలా కాకుండా మనల్ని మనం కాపాడుకోవాలంటే..

- అసాధారణంగా అధిక హామీతో కూడిన రాబడిని వాగ్దానం చేస్తారు, గమనించాలి.
- అధిక ప్రారంభ పెట్టుబడిని అభ్యర్థిస్తారు.
- సంక్లిష్టమైన, నిలకడలేని వ్యాపార నమూనా ఉంటుంది.
- నష్టాలను తిరిగి చెల్లిస్తామని వాగ్దానం చేస్తారు.
- వెంటనే డబ్బు పెట్టుబడిగా పెట్టమని ఒత్తిడి చేయచ్చు.
- యాప్ స్టోర్ లేదా ప్లే స్టోర్‌లలో లిస్ట్‌లో లేని యాప్‌లలో పెట్టుబడి పెట్టమని కోరతారు.
- అధిక రాబడిని పొందినట్లు పేర్కొంటూ సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల మద్దతును కోరుతారు.
- స్కామర్ల కార్యాలయాలు మన దేశం లోపల ఉన్నాయా, వెబ్‌సైట్, యాప్‌లలో ఉండే చిరునామాలను చూపుతున్నాయా అనేది చెక్ చేసుకోవాలి.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



• కొత్త ఉపాధి

షూజియా లాండ్రీ

జీవితంలో ఎన్నో అనుకుంటాం. కానీ అనుకున్నవన్నీ జరగవు. కొంతమంది అనుకున్నవి జరగక పోయినా... ఇప్పటికి ఇదే ప్రాప్తం అనుకుని ఉన్న దానితో సంతృప్తి చెందుతుంటారు. మరికొందరు మాత్రం తాము చేసే పనిలో సంతృప్తి దొరకక నిత్యం మధనపడుతుంటారు. ఇలా మధనపడుతూనే తనకు నచ్చిన పనిని ఎంచుకుని షూ లాండ్రీ యజమానిగా మారి ఎంతో సంతృప్తిగా జీవిస్తోంది షాజియా కైజర్.

బీహార్‌లోని భాగల్పూర్‌కు చెందిన షాజియా ఓ ప్రభుత్వ ఉద్యోగి కూతురు. ఇంటర్మీడియట్ అయిన వెంటనే పెళ్లి చేశారు. షాజియాకేమో పై చదువులు చదవాలని ఆశ. తన కెరీర్‌ను ఉన్నతంగా మలుచుకోవాలన్న కోరిక. ఈ క్రమంలోనే భర్త అనుమతితో ఫిజియో థెరపీలో డిగ్రీ పూర్తి చేసింది. అయితే ఫిజియోథెరపిస్టుగా పనిచేయకుండా రెండేళ్లపాటు టీచర్ ఉద్యోగం చేసింది. తనకు చాలా ఆనందంగా అనిపించింది. కానీ మనసులో ఇంకా ఏదో చేయాలన్న తపన. అదికూడా పెద్దగా చేయాలి. దీంతో టీచర్ ఉద్యోగం మానేసి యూనిసెఫ్‌లో చేరింది. ఇక్కడ పనిచేస్తున్నప్పటికీ స్వేచ్ఛగా పనిచేసే వెసులుబాటు కనిపించకపోవడంతో ఏదైనా వ్యాపారం చేద్దామనుకుంది.

బూట్లు ఉతికే లాండ్రి

ఓ రోజు మ్యాగజీన్ చదువుతోన్న షాజియాకు బూట్లు శుభ్రం చేసే లాండ్రి సర్వీస్ గురించి తెలిసింది. బూట్ల లాండ్రీ పెడితే బావుంటుందన్న ఆలోచనతో షూస్‌ని ఎలా శుభ్రం చేస్తారో తెలుసుకోవడం ప్రారంభించింది. లెదర్‌తో తయారు చేసే షూలను వివిధ రకాల రసాయనాలు ఉపయోగించి క్లీన్ చేస్తారని తెలిసింది. షూ క్లీనింగ్ గురించి మరింతగా తెలుసుకునేందుకు చెన్నైలోని 'సెంట్రల్ ఫుట్ వేర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్'లో చేరి పాదరక్షలను తయారు చేసే టెక్నాలజీ, డిజైనింగ్ గురించి పూర్తిగా స్టడీ చేసింది. ఆ తరువాత నోయిడాలోని 'ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి లెదర్‌తో తయారు చేసే చెప్పులు, బూట్లు, వివిధ రకాల బ్యాగ్‌ల గురించి క్షుణ్ణంగా తెలుసుకుంది. పట్నాలో 2014లో బూట్లు శుభ్రం చేసే 'రివైవల్ షూ లాండ్రి' పేరుతో ఇద్దరు పనివాళ్లతో కలిసి ఒక చిన్నపాటి షాపును ప్రారంభించింది.

అయితే షూ లాండ్రీ అంటే ఏమిటో తెలియక వీరి షాపుకు చాలామంది చినిగిపోయిన బూట్లు తెచ్చి ఇచ్చేవారు. వారిని ఏమాత్రం విసుక్కోకుండా వాటిని చక్కగా కుట్టి శుభ్రంగా కడిగి కొత్తవాటిలా మార్చి తిరిగి ఇవ్వడంతో లాండ్రీకి వచ్చే కస్టమర్ల సంఖ్య పెరిగింది. దాంతో చూస్తుండగానే ఈ బిజినెస్ పెరిగిపోయింది. వీరి లాండ్రీకి కస్టమర్ల నుంచి ఆదరణ లభించడంతో బీహార్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ 2016లో షాజియా షూ లాండ్రిని 'బెస్ట్‌స్టార్టప్' అవార్డుతో సత్కరించింది.



షూ లాండ్రీలో షాజియా



లాండ్రీలో ఇతర సభ్యులతో..

ఇప్పుడు లక్షల టర్నోవర్‌తో లాండ్రీ నడుస్తోంది. సీఎం నితీష్‌కుమార్, ఇంకా సీనియర్ ఉన్నతాధికారులు సైతం షాజియా లాండ్రిలో బూట్లు సర్వీసింగ్ చేయించుకుంటున్నారు. ప్రస్తుతం పాట్నా వ్యాప్తంగా ఐదు అవుట్‌లెట్లతో ఎంతోమందికి ఉపాధిని కల్పిస్తోంది షాజియా లాండ్రీ. అంతేగాక షాజియా దగ్గర షూ క్లీనింగ్‌లో శిక్షణ తీసుకున్న కొంతమంది ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఢిల్లీ, ఒడిషాలలో షూ లాండ్రీలను నడుపుతున్నారు.

రంగు వెలిసినా...

షాజియా లాండ్రీలో రంగువెలిసిన బూట్లకు కొత్త రంగు వేయడం, ట్రాలీ బ్యాగ్స్, బ్యాక్‌ప్యాక్స్, లెదర్, ల్యాప్‌టాప్ బ్యాగ్‌లను రిపేర్ చేయడంతోపాటు షూస్‌ను ఆవిరి మెషిన్ మీద శుభ్రం చేసి ఇస్తుంది.

చేతల ద్వారానే సమాధానం

మొదట్లో షూ లాండ్రి పెట్టాలనుకుంటున్నానని చెప్పినప్పుడు అందరూ 'ఇంత చదువుకుని బూట్లు కుట్టే పనిచేస్తావా?' అని ప్రశ్నించారు. బూట్లు కుట్టడం కాదు అంతకు మించి దీనిలో చేయడానికి చాలా ఉందని చెప్పాను. కానీ స్నేహితులు, కుటుంబ సభ్యులు ఫిజియోథెరపిస్ట్‌గా ఆసుపత్రిలో పనిచేయడమే ఉత్తమమని సలహా ఇచ్చారు. కొంతమంది అయితే రకరకాల మాటలతో అవహేళన కూడా చేశారు. నేను ఎవరి మాటలకు బదులు చెప్పడంగానీ, ఖండించడం గానీ చేయలేదు. మౌనంగా ఉండిపోయాను. భవిష్యత్తే వీరికి సమాధానం చెబుతుంది అనుకున్నాను. అనుకున్నట్లుగానే నా లాండ్రీతో లక్షలు సంపాదిస్తూ వారి మాటలకు నా చేతల ద్వారానే జవాబు ఇస్తున్నాను.

– షాజియా

మానసిక కల్లోలం, డిప్రెషన్, నిద్రలేమి, జ్ఞాపక శక్తి సమస్యలు .. 40 ఏళ్లు దాటిన చాలా మంది మహిళలు ఈ లక్షణాలన్నీ లేదా వీటిలో ఏదో ఒకదానిని అనుభవిస్తుంటారు. మెనోపాజ్‌కి కొన్ని సంవత్సరాల దూరంలో ఉన్నందువల్లనో, ప్రీ మెనోపాజ్ దశను అధిగమించలేకనో నాలుగుపదులు దాటిన వారి జీవితం కొంచెం కష్టంగా అనిపిస్తుంటుంది. ఈ సమస్యలనే ఇతివృత్తంగా తీసుకొని W@40 (ఉమన్ ఎట్ ఫార్టీ) పేరుతో 12 నిమిషాల నిడివిగల షార్ట్ ఫిల్మ్‌ను తీశారు స్మితా సతీష్.



లఘు చిత్రం పోస్టర్

• స్మార్ట్ ఫిల్మ్

ఉమెన్ @ 40

స్మితా సతీష్ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, సామాజిక కార్యకర్త, మోటివేషనల్ ట్రైనర్. గతంలో స్మిత జువైనల్ జస్టిస్ బోర్డ్‌లో సభ్యురాలుగా ఉన్నారు. కేరళలోని త్రిసూర్‌లో ఉంటారు ఈమె. 43 ఏళ్ల స్మిత తన వ్యక్తిగత జీవితంలో చూసినవి, తనను కలిసిన కొంత మంది మహిళల సమస్యలను ఉదాహరణగా తీసుకుని 40 ఏళ్లు దాటిన గృహిణి పరిస్థితులతోబాటు, వారికి కుటుంబ మద్దతు ఎంత వరకు అవసరమో W@40 షార్ట్ ఫిల్మ్‌లో కళ్లకు కడుతుంది.

హాట్ ఫ్లాష్

ఈ ఏడాది మొదట్లో 'హాట్ ఫ్లాష్' అనే పేరుతో షార్ట్ ఫిల్మ్‌ను రూపొందించారు స్మిత. ముందస్తు మెనోపాజ్ లక్షణాలలో ఒకటైన హాట్ ఫ్లాష్‌తో (అకస్మాత్తుగా వేడిగా అనిపించడం, తీవ్రమైన చమట పట్టడం) ఉన్న నలభై ఏళ్ల గృహిణి గురించి వివరించారు. ఉన్నట్టుండి చిరాకుగా మారడం, కోపం తెచ్చుకోవడం లేదా కారణం లేకుండా ఏడవడం, అందరూ తనను నిర్లక్ష్యం చేస్తున్నట్టు భావించడం .. ఇవన్నీ డాక్టర్, సైకాలజిస్ట్ సహాయంతో అధిగమించడం వరకు పాత్ర భావోద్వేగ ఎత్తుపల్లాల గుండా వెళుతుంది.

'శరీరం మార్పులకు లోనవుతుంటుంది. రుతుక్రమంలో మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ సమయంలో నలభై దాటిన వారి ప్రతి చర్యలను గమనించిన తర్వాత ఏదైనా చేయాలనుకున్నాను. అలా ఈ లఘు చిత్రాన్ని తీశాను' అంటారామె. ఈ ఫిల్మ్‌కి స్మిత ఫొటోగ్రాఫర్‌గా వ్యవహరించగా, ఇతర నటీనటులు వివిధ రంగాలలో ఉన్నవారు మొదటిసారి నటించారు.

మహిళలకు అవగాహన తప్పనిసరి

నలభై ఏళ్ల దాటిన మహిళల రోజువారీ సాధారణ లక్షణాలను హైలైట్ చేయడానికి ఆమె వివిధ పాత్రల ద్వారా మన ముందుకు తీసుకువచ్చారు. 'మీరు బాగున్నారా?' అనే ప్రశ్న సాధారణంగా మంచి అనుభూతిని ఇస్తుంది. కానీ, సమస్య ఏంటంటే, ఈ దశలో ఉన్న మహిళలు తాము ఎందుకు కష్టంగా ఉన్నారో వారికై వారే అర్థం చేసుకోలేరు. కుటుంబ సభ్యులకు కూడా ఈ మహిళల మానసిక కల్లోలం, ప్రవర్తనలో మార్పుల గురించి ఏ మాత్రం తెలియదు' అంటారు స్మిత.



స్మితా సతీష్

అలాంటి మహిళలకు అవగాహన కల్పించేందుకు ఈ ఫిల్మ్ సాయపడుతుంది.

'చాలామంది ప్రసూతి వైరాగ్యం అంటే ప్రసవానంతరం డిప్రెషన్ గురించి ఇప్పుడిప్పుడే చర్చిస్తున్నారు. అలాగే, ప్రీ మెనోపాజ్ లేదా మెనోపాజ్ గురించి మాట్లాడాల్సిన సమయం ఆసన్నమైంది. తప్పనిసరి పరిస్థితులలో అవసరం అనుకుంటే వైద్యులు కొన్నిసార్లు హార్మోన్ల చికిత్సను సూచిస్తారు.

ఈ వయసులో ఆరోగ్యకరమైన జీవనశైలి వల్ల వారి ప్రపంచం అందంగా మారుతుంది. అభిరుచులను పెంచుకోవడానికి, సృజనాత్మకమైన పనులు చేయడానికి సహాయపడుతుంది. ముఖ్యమైన విషయం ఏంటంటే.. కుటుంబం, స్నేహితులు వారికి అండగా ఉండాలి. వారి సమస్యలు అందరి చెవికెక్కాలి' అనే విషయాన్ని స్మిత తన ఫిల్మ్ ద్వారా వివరించారు. డబ్ల్యూ ఎట్ ఫార్టీ ఫిల్మ్ నలభై ఏళ్ల వయసు దాటిన మహిళలకు చక్కటి సూచికలా ఉపయోగపడుతుంది.

ఇంటిప్స్



పిల్లలకు జలుబు, దగ్గు వచ్చాయంటే ఒక పట్టాన వదలవు. ఇలాంటప్పుడు అల్లం తొక్కతీసి సన్నగా తురమాలి. అల్లం తురుము నుంచి రసం పిండి, అందులో టీస్పూను తేనె కలిపి పిల్లలకు తాగించాలి. జలుబు, దగ్గు త్వరగా తగ్గుతాయి. ఇది నేరుగా తాగలేనప్పుడు కొద్దిగా వేడి నీళ్లు కలిపి తాగించాలి.



- పేస్టు అయిపోయిందని ట్యూబ్‌లు పడేయకుండా.. రెండు ముక్కలుగా కత్తిరించాలి. పాత టూత్ బ్రష్‌తో ఈ ముక్కల్లో మిగిలిపోయిన టూత్‌పేస్టుని తీసి కిచెన్ సింక్, ట్యాప్‌లను రుద్దితే తెల్లగా పేరుకుపోయిన మురికి, నీటి మరకలు పోయి కొత్తవాటిలా మెరుస్తాయి.
- ఉప్పునీటిలో కప్పు డెటాల్ వేసి చక్కగా కలపాలి. ఈ నీటిని కిచెన్ టైల్స్, కిచెన్ ప్లాట్‌ఫాం, స్టవ్ చుట్టుపక్కల స్ప్రే చేస్తే క్రిమికీటకాలు, బొద్దింకలు వంటివి రావు.





డైమండ్ లీగ్ ఫైనల్స్ బరిలో నీరజ్

ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ ఫైనల్స్ మీట్‌లో పసిడి పతకమే లక్ష్యంగా భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా బరిలోకి దిగనున్నాడు. జ్యూరిక్‌లో ఈరోజు డైమండ్ లీగ్ ఫైనల్స్ జరగనుంది. జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్‌తో కలిపి మొత్తం ఆరుగురు పోటీపడనున్నారు. 2017, 2018 డైమండ్ లీగ్ ఫైనల్స్ మీట్‌కు నీరజ్ అర్హత సాధించినా పతకం సాధించలేకపోయాడు. గత ఏడాది టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణంతో సంచలనం సృష్టించిన నీరజ్ ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతంతో మెరిశాడు.

మూడేళ్ల తర్వాత ఇంగ్లండ్ జట్టులోకి...

వచ్చే నెలలో జరిగే టి20 ప్రపంచకప్‌లో పాల్గొనే ఇంగ్లండ్ జట్టులో ఒక మార్పు చోటు చేసుకుంది. గాయపడ్డ బెయిర్‌స్టో స్థానంలో అలెక్స్ హేల్స్‌ను జట్టులోకి ఎంపిక చేశారు. మూడేళ్ల తర్వాత జాతీయ జట్టులోకి వచ్చిన హేల్స్ ఇంగ్లండ్ తరఫున 60 టి20 మ్యాచ్‌లు ఆడి 1,644 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, ఎనిమిది అర్ధ సెంచరీలు ఉన్నాయి. మైదానం బయట అనుచిత ప్రవర్తన కారణంగా 2019 వన్డే ప్రపంచకప్‌నకు ముందు హేల్స్‌పై వేటు వేశారు.



స్పోర్ట్స్ రీల్

భారత్ శుభారంభం


సౌమ్య

కఠ్మాండు (నేపాల్): ఆరోసారి టైటిల్ సాధించాలనే లక్ష్యంతో దక్షిణాసియా మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో (శాఫ్) బరిలోకి దిగిన భారత జట్టు శుభారంభం చేసింది. పాకిస్తాన్‌తో బుధవారం జరిగిన గ్రూప్ 'ఎ' తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 3–0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున డాంగ్మే గ్రేస్ (23వ ని.లో), తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ (90+4వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... అంతకుముందు పాకిస్తాన్ జట్టు చేసిన సెల్ఫ్ గోల్‌తో భారత్ ఖాతా తెరిచింది. భారత్ తన తదుపరి మ్యాచ్‌లో ఈనెల 10న మాల్దీవులు జట్టుతో ఆడుతుంది.

జూనియర్ ప్రపంచ నంబర్‌వన్‌గా అనుపమ



న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) అండర్–19 మహిళల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో కొత్త నంబర్‌వన్‌గా భారత్‌కు చెందిన అనుపమ ఉపాధ్యాయ అవతరించింది. హరియాణాలోని పంచ్‌కులాకు చెందిన 17 ఏళ్ల అనుపమ ఈ ఏడాది ఉగాండా, పోలాండ్ ఇంటర్నేషనల్ టోర్నీలలో విజేతగా నిలిచింది. టాప్ ర్యాంక్‌లో ఉన్న భారత్‌కే చెందిన తస్నిమ్ మీర్‌ను రెండో స్థానానికి నెట్టి అనుపమ అగ్రస్థానానికి చేరింది. భారత్‌కే చెందిన అన్వేష గౌడ ఆరో ర్యాంక్‌లో, ఉన్నతి హుడా తొమ్మిదో ర్యాంక్‌లో ఉన్నారు. బెంగళూరులోని ప్రకాశ్ పదుకొనే అకాడమీలో శిక్షణ తీసుకుంటున్న అనుపమ జూనియర్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా నిలిచిన ఆరో భారతీయ ప్లేయర్‌గా గుర్తింపు పొందింది. గతంలో ఆదిత్య జోషి (2014), సిరిల్ వర్మ (2016), లక్ష్య సేన్ (2017), తస్నిమ్ (2022), శంకర్ సుబ్రమణియన్ (2022) ఈ ఘనత సాధించారు.

గార్సియా గర్జన

- 42వ ప్రయత్నంలో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్లోకి
- క్వార్టర్ ఫైనల్లో అమెరికా టీనేజర్ కోకో గాఫ్‌పై విజయం
- సెమీస్‌లో ఐదో ర్యాంకర్ ఆన్స్ జబర్‌తో 'ఢీ'



న్యూయార్క్: సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఫ్రాన్స్ టెన్నిస్ స్టార్ కరోలినా గార్సియా తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్ దశకు అర్హత సాధించింది. సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో ప్రపంచ 17వ ర్యాంకర్ గార్సియా తన జోరు కొనసాగిస్తూ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో గార్సియా 6–3, 6–4తో అమెరికా టీనేజర్, 12వ సీడ్ కోకో గాఫ్‌పై విజయం సాధించింది. ఈ ఏడాది మూడు టైటిల్స్ నెగ్గి సూపర్ ఫామ్‌లో ఉన్న 28 ఏళ్ల గార్సియా యూఎస్ ఓపెన్‌లోనూ అదే జోరు కొనసాగిస్తూ తన ప్రత్యర్థులకు ఒక్క సెట్ కూడా కోల్పోకుండా సెమీఫైనల్‌కు చేరింది. కోకో గాఫ్‌తో జరిగిన మ్యాచ్‌లో గార్సియా నాలుగు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 24 విన్నర్స్ కొట్టిన ఆమె ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసి తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయింది. నెట్ వద్దకు 16 సార్లు దూసుకొచ్చి 13 సార్లు పాయింట్లు గెలిచింది. 2011లో ప్రొఫెషనల్‌గా మారిన గార్సియా ఇప్పటివరకు 41 సార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీలు ఆడింది. 2017లో ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరడమే గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో ఆమె అత్యుత్తమ ప్రదర్శనగా ఉంది. పదోసారి యూఎస్ ఓపెన్‌లో ఆడుతున్న గార్సియా సెమీఫైనల్ చేరడం ద్వారా ఈ టోర్నీ చరిత్రలో సెమీఫైనల్ చేరిన మూడో ఫ్రాన్స్ క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది. గతంలో ఫ్రాన్స్ నుంచి అమెలీ మౌరెస్మో (2002, 2006), మేరీ పియర్స్ (2005) సెమీఫైనల్ చేరారు. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ ఆన్స్ జబర్ (ట్యునీషియా)తో గార్సియా ఆడుతుంది. ముఖాముఖి రికార్డులో జబర్ 2–0తో గార్సియాపై ఆధిక్యంలో ఉంది.


జబర్

జబర్ జోరు...

ఈ ఏడాది 42 విజయాలతో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న ట్యునీషియా ప్లేయర్ ఆన్స్ జబర్ క్వార్టర్ ఫైనల్లో అన్‌సీడెడ్ క్రీడాకారిణి ఐలా తొమ్లయనోవిచ్ (ఆస్ట్రేలియా)ను ఓడించి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరింది. గంటా 41 నిమిషాలపాటు జరిగిన క్వార్టర్ ఫైనల్లో జబర్ 6–4, 7–6 (7/4)తో తొమ్లయనోవిచ్‌పై గెలిచింది. ఈ గెలుపుతో గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో సెమీఫైనల్ చేరిన తొలి ఆఫ్రికా మహిళా టెన్నిస్ ప్లేయర్‌గా జబర్ నిలిచింది. మరో క్వార్టర్ ఫైనల్లో ఆరో ర్యాంకర్ సబలెంకా (బెలారస్) 6–1, 7–6 (7/4)తో 22వ సీడ్ కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచి వరుసగా రెండో ఏడాది సెమీఫైనల్లోకి ప్రవేశించింది. 82 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.

కిరియోస్ జోరుకు ఖచనోవ్ బ్రేక్


ఖచనోవ్

పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ 31వ ర్యాంకర్ కరెన్ ఖచనోవ్ (రష్యా) తొలిసారి తన కెరీర్‌లో ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో... ఏడో ర్యాంకర్ కాస్పర్ రూడ్ (నార్వే) తొలిసారి యూఎస్ ఓపెన్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. ఆస్ట్రేలియా వివాదాస్పద ప్లేయర్, 23వ సీడ్ నిక్ కిరియోస్‌తో 3 గంటల 39 నిమిషాలపాటు జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఖచనోవ్ 7–5, 4–6, 7–5, 6–7 (3/7), 6–4తో గెలుపొందాడు. 6 అడుగుల 6 అంగుళాల ఎత్తు, 87 కేజీల బరువున్న ఖచనోవ్ ఈ మ్యాచ్‌లో ఏకంగా 30 ఏస్‌లు సంధించాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్, డిఫెండింగ్ చాంపియన్ మెద్వెదెవ్ (రష్యా)ను ఓడించిన కిరియోస్ 31 ఏస్‌లు సంధించినా 58 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు. ఈ మ్యాచ్‌లో కిరియోస్ కోపంతో తన రెండు రాకెట్‌లను నేలకేసి కొట్టి విరగొట్టడం గమనార్హం. మరో క్వార్టర్ ఫైనల్లో కాస్పర్ రూడ్ 6–1, 6–4, 7–6 (7/4)తో 13వ సీడ్ మాటియో బెరెటిని (ఇటలీ)పై గెలిచాడు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన రూడ్ సెమీఫైనల్లో ఖచనోవ్‌తో ఆడతాడు.

పాక్‌ను ఫైనల్ చేర్చిన నసీమ్ షా

- రెండు బంతుల్లో రెండు సిక్సర్లు కొట్టిన నసీమ్
- అఫ్గాన్‌పై వికెట్ తేడాతో నెగ్గిన పాక్
- ఆదివారం శ్రీలంకతో టైటిల్ పోరు


నసీమ్

షార్జా: భారత్ అభిమానుల్లో ఆశలు రేపేలా ఉత్కంఠ రేకెత్తించిన మ్యాచ్‌లో చివరకు పాకిస్తానే వికెట్ తేడాతో అఫ్గానిస్తాన్‌పై గెలిచింది. దీంతో ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా పాక్, శ్రీలంక జట్లు ఆదివారం జరిగే ఫైనల్ పోరుకు సిద్ధమయ్యాయి. ఈ రెండు జట్లు రెండేసి విజయాలు సాధించగా, ఆడిన రెండూ ఓడిన భారత్, అఫ్గానిస్తాన్ ఆసియా కప్ టి20 టోర్నీ నుంచి నిష్క్రమించాయి. 'సూపర్–4'లో బుధవారం అఫ్గానిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 130 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ 19.2 ఓవర్లలో 9 వికెట్లకు 131 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షాదాబ్ (26 బంతుల్లో 36; 1 ఫోర్, 3 సిక్స్‌లు), ఇఫ్తికార్ (33 బంతుల్లో 30; 2 ఫోర్లు) రాణించారు. జట్టు స్కోరు 97 పరుగుల స్కోరు వద్ద షాదాబ్ అవుట్ కాగా... స్వల్పవ్యవధిలో పాక్ 6 వికెట్లు కోల్పోయి పరాజయానికి దగ్గరైంది. పాక్ నెగ్గేందుకు ఆఖరి ఓవర్లో 6 బంతుల్లో 11 పరుగులు చేయాల్సి ఉండగా... ఫారూఖి వేసిన తొలి రెండు బంతులపై సిక్సర్లు కొట్టిన నసీమ్ షా (4 బంతుల్లో 14 నాటౌట్; 2 సిక్స్‌లు) పాక్ జట్టును గెలిపించడంతోపాటు ఫైనల్‌కు చేర్చాడు. అంతకుముందు అఫ్గానిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసింది. ఇబ్రహీమ్ జద్రాన్ (37 బంతుల్లో 35; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఓపెనర్ హజ్రతుల్లా (17 బంతుల్లో 21; 4 ఫోర్లు), ఆఖర్లో రషీద్ ఖాన్ (15 బంతుల్లో 18 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు. పాక్ బౌలర్లు రవూఫ్ 2, నసీమ్ షా, హస్నైన్, నవాజ్, షాదాబ్ తలా ఒక వికెట్ తీశారు.

ఇక గెలిచి రావడమే!

- నేడు అఫ్గానిస్తాన్‌తో భారత్ నామమాత్రపు మ్యాచ్
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం



దుబాయ్: ఆసియా కప్ టి20 టోర్నమెంట్‌లో భారత్ ఆఖరి పోరుకు ముందే నిష్క్రమణకు సిద్ధమైంది. సూపర్–4లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన భారత్, అఫ్గానిస్తాన్‌ల మధ్య నేడు నామమాత్రమైన మ్యాచ్ జరుగుతుంది. రెండేసి విజయాలతో శ్రీలంక, పాకిస్తాన్ జట్లు ఫైనల్ చేరడంతో గురువారం జరిగే మ్యాచ్ ఆడి రావడం తప్ప టీమిండియా, అఫ్గానిస్తాన్‌లకు యూఏఈలో ఇక ఏం మిగల్లేదు.

ఒత్తిడిలో భారత్

ఫేవరెట్‌గా బరిలోకి దిగి ఫైనల్‌కు వెళ్లలేని స్థితిలో ఉన్న భారత్ ఒత్తిడిలో కూరుకుపోయింది. గ్రూప్ దశలో బాగున్న పరిస్థితి 'సూపర్–4'కు వచ్చేసరికి మారిపోయింది. ఓపెనింగ్‌లో రాహుల్, మిడిలార్డర్‌లో హార్దిక్ పాండ్యా, రిషభ్ పంత్‌ల ప్రదర్శన భారత మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. వచ్చే నెలలో ఆస్ట్రేలియాలోని బౌన్సీ పిచ్‌లపై టి20 ప్రపంచకప్ ఆడాల్సిన జట్టు ఇది కాదేమోనన్న సందేహాన్ని రేకెత్తిస్తోంది. హిట్టర్లుగా ముద్రపడిన రాహుల్, పాండ్యా, పంత్‌లు పాక్, శ్రీలంకలతో జరిగిన పోటీల్లో ఆడినట్లుగా లేదు. అదేదో సిరీస్‌కు ముందు ప్రాక్టీస్ మ్యాచ్‌లా తేలిగ్గా తీసుకున్నారు. ఇక బౌలింగ్ విభాగం కూడా తీసికట్టుగానే ఉంది. అనుభవజ్ఞుడైన సీమర్ భువనేశ్వర్, స్పిన్నర్లు చహల్, అశ్విన్ ఇలా ఎవరూ మ్యాచ్‌ను మలుపు తిప్పే వికెట్లే తీయలేదు. ఇది హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ రోహిత్ శర్మ జట్టు కూర్పుపై చేస్తున్న కసరత్తును ప్రశ్నార్థకం చేస్తోంది.


సినిమా

బ్లాక్... కిర్రాక్

క్యారెక్టర్ కోసం బరువు తగ్గడం, పెరగడం చేస్తుంటారు హీరోలు. ఇప్పుడు కొందరు హీరోలు 'నల్ల'గా మారిపోయారు. క్యారెక్టర్‌కి తగ్గట్టు బ్లాక్ మేకప్‌తో కనిపించడానికి రెడీ అయ్యారు. ఫస్ట్ లుక్ అంటూ విడుదలైన ఆ పోస్టర్లను చూసి, అభిమానులు 'బ్లాక్.. కిర్రాక్' అంటున్నారు. డిఫరెంట్ మేకప్‌తో కొందరు హీరోలు చేస్తున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.


ఎన్టీఆర్


ప్రభాస్


వాని

- ప్రభాస్ కటౌట్‌కి 'కేజీఎఫ్' ఫేమ్ దర్శకుడు ప్రశాంత్ నీల్ బ్లాక్ కలర్ పులిమారు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రూపొందుతున్న 'సలార్' సినిమా కోసమే ప్రభాస్ బ్లాక్ మేకప్ వేసుకున్నారు. రెండు భాగాలుగా విడుదల కానుందని ప్రచారం జరుగుతున్న ఈ సినిమాలో ఇప్పటి వరకు ప్రభాస్ రెండు డిఫరెంట్ లుక్స్‌లో కనిపించారు. రెండు పోస్టర్స్‌లో బ్లాక్ కలర్ నిండుగా ఉంది. తెలంగాణలోని సింగరేణి బొగ్గు గనుల్లో 'సలార్' సినిమా షూటింగ్ జరిగింది. సో.. ప్రభాస్ బ్లాక్ లుక్స్‌కు కథే కారణమని ఊహించవచ్చు. వచ్చే ఏడాది సెప్టెంబరు 28న ఈ చిత్రం రిలీజ్ కానుంది.
- ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈ సినిమా షూటింగ్ ఆరంభం కానుంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా పోస్టర్‌లో నల్లని మేకప్‌లో ఎన్టీఆర్ ఫెరోషియస్‌గా కనిపించారు. ఇక హీరోగా ఎన్టీఆర్ నెక్ట్స్ చిత్రం కొరటాల శివ డైరెక్షన్‌లో ఉంటుంది. ఆ తర్వాతే ప్రశాంత్ నీల్‌తో చేసే సినిమా ఆరంభమవుతుంది.
- హీరో నాని నటిస్తున్న తాజా సినిమా 'దసరా'. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌లో నాని ఫుల్ బ్లాక్ లుక్‌లో కనిపించారు. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా, సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలోని ఓ గ్రామం బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా కథ ఉంటుంది. సో.. 'దసరా' ఫస్ట్ లుక్ అలా ఉండటంలో పెద్ద ఆశ్చర్యం లేదు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 30న విడుదల కానుంది.
- కామెడీ హీరోగా, వీలైనప్పుడు ఎమోషనల్ క్యారెక్టర్ ఆర్టిస్టుగా ప్రేక్షకుల్లో మంచి పేరు సంపాదించుకున్నారు 'అల్లరి' నరేశ్. కాగా 2021లో 'అల్లరి' నరేశ్ హీరోగా వచ్చిన 'నాంది' సినిమాను ప్రేక్షకులు బాగా ఆదరించారు. ఈ సినిమాకు విజయ్ కనకమేడల దర్శకుడు. ఇప్పుడు 'అల్లరి' నరేశ్, విజయ్ కనకమేడల మరో ప్రాజెక్ట్‌కి రెడీ అయ్యారు. 'ఉగ్రం' సినిమా చేస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌లో ఫుల్‌గా మసి పూసుకుని ఉన్నారు నరేశ్.


'అల్లరి' నరేశ్


ఎస్ఆర్ ప్రభు, రీతూ వర్మ, శర్వానంద్, అమల, శ్రీ కార్తీక్

ప్రేక్షకులను నిరుత్సాహ పరచను

- శర్వానంద్

"మీకు(ప్రేక్షకులకు) 'ఒకే ఒక జీవితం' లాంటి మంచి సినిమా చూపిస్తున్నా. మిమ్మల్ని నిరుత్సాహ పరచనని మాట ఇస్తున్నా. ఎందుకంటే మేమంతా బాగా నమ్మి చేశాం. గర్వంగా, నమ్మకంగా చెబుతున్నా.. మీరు నిరుత్సాహ పడరు'' అని హీరో శర్వానంద్ అన్నారు. శ్రీ కార్తీక్ దర్శకత్వంలో శర్వానంద్, రీతూ వర్మ జంటగా అమల అక్కినేని కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఒకే ఒక జీవితం'. డ్రీమ్ వారియర్ పిక్చర్స్‌పై ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో (తమిళంలో 'కణం'పేరుతో) రేపు(శుక్రవారం) విడుదల అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో **శర్వానంద్ మాట్లాడుతూ–**'' నాకు అమ్మని మించిన బలం లేదు.. ఏదైనా అమ్మ తర్వాతే. 'ఒకే ఒక జీవితం' నాది, నేనే హీరో అనుకునే పనిచేశారు యూనిట్ అంతా.. దానికి కారణం కథ. ఈ సినిమాలో భాగం అయిన రీతూకి థ్యాంక్స్. అమల మేడం లేకుండా ఈ సినిమాని ఊహించలేను. ఆమెతో స్క్రీన్ పంచుకోవడం గౌరవంగా ఉంది. ఇలాంటి నిజాయతీ కథతో నాతో సినిమా చేసిన శ్రీ కార్తీక్‌కి థ్యాంక్స్. ఈ సినిమా అనుకుని ఐదేళ్లు అయింది.. ఇన్నేళ్లు మమ్మల్ని, మూవీని నమ్మిన ఎస్ఆర్ ప్రభుగారికి కృతజ్ఞతలు'' అన్నారు.

అమల అక్కినేని మాట్లాడుతూ–''నాకు ఈ మూవీలో చాలా మంచి అవకాశం ఇచ్చారు శ్రీ కార్తీక్. ఈ సినిమా చేయడానికి తెలుగు, కేరళ, తమిళనాడు, బెంగాల్ రాష్ట్రాల నుంచి వచ్చారు. నార్త్‌లోని బెంగాల్‌లో పుట్టిన నన్ను తెలుగు ఫ్యామిలీలో కోడలిగా స్వీకరించడం వల్లే ఇలాంటి మంచి అవకాశం వచ్చింది. 'ఒకే ఒక జీవితం' స్వీట్, బ్యూటిఫుల్ ఫిల్మ్.. ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది. తప్పకుండా మీ కుటుంబంతో కలిసి వెళ్లి సినిమా చూడండి'' అన్నారు.

ఎస్ఆర్ ప్రభు మాట్లాడుతూ–''శ్రీ కార్తీక్ అద్భుతమైన కథ ఇచ్చాడు. ఈ మూవీలో మనసును హత్తుకునే సన్నివేశాలు ఉన్నాయి. ప్రేక్షకులు బాగా కనెక్ట్ అవుతారు'' అన్నారు.

శ్రీ కార్తీక్ మాట్లాడుతూ–''ఒకే ఒక జీవితం' కథ చాలామంది నిర్మాతలకు నచ్చింది. కానీ, నేను దర్శకత్వం వహిస్తానంటే ఒప్పుకోలేదు. ఈ కథ వినగానే ప్రభుసర్‌కి కన్నీళ్లొచ్చాయి. నాకు సపోర్ట్‌గా నిలిచిన ఆయనకి థ్యాంక్స్. శర్వానంద్‌గారికి కథ చెప్పినప్పుడు తనలో నన్ను నేను చూసుకున్న వైబ్రేషన్ కలిగింది. అమల మేడంతో పనిచేస్తున్నప్పుడు మా అమ్మగారు నన్ను ఆశీర్వదించినట్లు అనిపించేది. నా తొలి సినిమాలో 'సిరివెన్నెల' సీతారామశాస్త్రిగారితో పాట రాయించడం నా అదృష్టం'' అన్నారు. కాగా అమ్మ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా ప్రీ రిలీజ్‌కి చిత్ర నటీనటులు తమ తల్లితో కలిసి రావడం విశేషం. కెమెరామేన్ సుజిత్ సారంగ్, సంగీత దర్శకుడు జేక్స్ బిజోయ్, ఎడిటర్ శ్రీజిత్ సారంగ్ పాల్గొన్నారు.

'ఎస్ఆర్ కల్యాణమండపం' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో కిరణ్ అబ్బవరం, దర్శకుడు శ్రీధర్ గాదె కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'నేను మీకు బాగా కావాల్సినవాడిని'. సంజనా ఆనంద్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సోనూ ఠాగూర్, సిద్ధార్థ్ మీనన్, ఎస్వీ కృష్ణారెడ్డి, బాబా భాస్కర్ కీలక పాత్రలు పోషించారు. దర్శకులు కోడి రామకృష్ణ పెద్ద కుమార్తె కోడి దివ్య దీప్తి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ చిత్రంలో కీ రోల్ చేసిన కొరియోగ్రాఫర్ బాబా భాస్కర్ మాట్లాడుతూ – ''ఈ చిత్రంలో కిరణ్ అబ్బవరంకు ఫ్రెండ్ పాత్ర చేశాను. ఇండస్ట్రీలో ఎంతోమందికి లైఫ్ ఇచ్చిన కోడి రామకృష్ణగారి

నాకు సినిమాయే జీవితం

- బాబా భాస్కర్



బ్యానర్‌లో రూపొందిన సినిమాలో యాక్ట్ చేయడం నాకు చాలా సంతోషంగా ఉంది. నటిస్తూనే ఈ చిత్రంలో 'లాయర్ పాప' అనే పాటకు కొరియోగ్రఫీ చేశాను. కొరియోగ్రాఫర్, యాక్టర్, డ్యాన్సర్.. ఇలా ఏదైనా చేస్తాను. ఎందుకంటే సినిమాయే నాకు జీవితం. నా దర్శకత్వంలో మరో సినిమా చేసేందుకు కథలు రెడీ చేస్తున్నాను. తెలుగులో నీలకంఠంగారి సినిమాలో యాక్ట్ చేస్తున్నాను. ఓ తమిళ సినిమాకు కొరియోగ్రఫీ చేస్తున్నాను'' అని అన్నారు.


బెల్లంకొండ గణేష్

మోగింది మేళం

బెల్లంకొండ గణేష్, వర్ష బొల్లమ్మ జంటగా నటిస్తున్న చిత్రం 'స్వాతి ముత్యం'. లక్ష్మణ్ కె. కృష్ణ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 5న విడుదల కానుంది. మహతి స్వరసాగర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'డుం డుం డుం మోగింది మేళం..' అనే పాటని విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ పాటకి కేకే సాహిత్యం అందించారు. లక్ష్మణ్ మాట్లాడుతూ– ''హీరో, హీరోయిన్‌ల నిశ్చితార్థం నుంచి పెళ్లి వరకూ జరిగే వ్యవహారాలు, సందర్భాలు, సన్నివేశాల సమాహారం ఈ పాట'' అన్నారు. ''దసరా సందర్భంగా మా సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం'' అన్నారు సూర్యదేవర నాగవంశీ. ఈ చిత్రానికి సమర్పణ: పీడీవీ ప్రసాద్.

థ్రిల్ అవుతారు

- నివాస్ శిష్టు



''డిఫరెంట్ కోణాలను టచ్ చేస్తూ సస్పెన్స్ మిస్టరీగా 'రహస్య' చిత్రాన్ని బాగా తీశాడు శివ. ప్రేక్షకులు థ్రిల్ అవుతారు'' అని నివాస్ శిష్టు అన్నారు. శివ శ్రీ మీగడ దర్శకత్వంలో నివాస్ శిష్టు, సారా ఆచార్ జంటగా నటించిన చిత్రం 'రహస్య'. ఎస్. గౌతమి నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదలవుతోంది. హీరో నివాస్ శిష్టు మాట్లాడుతూ– ''నాకు నటనంటే ఆసక్తి ఉన్నా ఇండస్ట్రీకి వచ్చేందుకు సరైన దారి దొరకలేదు. నా ఫ్రెండ్ సహాయంతో కెనడాలో సెటిలయ్యాను. కరోనా టైమ్‌లో 'రహస్య' కథ నా వద్దకు వచ్చింది. ఇందులో ఎన్ఐఏ అధికారి విశ్వతేజ పాత్ర చేశాను. ఇద్దరు ఐపీఎస్ ఆఫీసర్స్ మధ్య ఎలాంటి అహం ఉంటుంది? ఒక కేసును ఛేదించే క్రమంలో వారి మధ్య ఎలాంటి క్లోజ్‌నెస్ పెరుగుతుంది? అనే కథాంశంతో ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు.

హైదరాబాద్ టు గోవా


ధన్సిక

సాయి ధన్సిక ప్రధాన పాత్రలో ఓషో తులసీరామ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'దక్షిణ'. అశోక్ షిండే నిర్మిస్తున్న ఈ సినిమా బుధవారం హైదరాబాద్‌లో ఆరంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన వంశీ కృష్ణ తొలి సన్నివేశానికి కెమెరా స్విచ్చాన్ చేయగా, ప్రణతి, శ్వేతా భావన క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా అశోక్ షిండే మాట్లాడుతూ – ''రెగ్యులర్ షూటింగ్ బుధవారమే ఆరంభించాం. ఈ నెల 24వరకు హైదరాబాద్‌లో ఫస్ట్ షెడ్యూల్, అక్టోబరు 6 నుంచి 20 వరకు గోవాలో రెండో షెడ్యూల్‌ని ప్లాన్ చేశాం. మూడో షెడ్యూల్ నవంబరు 1 నుంచి 10 వరకు హైదరాబాద్‌లో జరుగుతుంది. దీంతో షూటింగ్ పూర్తవుతుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: బాలాజీ.

సినిమా టికెట్ ధరలు తగ్గించాలి

- నట్టి కుమార్



''థియేటర్లకు ప్రేక్షకులు రావడం లేదనడం కరెక్ట్ కాదు. సినిమా టికెట్ ధరలు తగ్గించడంతో పాటు మంచి కంటెంట్ ఉంటే కచ్చితంగా వస్తారు. ఇటీవల విడుదలైన కొత్త చిత్రాలతో పాటు అగ్రహీరోల బ్లాక్ బస్టర్ సినిమాలు (పోకిరి, జల్సా) రీ రిలీజ్ అయినా ఆదరించారు'' అని నిర్మాత నట్టి కుమార్ అన్నారు. ధనుష్, శ్రుతీ హాసన్ జంటగా ఐశ్వర్య దర్శకత్వం వహించిన చిత్రం 'త్రీ'. 2012 మార్చి 30న ఈ సినిమాని తెలుగులో విడుదల చేశారు నట్టి కుమార్. కాగా ఈ సినిమాని నేడు రీ రిలీజ్ చేస్తున్నారాయన. అదే విధంగా నేడు నట్టి కుమార్ 50వ పుట్టినరోజు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ– ''త్రీ' చిత్రాన్ని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మళ్లీ విడుదల చేస్తున్నాం. ఆన్‌లైన్ బుకింగ్స్ కూడా ఫుల్ అయ్యాయి. ఇక ఇటీవల కొందరు నిర్మాతలు ఏకాభిప్రాయంతో బంద్‌కు పిలుపునివ్వడం వల్ల చిన్న నిర్మాతలు, కార్మికులు, పెద్ద నిర్మాతలు సైతం నష్టపోయారు. ఈ బంద్ ఎందుకు చేశారో అర్థం కాలేదు. త్వరలో మీడియా రంగంలోనికి అడుగు పెట్టనున్నాను. నట్టీస్ ప్యూర్ విలేజ్ ప్రొడక్టుల పేరిట హోల్‌సేల్, రీటైల్ వ్యాపారం ప్రారంభిస్తున్నాను. సినిమా కార్మికులకు అండగా నిలబడేందుకు తెలుగు ఫిలిం ఛాంబర్ ఎన్నికల్లో పోటీ చేస్తాను'' అన్నారు.

సాక్షి
గురువారం
8-9-2022

బిజినెస్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▼	నిఫ్టీ ▼
168	31
59,029	17,624

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	11,725	▽	181
డోజోన్స్	31,532	△	387
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,238	▽	62
డాక్స్	12,916	△	45
షాంఘై	3,246	△	3
నికాయ్	27,430	△	196

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

అమ్మకానికి సువెన్ ఫార్మా!



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కంపెనీ అమ్మకం లేదా మెజారిటీ వాటా విక్రయానికి సువెన్ ఫార్మాస్యూటికల్స్ కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. మెజారిటీ వాటా అమ్మకం విషయమై సలహా కోసం ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌ను నియమించుకున్నట్టు తెలుస్తోంది. కంపెనీని విక్రయించేందుకు ప్రైవేట్ ఈక్విటీ, వ్యూహాత్మక సంస్థలతో చర్చలు జరుగుతున్నాయి. సువెన్ ఫార్మాస్యూటికల్స్‌లో ప్రమోటర్లకు 60 శాతం వాటా ఉంది. డీల్ ద్వారా వచ్చే మొత్తాన్ని సువెన్ లైఫ్ సైన్సెస్‌లో ఔషధాల అభివృద్ధికి ఖర్చు చేయనున్నారు. ఇప్పటి వరకు సువెన్ ఫార్మా నుంచి డివిడెండ్ రూపంలో సమకూరిన మొత్తాన్ని ప్రమోటర్లు ఇందు కోసం వ్యయం చేశారు. సువెన్ లైఫ్ నుంచి 2020లో సువెన్ ఫార్మా విడిపోయింది. క్రితం ముగింపుతో పోలిస్తే సువెన్ ఫార్మాస్యూటికల్స్ షేరు ధర బీఎస్‌ఈలో బుధవారం 1.52 శాతం ఎగసి రూ.491.10 వద్ద స్థిరపడింది.

అదానీ 3 గిగా ఫ్యాక్టరీల నిర్మాణం

70 బిలియన్ డాలర్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: సోలార్ మాడ్యూల్స్, విండ్ టర్బైన్స్, హైడ్రోజన్ ఎలక్ట్రోలైజర్స్ తయారీకి వీలుగా మూడు గిగా ఫ్యాక్టరీలను నెలకొల్పనున్నట్లు ప్రపంచ కుబేరుల్లో ఒకరైన గౌతమ్ అదానీ తాజాగా పేర్కొన్నారు. 2030కల్లా శుద్ధ ఇంధనాలపై 70 బిలియన్ డాలర్ల పెట్టుబడులను వెచ్చించే ప్రణాళికల్లో భాగంగా వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. గ్రీన్ ఎనర్జీ వేల్యూ చైన్‌లో భాగంగా అదానీ గ్రూప్ పెట్టుబడులను హెచ్చిస్తోంది. తద్వారా 2030కల్లా ప్రపంచంలోనే నంబర్‌వన్ పునరుత్పాదక ఇంధన కంపెనీగా ఆవిర్భవించాలని లక్ష్యంగా పెట్టుకుంది. వాతావరణ మార్పులు, గ్రీన్ ఎనర్జీపై తమ గ్రూప్ 70 బిలియన్ డాలర్లను వెచ్చించేందుకు కట్టుబడి ఉన్నట్లు గౌతమ్ అదానీ మరోసారి స్పష్టం చేశారు. ఇందుకు అనుగుణంగా దేశంలో మూడు గిగా ఫ్యాక్టరీల నిర్మాణానికి తెరతీయనున్నట్లు తెలియజేశారు. వెరసి ప్రపంచంలోనే అత్యుత్తమ సమీకృత గ్రీన్ ఎనర్జీ వేల్యూ చైన్ గ్రూప్‌గా నిలిచేందుకు వీలుంటుందని వివరించారు. యూఎస్ఐబీసీ గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు స్వీకరించిన సందర్భంగా గౌతమ్ అదానీ ఈ విషయాలు వెల్లడించారు.

అక్టోబర్ 10 నుంచి బడ్జెట్ కసరత్తు షురూ!

న్యూఢిల్లీ: భారత్ ఎకానమీ రికవరీ, అంతర్జాతీయంగా ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంలో ఆర్థిక మంత్రిత్వశాఖ అక్టోబర్ 10 వ తేదీ నుంచి 2023–24 బడ్జెట్ రూపకల్పన కసరత్తును ప్రారంభించనుంది. అధిక ద్రవ్యోల్బణం, డిమాండ్ పెంపు, ఉపాధి కల్పన, 8 శాతం వృద్ధి బాటన ఎకానమీని నిలపడం వంటి కీలక సవాళ్లు ప్రస్తుతం కేంద్రం ముందు ఉన్నాయి.



రియల్టీ స్టార్టప్స్‌కు రూ.800 కోట్ల ఫండ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రియల్టీ రంగంలో మరో మైలురాయి. ఈ పరిశ్రమలో వినూత్న పరిష్కారాలు, సేవలను పరిచయం చేసేందుకు సిద్ధమైన స్టార్టప్స్‌లో పెట్టుబడులు చేసేందుకు కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్), ఇంక్యుబేటర్, స్టార్టప్స్ యాక్సిలరేటర్ అయిన వెంచర్ క్యాటలిస్ట్స్ ముందుకు వచ్చాయి. ఇరు సంస్థలు రూ.800 కోట్ల ప్రాపర్టీ టెక్నాలజీ ఫండ్‌ను ఏర్పాటు చేశాయి. సాంకేతికత, డేటా అనలిటిక్స్, బ్లాక్‌చైన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆగ్‌మెంటెడ్ రియాలిటీ ఆధారంగా పరిశ్రమను మార్చగల సామర్థ్యం ఉన్న ప్రారంభ, వృద్ధి దశలో ఉన్న స్టార్టప్స్‌కు ఈ ఫండ్ ద్వారా నిధులను సమకూరుస్తాయి. గృహ, వాణిజ్య, సంస్థాగత, పారిశ్రామిక విభాగాలకు సేవలు అందించే స్టార్టప్స్‌లో పెట్టుబడి చేస్తాయి. ప్రస్తుతం భారత రియల్టీ రంగం 300 బిలియన్ డాలర్లుగా ఉంది. పరిశ్రమ 2030 నాటికి 1 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడానికి ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతి దోహదం చేస్తుందని క్రెడాయ్ తెలిపింది. క్రెడాయ్‌లో డెవలపర్స్, వెండార్స్, చానెల్ పార్ట్‌నర్స్, ప్రమోటర్స్ వంటి 256 విభాగాల నుంచి 13,000 పైచిలుకు సభ్యులు ఉన్నారు. ఓయో, బేసిక్, షేర్‌నెస్ట్, హోమ్ క్యాపిటల్ వంటి రియల్టీ రంగ స్టార్టప్స్‌లో వెంచర్ క్యాటలిస్ట్స్ పెట్టుబడి చేసింది.



వేర్‌హౌసింగ్‌లోకి విదేశీ దిగ్గజాలు

- 3 కంపెనీల భారీ ప్రణాళికలు
- హరియాణాలో ఎఫ్ఎం లాజిస్టిక్ గిడ్డంగి
- రీనస్ గ్రూప్ రెండు కొత్త వేర్‌హౌస్‌లు
- 200 మిలియన్ డాలర్లతో పానటోనీ ఎంట్రీ



న్యూఢిల్లీ: దేశీయంగా ఈ–కామర్స్ గణనీయంగా పెరుగుతుండటంతో డిమాండ్‌కి అనుగుణంగా ఎఫ్ఎంసీజీ, దుస్తులు, ఫార్మా, ఆహారోత్పత్తులు మొదలైన వాటిని నిల్వ చేసేందుకు గిడ్డంగుల అవసరాలు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే వేర్‌హౌసింగ్ విభాగంలో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు పలు విదేశీ కంపెనీలు రంగంలోకి దిగుతున్నాయి. గత అయిదారు నెలల్లో ఇలాంటి మూడు సంస్థలు భారత్‌లో భారీ విస్తరణ ప్రణాళికలు ప్రకటించాయి. ఫ్రాన్స్‌కి చెందిన థర్డ్ పార్టీ లాజిస్టిక్స్ (3పీఎల్) సంస్థ ఎఫ్ఎం లాజిస్టిక్, జర్మనీ సంస్థ రీనస్ గ్రూప్, అమెరికాకు చెందిన పానటోనీ ఈ జాబితాలో ఉన్నాయి. 1.4 బిలియన్ యూరోల ఎఫ్ఎం లాజిస్టిక్ భారత్‌లో తమ తొలి మల్టీ–క్లయింట్ ఫెసిలిటీ (ఎంసీఎఫ్)ను హరియాణాలోని ఫరూఖ్‌నగర్‌లో ప్రారంభించింది. 31 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ కేంద్రంలో దేశవిదేశాల్లోని కస్టమర్లకు అవసరమయ్యే వేర్‌హౌసింగ్, హ్యాండ్లింగ్, పంపిణీ, ఈ–కామర్స్ తదితర సర్వీసులు అందిస్తోంది. ప్రస్తుతం 70 లక్షల చ.అ. స్థలం ఉండగా, 3పీఎల్ తరహా సేవలకు డిమాండ్ పెరుగుతున్నందున.. దీన్ని 2026 నాటికి 1.2 కోట్ల చ.అ.కు పెంచుకోనున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. తాము సరైన సమయంలో భారత మార్కెట్లో ప్రవేశించామని భావిస్తున్నట్లు వివరించాయి. మరోవైపు, రీనస్ గ్రూప్ పారిశ్రామిక రంగ సంస్థల అవసరాలకు ఉపయోగపడేలా గురుగ్రామ్, ముంబైలో రెండు కెమికల్ వేర్‌హౌస్‌లను ప్రారంభించింది. దేశీయంగా పారిశ్రామిక రంగం వృద్ధి చెందే కొద్దీ వచ్చే మూడేళ్లలో 24 లక్షల చ.అ. స్థలాన్ని 50 లక్షల చ.అ.లకు పెంచుకోనున్నట్లు రీనస్ లాజిస్టిక్స్ ఇండియా ఎండీ వివేక్ ఆర్యా తెలిపారు. కొత్తగా అమెరికాకు చెందిన పానటోనీ కూడా భారత మార్కెట్లోకి అడుగుపెట్టింది. 200 మిలియన్ డాలర్ల పెట్టుబడితో ప్రధాన నగరాల్లో నాలుగు పారిశ్రామిక, లాజిస్టిక్స్ పార్క్‌లను అభివృద్ధి చేయనుంది.

కోవిడ్‌తో ఊతం..

కోవిడ్ పరిణామాలతో వినియోగదారులు కాంటాక్ట్ రహిత లావాదేవీలు, క్విక్ డోర్ స్టెప్ డెలివరీల వైపు మొగ్గు చూపుతుండటం దేశీయంగా ఈ–కామర్స్‌కి దన్నుగా ఉంటోందని పానటోనీ ఎండీ (ఇండియా) సందీప్ చందా తెలిపారు. ఈ నేపథ్యంలో భారత్‌లో వేర్‌హౌసింగ్ విభాగం గణనీయంగా వృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. బహుళ జాతి కంపెనీలు చైనా+1 వ్యూహాన్ని పాటిస్తుండటంతో ప్రత్యామ్నాయ తయారీ హబ్‌గా ఎదిగేందుకు భారత్ చేస్తున్న కృషి కారణంగా దేశీయంగా వేర్‌హౌసింగ్ విభాగం మరింతగా వృద్ధి చెందనుంది. దీంతో చాలామటుకు రిటైలర్లు, ఈ–కామర్స్ సంస్థలు వేర్‌హౌసింగ్ స్పేస్‌ను పెంచుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి. ఇక, సానుకూల మార్కెట్ పరిస్థితులు, మేకిన్ ఇండియా నినాదంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టడం, జీఎస్‌టీ అమలు మొదలైన అంశాలు భారత్‌లో పెట్టుబడులు పెట్టేలా ఇన్వెస్టర్లలో ఆసక్తి కలిగిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. రీసెర్చ్ అండ్ మార్కెట్స్ అనే కన్సల్టెన్సీ అంచనాల ప్రకారం దేశీ వేర్‌హౌసింగ్ మార్కెట్ 2020 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,05,000 కోట్లుగా ఉంది. 26.5 కోట్ల చ.అ. స్పేస్ అందుబాటులో ఉంది. 2026 నాటికి ఈ విభాగం ఆదాయం దాదాపు 11% వార్షిక వృద్ధితో రూ. 2,24,379 కోట్లకు చేరనుంది. స్పేస్ అవసరాలు సుమారు 13% వార్షిక వృద్ధితో 48.3 కోట్ల చ.అ. స్థాయికి చేరనుంది.

వడ్డీరేట్ల పెంపు భయాలు

- బ్యాంకింగ్, ఆటో షేర్లలో అమ్మకాలు
- సూచీలకు రెండోరోజూ నష్టాలే
- సెన్సెక్స్ నష్టం 168 పాయింట్లు
- 17,650 దిగువకు నిఫ్టీ



ముంబై: అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచవచ్చనే భయాలతో బుధవారం స్టాక్ మార్కెట్ నష్టపోయింది. ముఖ్యంగా వడ్డీ రేట్ల ఆధారిత రంగాలైన బ్యాంకింగ్, ఆటో, ఆర్థిక, రియల్టీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో సెన్సెక్స్ 168 పాయింట్లు పతనమై 59,029 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 31 పాయింట్లను కోల్పోయి 17,624 వద్ద నిలిచింది. సూచీలకిది వరుసగా రెండోరోజూ నష్టాల ముగింపు. లోహ, మౌలిక పారిశ్రామిక రంగాలతో పాటు ఎఫ్ఎంసీజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బెంచ్‌మార్క్ సూచీలు నష్టాల్లో ట్రేడైనా.., విస్తృతస్థాయి మార్కెట్లో చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్ నెలకొంది. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.73%, 0.46 శాతం ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.758 కోట్ల షేర్లను కొన్నారు. దేశీయ ఇన్వెస్టర్లు రూ.139 కోట్ల షేర్లను అమ్మేశారు. వడ్డీరేట్ల పెంపు, ఆర్థిక మాంద్య భయాలతో అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

ఆరంభ నష్టాలు రికవరీ

ఉదయం సెన్సెక్స్ 408 పాయింట్ల నష్టంతో 58,789 వద్ద, నిఫ్టీ 137 పాయింట్లు పతనమై 17,519 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ప్రతికూల అంతర్జాతీయ సంకేతాలతో సెన్సెక్స్ 474 పాయింట్లు క్షీణించి 58,723 వద్ద, నిఫ్టీ 172 పాయింట్లను కోల్పోయి 17,656 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేసింది. అయితే మిడ్ సెషన్ నుంచి చిన్న, మధ్య తరహా షేర్లు రాణించడంతో సూచీలు ఆరంభంలో కోల్పోయిన నష్టాలను కొంత మేర రికవరీని చేసుకోగలిగాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- సిమెంట్ ధరలు పెరగడం, పెట్‌కోక్ ధరలు దిగి రావడంతో అంబుజా సిమెంట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, శ్రీ సిమెంట్ షేర్లు 3–7% లాభపడ్డాయి.
- క్యాన్సర్ ఔషధ తయారీ, విక్రయానికి యూఎస్ఎఫ్‌డీఏ నుంచి అనుమతులు రావడంతో సిప్లా 1% లాభపడి రూ.1,051 వద్ద నిలిచింది.

తమిళ్ మెర్కంటైల్ ఐపీవో సక్సెస్

చివరి రోజుకల్లా 3 రెట్లు అధిక స్పందన

తమిళనాడు మెర్కంటైల్ బ్యాంకు పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. ఇష్యూ చివరి రోజు బుధవారానికల్లా దాదాపు 3 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. షేరుకి రూ. 500–525 ధరలో చేపట్టిన ఇష్యూ ద్వారా బ్యాంకు దాదాపు రూ. 832 కోట్లు సమీకరించాలని భావించింది. 87,12,000 షేర్లను ఆఫర్ చేయగా.. 2,49,39,292 షేర్ల కోసం దరఖాస్తులు లభించాయి. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగంలో అత్యధికంగా 6.5 రెట్లు స్పందన నమోదైంది.

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	50,553	▼	208
బంగారం (99.5 స్వచ్ఛత)	50,351	▼	207
వెండి (కిలో)	53,396	▼	300

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-9-2022	
విశాఖ	475–00
చిత్తూరు	493–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	440–00
విజయవాడ	440–00
రిటైల్ ధర (డజను)	66.00
7-9-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	390–00
వరంగల్	392–00
రిటైల్ ధర	4.50

భవిత

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఐఐటీల్లో.. మెడిటెక్ కోర్సులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ.. సంక్షిప్తంగా.. ఐఐటీలు! ఇంజనీరింగ్ విద్యలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌లు! అలాంటి ఐఐటీలు.. ఇప్పుడు సాంకేతిక విద్యకే పరిమితం కాకుండా..మరెన్నో విభాగాల్లోనూ కోర్సులను అందిస్తున్నాయి. ఇప్పటికే ఆర్ట్స్, హ్యుమానిటీస్‌లో కోర్సులను బోధిస్తున్న ఐఐటీలు.. తాజాగా మెడికల్, మెడి టెక్ అనుబంధ విభాగాల్లోనూ అడుగుపెట్టాయి. ఈ నేపథ్యంలో.. మెడికల్, అనుబంధ కోర్సులను అందిస్తున్న ఐఐటీలు, అందుబాటులో ఉన్న ప్రోగ్రామ్‌లు, ప్రయోజనాలపై ప్రత్యేక కథనం..

- పలు ఐఐటీల్లో మెడికల్, మెడి టెక్, అనుబంధ కోర్సులు
- యూజీ, పీజీ, పీహెచ్‌డీ స్థాయిలో బోధన
- టెక్నికల్ ఎడ్యుకేషన్ నుంచి ఇతర విభాగాలకు విస్తరణ
- మల్టీ డిసిప్లినరీ, సోషల్ డెవలప్‌మెంట్ దృక్పథమే కారణం

ఐఐటీలు తాజాగా వైద్య విద్య విభాగంవైపు దృష్టి పెడుతున్నాయి. మెడికల్, మెడికల్ టెక్నాలజీ, బయో మెడికల్ తదితర వైద్య అనుబంధ విభాగాల్లోనూ పీజీ, పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులను ప్రవేశ పెడుతున్నాయి. వీటి ద్వారా విద్యార్థులకు వైద్య విద్యకు సంబంధించి కోర్ అంశాలతో పాటు, టెక్నాలజీ వినియోగంపైనా అవగాహన కల్పిస్తున్నాయి.

ఆవిష్కరణల దిశగా

ఐఐటీలు.. మెడికల్, మెడి టెక్ కోర్సులు ప్రవేశ పెట్టడానికి కారణం.. వైద్య రంగంలో ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని భావించడమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉదాహరణకు.. కోవిడ్ మహమ్మారి సమయంలో.. ఐఐటీ ముంబై, చెన్నై, ఢిల్లీ, కాన్పూర్, హైదరాబాద్ తదితర ఐఐటీలు.. ఆర్‌టీపీసీఆర్ కిట్స్‌ను, పల్స్‌ఆక్సీ మీటర్స్, తేలిక పాటి వెంటిలేటర్స్‌ను ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. కోవిడ్ వైరస్ వ్యాప్తి, దశలపై ముందస్తు అంచనాలు సైతం వెల్లడించాయి. ఇందుకు మెడికల్, టెక్నాలజీ రెండు విభాగాల సమన్వయం ఎంతో అవసరం. అందుకే ఐఐటీలు మెడికల్ కోర్సుల దిశగా అడుగులు వేస్తున్నాయని చెబుతున్నారు.

మల్టీ డిసిప్లినరీ అప్రోచ్

ఐఐటీలు మెడికల్ విభాగంలో కోర్సులు ప్రవేశ పెట్టడానికి మల్టీ డిసిప్లినరీ అప్రోచ్ మరో కారణంగా చెబుతున్నారు. నూతన విద్యా విధానం, యూజీసీ, ఏఐసీటీఈ మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుంటూ.. టెక్నికల్ ప్రోగ్రామ్స్‌లో సైతం కొన్ని మెడికల్ అనుబంధ కోర్సులు అభ్యసించేలా కరిక్యులంలో మార్పులు,చేర్పులు చేస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులకు సామాజిక అవసరాలకు ఉపయోగపడే ఆవిష్కరణల్లో సాంకేతికతను వినియోగించే నైపుణ్యం లభిస్తుందని భావిస్తున్నాయి.

ఐఐటీ ఖరగ్‌పూర్ ముందుగా

ఐఐటీ ఖరగ్‌పూర్ 2001లోనే స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ పేరుతో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పింది. ఈ ఇన్‌స్టిట్యూట్ తొలుత రీసెర్చ్ యాక్టివిటీస్‌కు ప్రాధాన్యమిచ్చింది. ప్రస్తుతం మెడికల్ ఫిజిక్స్, మెడికల్ మైక్రోబయాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ విభాగాల్లో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. అంతేకాకుండా ఎంబీబీఎస్ కోర్సును సైతం అందించేందుకు సిద్ధమైంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఉన్నత విద్య శాఖకు, నేషనల్ మెడికల్ కమిషన్‌కు పంపించింది. యాభై సీట్లతో ప్రారంభించనున్న ఎంబీబీఎస్ కోర్సుకు అనుమతి లభించడం ఖాయమని చెబుతున్నారు. ఈ సీట్లను నీట్ ర్యాంకు ఆధారంగా కాకుండా.. సొంత ఎంట్రన్స్ ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది.

ఐఐటీ కాన్పూర్‌తోపాటు మరెన్నో

- ఇటీవల ఐఐటీ–కాన్పూర్.. గాంగ్వాల్ స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ సెంటర్‌ను నెలకొల్పింది. ఇప్పటికే లక్నోకు చెందిన కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీతో కలిసి హెల్త్ టెక్నాలజీ ఫెలోషిప్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది.
- ఐఐటీ–గువహటి.. జ్యోతి అండ్ భూపత్ స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ పేరుతో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పింది. ఈ విభాగం ఆధ్వర్యంలో బయోమెడికల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. అదే విధంగా.. అసోం అడ్వాన్స్‌డ్ హెల్త్‌కేర్ ఇన్నోవేషన్ ఇన్‌స్టిట్యూట్‌తో ఒప్పందం ఆధారంగా.. మెడికల్ పీజీ కోర్సు అందించే ప్రయత్నంలో ఉంది.
- ఐఐటీ జోథ్‌పూర్–ఎయిమ్స్ జోథ్‌పూర్‌ల ఆధ్వర్యంలో మెడికల్ టెక్నాలజీస్‌లో పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ–పీహెచ్‌డీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. • ఐఐటీ ఢిల్లీ–ఎయిమ్స్ న్యూఢిల్లీలు సంయుక్తంగా.. న్యూక్లియర్ మ్యాగ్నటిక్ రెసోనెన్స్ అండ్ న్యూరాలజీలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నాయి.
- ఐఐటీ–హైదరాబాద్ కూడా బయో డిజైన్ స్పెషలైజేషన్‌తో ఎంటెక్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది.
- ఐఐటీ మండి.. ఎయిమ్స్ బిలాస్‌పూర్, అటల్ మెడికల్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీతో కలిసి రీసెర్చ్ యాక్టివిటీస్ కోణంలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు అందించేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

లైఫ్ సైన్సెస్ ప్రధానంగా

- ఐఐటీలు మెడికల్, మెడి టెక్ అనుబంధ కోర్సులను అందిస్తున్నప్పటికీ.. వీటి ప్రధాన ఉద్దేశం లైఫ్ సైన్సెస్ విభాగాల్లో ఇంజనీరింగ్, మెడికల్ అంశాల కలయికతో కోర్సులను అందించడంగా కనిపిస్తోంది. ప్రస్తుతం అధిక శాతం కోర్సులు బయోమెడికల్ ఇంజనీరింగ్, బయలాజికల్ ఇంజనీరింగ్ వంటి విభాగాల్లోనే ఉంటున్నాయి.



మెడికల్, మెడ్‌టెక్, లైఫ్ సైన్సెస్ ప్రోగ్రామ్‌లు

- **ఐఐటీ–ఢిల్లీ:** బయో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయో టెక్నాలజీలో బీటెక్, బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ; ఎంఎస్ రీసెర్చ్, పీహెచ్‌డీ.
- **ఐఐటీ–ముంబై:** బయో మెడికల్ ఇంజనీరింగ్‌లో ఎమ్మెస్సీ+పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ; ఎమ్మెస్సీ(బయో టెక్నాలజీ); ఎంటెక్(బయో మెడికల్ ఇంజనీరింగ్); బయో టెక్నాలజీ, బయోమెడికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ.
- **ఐఐటీ–చెన్నై:** బయలాజికల్ ఇంజనీరింగ్‌లో అయిదేళ్ల డ్యూయల్ డిగ్రీ(బీటెక్ +ఎంటెక్), బయలాజికల్ సైన్సెస్‌లో అయిదేళ్ల డ్యూయల్ డిగ్రీ(బీఎస్+ఎంఎస్), బయో ప్రాసెస్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్, బయలాజికల్ సైన్సెస్, బయలాజికల్ ఇంజనీరింగ్, కంప్యుటేషనల్ బయాలజీలో ఎంఎస్ బై రీసెర్చ్.
- **ఐఐటీ–ఖరగ్‌పూర్:** మెడికల్ ఫిజిక్స్, మెడికల్ మైక్రోబయాలజీ, న్యూక్లియర్ మెడిసిన్‌లో జాయింట్ ఎమ్మెస్సీ+పీహెచ్‌డీ; మాస్టర్స్ ఇన్ మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఎంఎంఎస్‌టీ), మాస్టర్ ఆఫ్ సైన్స్, మెడికల్, బయో ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ. **అర్హత:** ఎమ్మెస్సీ కోర్సులకు జామ్ ఉతీర్ణత, ఎంఎంఎస్‌టీ కోర్సుకు ఎంబీబీఎస్ ఉత్తీర్ణత. పీహెచ్‌డీకి గేట్ ఉత్తీర్ణత.
- **ఐఐటీ–కాన్పూర్:** బయలాజికల్ సైన్సెస్ అండ్ బయో ఇంజనీరింగ్‌లో బీటెక్, బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ, ఎంటెక్, పీహెచ్‌డీ. అర్హత: బీటెక్, బీటెక్+ఎంటెక్‌కు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణత. ఎంటెక్, పీహెచ్‌డీలకు సంబంధిత విభాగాల్లో బీటెక్‌తోపాటు గేట్ స్కోర్.
- **ఐఐటీ–రూర్కీ:** బీటెక్–బయోటెక్నాలజీ, బయోసైన్సెస్ అండ్ ఇంజనీరింగ్; ఎమ్మెస్సీ(బయోసైన్సెస్ అండ్ బయో ఇంజనీరింగ్).
- **ఐఐటీ–గాంధీనగర్:** బయలాజికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్, పీహెచ్‌డీ. ఎంటెక్ ప్రోగ్రామ్‌లో గేట్ స్కోర్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.
- **ఐఐటీ–గువహటి:** బీటెక్(బయో సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్), ఎంటెక్–బయో ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ, బయలాజికల్/లైఫ్ సైన్సెస్‌లో పీహెచ్‌డీ. బీటెక్ ప్రోగ్రామ్‌లో జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకు, ఎంటెక్ ప్రోగ్రామ్‌లకు గేట్ ర్యాంకు ఆధారంగా సీట్ల భర్తీ చేస్తారు.
- **ఐఐటీ–ఇండోర్:** ఎమ్మెస్సీ–బయో టెక్నాలజీ(ఎమ్మెస్సీ మూడో సెమిస్టర్ తర్వాత ఎమ్మెస్సీ+పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీకి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు). అర్హత: జామ్ ఉత్తీర్ణత; బయో సైన్సెస్ అండ్ బయో మెడికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ. అర్హత: గేట్ ఉత్తీర్ణత.
- **ఐఐటీ–జోథ్‌పూర్:** బీటెక్–బయో ఇంజనీరింగ్, బయోసైన్స్ అండ్ బయో ఇంజనీరింగ్‌లో ఎంటెక్, ఎంటెక్+పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ.
- **ఐఐటీ–హైదరాబాద్:** బీటెక్–బయోమెడికల్ ఇంజనీరింగ్; ఎంటెక్–బయో డిజైన్, బయో మెడికల్ ఇంజనీరింగ్, బయో టెక్నాలజీలో పీహెచ్‌డీ.
- **ఐఐటీ–రోపార్:** బయో మెడికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్, పీహెచ్‌డీ.
- **ఐఐటీ–మండి:** బయో ఇంజనీరింగ్‌లో బీటెక్+ ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ.
- **ఐఐటీ–వారణాసి:** బీటెక్–బయో ఇంజనీరింగ్, ఎంటెక్ బయో మెడికల్ టెక్నాలజీ; ఎంటెక్ బయో మెడికల్ ఇంజనీరింగ్; ఇవే విభాగాల్లో పీహెచ్‌డీ.
- **ఐఐటీ–పాలక్కాడ్:** బయలాజికల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ.
- **ఐఐటీ–ధర్వాడ్:** బయో సైన్స్ అండ్ బయో ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ.

అడ్వాన్స్‌డ్, జామ్, గేట్ స్కోర్లతో

మెడికల్, అనుబంధ కోర్సులను అందిస్తున్న ఐఐటీలు.. బ్యాచిలర్ స్థాయి(బీటెక్) కోర్సుల్లో జేఈఈ–అడ్వాన్స్‌డ్ ర్యాంకు ఆధారంగా; ఎమ్మెస్సీ కోర్సుల్లో జామ్/గేట్ స్కోర్ ఆధారంగా; ఎంటెక్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు గేట్ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. ఎంటెక్, ఎమ్మెస్సీ కోర్సులకు అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న స్పెషలైజేషన్‌ను ఒక సబ్జెక్ట్‌గా బీటెక్ లేదా బీఎస్సీ స్థాయిలో చదివుండాలని నిర్దేశిస్తున్నాయి. ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసిన వారిని కూడా అర్హులుగా పేర్కొంటున్నాయి. పీహెచ్‌డీ అభ్యర్థులు పీజీ స్థాయిలో సంబంధిత సబ్జెక్ట్ స్పెషలైజేషన్‌గా ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

> **కొత్త ఆవిష్కరణల దిశగా**
>
> సామాజిక అభివృద్ధికి ప్రధాన అవసరాల్లో ఒకటైన వైద్యం, ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలపై పరిశోధనలు చేసి.. కొత్త ఆవిష్కరణలు చేయాలనే ఉద్దేశంతో ఐఐటీలు అడుగులు వేస్తున్నాయి. ఈ రంగంలో ఉన్నత స్థానాలు కోరుకునే విద్యార్థులు ఈ కోర్సులపై దృష్టి సారిస్తే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుంది.
>
> –ప్రొ॥ వి.రామ్ గోపాలరావు, ఐఐటీ–ఢిల్లీ మాజీ డైరెక్టర్

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్‌బీఐలో 5008 జూనియర్ అసోసియేట్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ).. దేశ వ్యాప్తంగా 5008 జూనియర్ అసోసియేట్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్ సర్కిల్‌లో 225 జూనియర్ అసోసియేట్స్ పోస్టులు ఉన్నాయి. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 5008

» **తెలుగు రాష్ట్రాలల్లో ఖాళీల సంఖ్య:** 225

» **సర్కిల్ వారీగా ఖాళీలు:** అహ్మదాబాద్–357, బెంగళూరు–316, భోపాల్–481, బెంగాల్–376, భువనేశ్వర్–170, చండీగఢ్–225, చెన్నై–362, ఢిల్లీ–152, హైదరాబాద్–225, జైపూర్–284, కేరళ–273, లక్నో/ఢిల్లీ–631, మహారాష్ట్ర/ముంబై మెట్రో–747, మహారాష్ట్ర–50, నార్త్ ఈస్టర్న్–359. » **అర్హత:** ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. డిగ్రీ ఫైనల్/చివరి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

» **వయసు:** 01.08.2022 నాటికి 20 ఏళ్ల నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ (జనరల్/ఈడబ్ల్యూఎస్) అభ్యర్థులకు పదేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష(ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామ్), స్థానిక భాష పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుంది.

» **ప్రిలిమినరీ పరీక్ష:** పరీక్ష 100 ప్రశ్నలు 100 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్, న్యూమరికల్ ఎబిలిటీ, రీజనింగ్ సబ్జెక్టులు ఉంటాయి. పరీక్ష సమయం ఒక గంట ఉంటుంది. నెగిటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రిలిమినరీ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను మెయిన్ పరీక్షకు ఎంపికచేస్తారు.

» **మెయిన్ పరీక్ష:** మెయిన్ పరీక్ష 190 ప్రశ్నలు–200 మార్కులకు నిర్వహిస్తారు. జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్, జనరల్ ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ సబ్జెక్టులు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటల 40 నిమిషాలు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 07.09.2022

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**27.09.2022

» **ప్రిలిమినరీ పరీక్ష:** నవంబర్ 2022లో.

» **మెయిన్ పరీక్ష:** డిసెంబర్ 2022/జనవరి 2023లో » **వెబ్‌సైట్:** www.sbi.co.in

టీఎస్‌పీఎస్సీలో 23 మహిళా శిశు సంక్షేమ అధికారి పోస్టులు

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ).. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో మహిళా శిశు సంక్షేమ అధికారి పోస్టుల భర్తీకి అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.» **మొత్తం పోస్టుల సంఖ్య:** 23

» **విభాగాలు:** మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్–ఐసీడీఎస్,అడిషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐసీడీఎస్ అండ్ వేర్‌హౌస్ మేనేజర్.

» **అర్హత:** బ్యాచిలర్స్ డిగ్రీ(హోమ్ సైన్స్/సోషల్ వర్క్/సోషియాలజీ) లేదా బీఎస్సీ(ఆనర్స్–ఫుడ్ సైన్స్–న్యూట్రిషన్) లేదా బీఎస్సీ(ఫుడ్–న్యూట్రిషన్, బోటనీ/జువాలజీ–కెమిస్ట్రీ/బయోకెమిస్ట్రీ), లేదా బీఎస్సీ(అప్లైడ్ న్యూట్రిషన్–పబ్లిక్ హెల్త్, బోటనీ/జువాలజీ–కెమిస్ట్రీ) లేదా బీఎస్సీ(క్లినికల్ న్యూట్రిషన్, బోటనీ/జువాలజీ–కెమిస్ట్రీ/బయో కెమిస్ట్రీ) లేదా బీఎస్సీ (అప్లైడ్ న్యూట్రిషన్, బోటనీ/జువాలజీ–కెమిస్ట్రీ/బయోకెమిస్ట్రీ) లేదా బీఎస్సీ(ఫుడ్ సైన్సెస్–క్వాలిటీ కంట్రోల్, జువాలజీ/బోటనీ–కెమిస్ట్రీ/బయో కెమిస్ట్రీ) లేదా బీఎస్సీ(ఫుడ్ సైన్సెస్–మేనేజ్‌మెంట్, బోటనీ/జువాలజీ–కెమిస్ట్రీ), బీఎస్సీ(ఫుడ్ టెక్నాలజీ–న్యూట్రిషన్–బోటనీ/జువాలజీ–కెమిస్ట్రీ) లేదా బీఎస్సీ(ఫుడ్ టెక్నాలజీ–మేనేజ్‌మెంట్, బోటనీ/జువాలజీ–కెమిస్ట్రీ/బయోకెమిస్ట్రీ) ఉత్తీర్ణులవ్వాలి.

» **వయసు:** 01.07.2022 నాటికి 18–44 ఏళ్ల మధ్య ఉండాలి. » **జీతం:** నెలకు రూ.51,320 నుంచి రూ.1,27,310 చెల్లిస్తారు.

» **ఎంపిక:** రాతపరీక్ష (ఆబ్జెక్టివ్ టైప్) ఆధారంగా

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:**13.09.2022

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**10.10.2022

» **పరీక్ష తేది:** డిసెంబర్ 2022

» **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

ఐఐఎస్ఈఆర్, తిరుపతిలో జూనియర్ రీసెర్చ్ ఫెలో

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్)..ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 01

» **అర్హత:**కనీసం 55%మార్కులతో ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ)ఉత్తీర్ణతతోపాటు నెట్/గేట్ స్కోరు సాధించి ఉండాలి. వయసు: 28 ఏళ్లు మించకూడదు.

» **ఫెలోషిప్:** నెలకు రూ.31,000+హెచ్ఆర్ఏ

» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా

» **ఈమెయిల్:** a.bar@iisertirupati.ac.in

» **దరఖాస్తులకు చివరితేది:** 25.09.2022

» **వెబ్‌సైట్:** www.iisertirupati.ac.in

క్లుప్తంగా

కొత్తగా రెండు చోట్ల నాలుగు లేన్ల రహదారులు

పామర్రు–గుడివాడ, రాయచోటి బైపాస్ నిర్మాణానికి ఆమోదం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో రెండు చోట్ల నాలుగు లేన్ల రహదారులు అందుబాటులోకి రానున్నాయి. కృష్ణా జిల్లాలోని పామర్రు–గుడివాడ, అన్నమయ్య జిల్లాలోని రాయచోటి బైపాస్ రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయనున్నారు. గతంలో రెండు లేన్లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించిన ఈ రహదారుల్లో ట్రాఫిక్‌రద్దీ పెరిగిన దృష్ట్యా నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) ఆమోదించింది. అందుకోసం త్వరలోనే సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లో మార్పులు చేసి పనులు ప్రారంభించనుంది.

భారం వేయొద్దు

ఏపీఈఆర్‌సీ విచారణలో కోరిన వివిధ వర్గాలు

సాక్షి, అమరావతి: ప్రజలపై ట్రూ అప్ చార్జీల భారం వేయొద్దని వివిధ వర్గాల ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ)కి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలు(డిస్కంలు) 2021–22 ఆర్థిక సంవత్సరం 4వ త్రైమాసికం విద్యుత్ కొనుగోలు ఖర్చుల సర్దుబాటు కోసం ఇటీవల ఏపీఈఆర్‌సీకి దరఖాస్తు చేశాయి. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో మార్కెట్‌లో విద్యుత్‌కు డిమాండ్ పెరగడంతో రూ.1,048 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చిందని, ఈ మొత్తాన్ని బిల్లుల్లో సర్దుబాటు(ట్రూ అప్ చార్జీలు) చేసేందుకు అనుమతించాలని డిస్కంలు ప్రతిపాదించాయి. దీనిపై హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు పి.రాజగోపాల్‌రెడ్డి, ఠాకూర్ రామసింగ్ బుధవారం బహిరంగ విచారణ చేపట్టారు. పలువురు సూచనలు చేశారు. విచారణలో లేవనెత్తిన అంశాలపై వివరణ ఇచ్చేందుకు 2 వారాలు గడువు కావాలని డిస్కంలు కోరడంతో.. 'వెబ్ హియరింగ్'ను మండలి వాయిదా వేసింది.

అక్కడ తప్పించుకుని.. విజయవాడలో చిక్కిన ఖైదీ

అనకాపల్లి టౌన్: అనకాపల్లి సబ్ జైల్ నుంచి పరారైన రిమాండ్ ఖైదీ ధర్మాన ప్రసాద్‌ను విజయవాడ రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారని పట్టణ సీఐ దాడి మోహనరావు, జైల్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ బుధవారం చెప్పారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం సిరి గ్రామానికి చెందిన ధర్మాన ప్రసాద్ పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో కిడ్నాప్, అత్యాచారం కేసులో రిమాండ్ ఖైదీగా ఈ ఏడాది జూలై 17వ తేదీ నుంచి అనకాపల్లి సబ్‌జైల్‌లో ఉన్నాడు. ప్రసాద్ మంగళవారం సాయంత్రం జైలు నుంచి తప్పించుకోవడంతో పోలీసులు అతని ఫొటో అన్ని ప్రాంతాలకు పంపించి అప్రమత్తం చేశారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ప్రసాద్‌ను ఫొటో ఆధారంగా రైల్వే పోలీసులు పట్టుకున్నారు. జైలు నుంచి తప్పించుకున్న కేసులో అతడ్ని బుధవారం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

2017లో ఉద్యోగాలు కోల్పోయాం.. ఆదుకోండి

వైద్యమంత్రికి 'ఆయుష్' సిబ్బంది వినతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పలు ఆయుష్ డిస్పెన్సరీలను 2017లో మూసివేశారని.. దానివల్ల రోడ్డున పడ్డ 700 మంది సిబ్బందిని ఆదుకోవాలని ఏపీ ఆయుష్ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు వైద్య శాఖ మంత్రి విడదల రజినీని కోరారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆయుష్ డిస్పెన్సరీలు మూతవేయడంతో ఉపాధి కోల్పోయిన పారామెడికల్ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

శ్రీరామోజు హరగోపాల్‌కు కాళోజీ స్మారక పురస్కారం

సాక్షి, హైదరాబాద్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్మారక పురస్కారానికి కవి, చరిత్ర పరిశోధకుడు శ్రీరామోజు హరగోపాల్ ఎంపికయ్యారు. 2022 సంవత్సరానికి గాను ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈమేరకు సాంస్కృతిక శాఖ ఉత్తర్వు జారీ చేసింది. కాళోజీ జయంతి రోజున ఆయనకు ప్రభుత్వం తరఫున పురస్కారాన్ని అందించనున్నారు. రూ.లక్షా వేయి నూటపదహార్లు నగదు పురస్కారం, శాలువా, కాళోజీ జ్ఞాపికలను హరగోపాల్‌కు అందించనున్నారు.

'బీ' కేటగిరీ భర్తీ బాధ్యత యాజమాన్యాలదే

మెరిట్ ప్రాతిపదికన సీట్ల కేటాయింపు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీల్లో 'బీ' కేటగిరీ సీట్లను ఆయా కళాశాలలే భర్తీ చేసుకోనున్నాయి. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జీవో 32, 33 విడుదల చేసింది. ఈ సీట్ల భర్తీ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం మెరిట్ ప్రాతిపదికన జరిగేలా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంది. ఈ సీట్ల భర్తీ కోసం ఏపీ ఈఏపీసెట్ అడ్మిషన్లను నిర్వహించే సాంకేతిక విద్యాశాఖ కాంపిటెంట్ అథారిటీగా వ్యవహరించనుంది. ఈ సీట్ల భర్తీకి ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా విద్యార్థులు నేరుగా లేదా ఆయా కాలేజీలకు వెళ్లి దరఖాస్తులు సమర్పించవచ్చు. కాలేజీలకు అందిన దరఖాస్తుల్లో మెరిట్ విద్యార్థులను ఆయా సీట్లకు ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేయాలి. ఈ ప్రక్రియ అంతా అందరికీ తెలిసేలా ఎప్పటికప్పుడు నిర్దేశిత పోర్టల్‌లో వివరాలు పొందుపరుస్తారు. మొత్తం సీట్లలో 70 శాతం 'ఏ' కేటగిరీ కింద కన్వీనర్ ద్వారా ప్రభుత్వం భర్తీ చేస్తుంది. మిగతా 30 శాతంలో సగం సీట్లను ఎన్నారై కోటాలో ఆయా కాలేజీలు భర్తీ చేసుకోవచ్చు. వాటిలో మిగిలిన సీట్లను, నాన్ ఎన్నారై సీట్లను ఈ ప్రత్యేక పోర్టల్ ద్వారా భర్తీ చేస్తారు. ఎన్నారై సీట్లకు 5 వేల డాలర్లను, నాన్ ఎన్నారై సీట్లకు 'ఏ' కేటగిరీకి నిర్ణయించిన ఫీజులకు మూడు రెట్ల వరకు ఆయా కాలేజీలు వసూలు చేయవచ్చు.

బీ కేటగిరీ భర్తీ మార్గదర్శకాలు ఇలా:

- ఏపీ ఈఏపీసెట్ అడ్మిషన్ల కమిటీ నోటిఫికేషన్ జారీ చేసే వరకు బీ కేటగిరీ సీట్లను భర్తీ చేయడానికి వీల్లేదు. కమిటీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే అడ్మిషన్ ప్రక్రియ చేపట్టాలి.
- ఏఐసీటీఈ అనుమతి ఉన్న సంస్థలు ఆయా కోర్సులకు మంజూరైన ఇన్‌టేక్‌లో 15 శాతం మించకుండా ఎన్‌ఆర్‌ఐ సీట్లను సొంతంగా భర్తీ చేయవచ్చు. గ్రూప్ సబ్జెక్టులలో 50 శాతం మార్కులకు తగ్గకుండా లేదా అర్హత పరీక్షలో 50 శాతం మార్కులతో లేదా 10 స్కేల్‌లో 5కి సమానమైన క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ యావరేజ్ ఉన్న విద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులు.
- మిగిలిన సీట్లను మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేస్తారు. జేఈఈ మెయిన్, నీట్‌లో ర్యాంక్ సాధించిన వారు, అర్హత పరీక్షలో నిర్దేశిత గ్రూప్ సబ్జెక్టులలో 45 శాతం మార్కులకు తక్కువ కాకుండా సాధించిన వారు, ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వారితో సహా అందరు అభ్యర్థులను ఎంపిక చేయవచ్చు.
- జేఈఈ, నీట్ ర్యాంకర్లు లేని పక్షంలో మెరిట్ ప్రాతిపదికన ఈఏపీ సెట్ పరీక్షలో అర్హత సాధించిన అర్హులైన అభ్యర్థులతో భర్తీ చేయాలి.

వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.

- విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని కాలేజీల్లో 'బీ' కేటగిరీ సీట్లకు దరఖాస్తు చేసుకునే విధంగా కాంపిటెంట్ అథారిటీ షెడ్యూల్ ప్రకటిస్తుంది.
- ఎంపిక ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత సంబంధిత కళాశాల యాజమాన్యం ఆ జాబితాను లాగిన్ ద్వారా వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ఎంపికలు నిబంధనలకు విరుద్ధంగా ఉంటే జాబితాను తిరస్కరిస్తారు.
- ఆ తర్వాత ఏవైనా సీట్లు ఇంకా మిగిలిపోతే, నిర్దేశించిన గ్రూప్ సబ్జెక్టులలో 45 శాతం (రిజర్వుడు) కేటగిరీలకు చెందిన అభ్యర్థులైతే 40 శాతం) మార్కులను లేదా మొత్తం మార్కులలో ఆ మేరకు మార్కులు పొందిన అభ్యర్థులతో మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయాలి.
- వెబ్ పోర్టల్ ద్వారా కేటగిరీ 'బీ' సీట్ల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. కళాశాలకు వెళ్లి అందచేసే దరఖాస్తులను యాజమాన్యాలు

బంగాళాఖాతంలో నేడు అల్పపీడనం

- తూర్పు మధ్య, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
- 6 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం.. ఐఎండీ హెచ్చరిక

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: తూర్పు మధ్య, దానికి ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో గురువారం ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది తీవ్ర అల్పపీడనంగా బలపడే అవకాశాలున్నాయని తెలిపింది. దీని ప్రభావంతో వచ్చే 2, 3 రోజులు రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలు పడనున్నాయి. ఉత్తరాంధ్రపై దీని ప్రభావం ఎక్కువగా ఉండనుంది. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. గురువారం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆరెంజ్ వార్నింగ్‌ను జారీ చేసింది. 10వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ఇప్పటికే సముద్రంలో వేటకు వెళ్లిన వారు తిరిగి వెనక్కి రావాలని సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు నీట మునిగే అవకాశం ఉందని, రవాణా వ్యవస్థకు అంతరాయం కలుగుతుందని, చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయే ప్రమాదం ఉందని ఐఎండీ తెలిపింది. వరి, అరటి పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపింది. వీటిని దృష్టిలో ఉంచుకుని యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని చెప్పింది. ప్రజలు శిథిల భవనాలు/ఇళ్లలో ఉండవద్దని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. చెరువులు, కాలువలు, నదులు, విద్యుత్ స్తంభాలు, వైర్లకు దూరంగా ఉండాలని సూచించింది.

పోస్టాఫీస్‌లో రూ.2కోట్లు గోల్‌మాల్!

- విజయవాడ కృష్ణలంక పోస్ట్‌మాస్టర్ మాయాజాలం
- డిపాజిట్‌దారులకు ఇబ్బంది లేదన్న విచారణాధికారి

కృష్ణలంక(విజయవాడ తూర్పు) : విజయవాడలోని కృష్ణలంక పోస్టాఫీస్‌లో ప్రజల నుంచి డిపాజిట్ల రూపంలో సేకరించిన సుమారు రూ.2కోట్ల నగదును పోస్ట్‌మాస్టర్ దారిమళ్లించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కృష్ణలంక పోస్టాఫీస్‌లో పోస్ట్‌మాస్టర్‌గా మనోజ్ 2021, మే నెలలో బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత కొద్ది కాలం నుంచి కృష్ణలంక పోస్టాఫీస్ ఖాతాలో నగదు నిల్వలు పెద్ద మొత్తంలో కనిపిస్తున్నప్పటికీ హెడ్ పోస్టాఫీసులో జమ కాకపోవడంపై ఉన్నతాధికారులకు అనుమానం వచ్చి విచారణ చేపట్టారు. ప్రజల నుంచి సేకరించిన డిపాజిట్ల నగదును హెడ్ పోస్టాఫీసులో జమ చేయకుండా తన అవసరాల కోసం వివిధ రూపాల్లో దారి మళ్లించినట్లు పోస్ట్‌మాస్టర్ మనోజ్ అంగీకరించారు. దీంతో ఆయన్ను సస్పెండ్ చేశారు. ఎంత నగదు దారిమళ్లించారు, అది ఏయే ఖాతాలకు చెందినది అనే వివరాలు తెలుసుకునేందుకు రికార్డులు పరిశీలిస్తున్నామని విచారణాధికారి ఏఎస్పీ శివరామప్రసాద్ బుధవారం తెలిపారు. డిపాజిట్‌దారులకు ఇబ్బందిలేదని, పాస్‌బుక్‌లో ఎంట్రీ చేసి స్టాంప్ వేసి ఉంటే వారికి తప్పనిసరిగా నగదును పోస్టల్ శాఖ చెల్లిస్తుందని చెప్పారు. వివిధ పథకాల రూపంలో నగదు డిపాజిట్ చేస్తున్న ప్రజలు పోస్టాఫీస్ వద్ద క్యూ కట్టారు. విచారణలో భాగంగా డిపాజిట్‌దారుల పాస్‌బుక్‌లను అధికారులు తీసుకుని రశీదులు ఇస్తున్నారు. సుమారు రూ.2కోట్ల మేర నగదు పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది.

సెల్ఫీ సరదాకు యువకుడి బలి



మన్నం మణి

దర్శి: సెల్ఫీ సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది. ప్రకాశం జిల్లా దర్శి మండలంలోని తూర్పుచౌటపాలెం గ్రామంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. తూర్పుచౌటపాలేనికి చెందిన మన్నం మణి (18) తమ గ్రామానికి సమీపంలోని సాగర్ కాలువ వద్ద సెల్ఫీ తీసుకునేందుకు స్నేహితులతో కలిసి వెళ్లాడు. మణి సెల్ఫీ తీసుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తూ కాలు జారి కాలువలో పడిపోయాడు. అతనికి ఈత రాకపోవడంతో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి మృతిచెందాడు. మణిని స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నం చేసినా, నీటి ప్రవాహ ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఫలితం లేకపోయింది. మణి మృతితో తూర్పుచౌటపాలెం గ్రామంలో విషాదం నెలకొంది.

వాయు కాలుష్యాన్ని నియంత్రించాలి

మంత్రులు పెద్దిరెడ్డి, ఆదిమూలపు

సాక్షి, అమరావతి: వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు, గాలిలో స్వచ్ఛతను పెంచేందుకు నిర్దేశించిన నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులను మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆదిమూలపు సురేష్ ఆదేశించారు. సచివాలయంలో బుధవారం 'నేషనల్ క్లీన్ ఎయిర్'పై పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ సమీక్ష నిర్వహించారు. కాలుష్య నియంత్రణ మండలి, పట్టణాభివృద్ధి శాఖ అధికారులు, మునిసిపల్ కమిషనర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. క్లీన్ ఎయిర్ కార్యక్రమంలో రాష్ట్రం ముందంజలో ఉండేలా పనిచేయాలని మంత్రులు ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం రాష్ట్రంలోని 13 నగరాలు, పట్టణాలను గుర్తించిందన్నారు. కేంద్రం ద్వారా వస్తున్న నిధులను వినియోగించుకుంటూ.. నగరాలు, పట్టణాల్లో హాట్‌స్పాట్‌లను గుర్తించి కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశ్రామిక కాలుష్యాన్ని సాధ్యమైనంత వరకు నియంత్రించాలని ఆదేశించారు.

ఆరా తీస్తూ.. అండగా నిలుస్తూ



నంద్యాల జిల్లా శ్రీశైలంలో మహిళకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



అల్లూరి సీతారామరాజు జిల్లా తూర్పూరులో గ్రామస్తులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అన్ని జిల్లాల్లోనూ ఉత్సాహభరితంగా సాగుతోంది. కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటివద్దా ఘన స్వాగతం లభిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. పథకాల లబ్ధి గురించి ప్రజలకు వివరించారు. తమ దృష్టికి వచ్చిన చిన్న చిన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.



ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో సంక్షేమ పథకాల అమలు తీరుపై స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

మళ్లీ కుంగిన భూమి



కుంగిన భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ గంగయ్య

పొలంలో భారీ గొయ్యి ■ వైఎస్సార్ జిల్లా బయనపల్లిలో ఘటన

చింతకొమ్మదిన్నె

వైఎస్సార్ జిల్లా చింతకొమ్మదిన్నె మండలంలో భూమి మళ్లీ కుంగుతోంది. బుధవారం ఉదయం బయనపల్లి సమీపంలో రైతు తుమ్మల త్రిమూర్తి రెడ్డికి చెందిన వ్యవసాయ పొలంలో భూమి ఒక్కసారిగా కుంగి బావి తరహాలో గొయ్యి ఏర్పడింది. రైతు ఈ విషయాన్ని తహసీల్దార్ గంగయ్యకు తెలియజేశారు. తహసీల్దార్, వీఆర్వో, సచివాలయ సర్వేయర్ గొయ్యి ఏర్పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని తహసీల్దార్ చెప్పారు.

వర్షం లేకపోయినా...

నాలుగేళ్ల కిందట మండలంలోని నాయనోరిపల్లి , పెద్ద ముసల్‌రెడ్డి పల్లి, బుగ్గ మల్లేశ్వర ఆలయం, గూడవాండ్లపల్లి, బుగ్గలపల్లి గ్రామాల్లో ఇదే తరహాలో భూమి కుంగి గోతులు ఏర్పడ్డాయి. అప్పట్లో గోతులను పరిశీలించిన నిపుణులు భారీ వర్షాలకు భూమిలో ఉన్న సున్నపు రాయి కరిగి కుంగిపోతున్నట్లు ప్రకటించారు. కానీ, ప్రస్తుతం వర్షం కురవకపోయినా బయనపల్లి గ్రామ సమీపంలోని పొలంలో భారీ గొయ్యి ఏర్పడటంతో రైతులు, పశువులకాపరులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

• ఈఫిల్‌ను రాత్రిపూట ఫొటో తీయాలంటే పర్మిషన్ కావాలి..



పారిస్ వెళ్లినవాళ్లెవ్వరైనా ఈఫిల్ టవర్ దగ్గరకు వెళ్లకుండా ఉండరు. అందులోనూ రాత్రిపూట పారిస్ వెలుగుల్లో ఈఫిల్ టవర్ అందాన్ని ఆస్వాదించడం అద్భుతమైన అనుభవం. అయితే పగలైనా రాత్రైనా సాధారణ వ్యక్తులు ఫొటోలు తీసుకుంటే ఓకే. కానీ.. రాత్రిపూట ఈఫిల్ అందాలను పట్టి బంధించడానికి వీల్లేదు. పొద్దంతా తీసిందొక లెక్క... రాత్రిపూట తీసిందో లెక్క అంటున్నారు నిర్వాహకులు. సాధారణ సందర్శకులు ఫోన్స్‌లోనూ, కెమెరాల్లోనూ ఫొటోలు తీసుకుంటే ఓకే. కానీ.. ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ రాత్రిపూట ఫొటోస్ తీయడానికి మాత్రం పర్మిషన్ తీసుకోవాలి. ఎందుకంటే రాత్రిపూట వెలిగే లైట్స్‌పై కాపీరైట్ ఉందన్నమాట. పబ్లిష్ చేయడానికైనా, సర్క్యులేట్ చేయడానికైనా ప్రొఫెషనల్స్ ఈఫిల్ టవర్ మేనేజ్‌మెంట్ కంపెనీ నుంచి అనుమతి తీసుకోవాలని toureiffel. paris పేర్కొంది. ఈఫిల్ టవర్‌పై రోజూ 20వేల బల్బులు కాంతులీనుతాయి. టవర్‌పైన ఉన్న దీపస్తంభం అయితే మరింత ప్రత్యేకమైనది.

• ఏం సార్.. గోక్కోవడం కూడా తప్పేనా..



మనుషులకు దురదేస్తే ఏం జరుగుతుంది.. ఏమీ జరగదు.. గోక్కుంటారు అంతే.. మరి ఏనుగుకు దురదేస్తే ఏం జరుగుతుంది? ఏదో ఒకదానికి రుద్దుతుంది. ఇక్కడ వంతు ఈ కారుది. ఎక్కడ జరిగిందన్న విషయం తెలియనప్పటికీ.. దీన్ని ట్విట్టర్‌లో షేర్ చేస్తే.. జనం తెగ చూశారు.. చూడటమే కాదు.. తెగ నవ్వుకున్నారు కూడా.. మీరే ఏనుగై.. మీకు దురదేస్తే.. ఏం చేస్తారు అన్న క్యాప్షన్‌తో దీన్ని షేర్ చేయడంతో రకరకాల ఫన్నీ కామెంట్లు కూడా పెట్టారు. గజరాజు ఈ కారును టాయిలెట్ పేపర్ కింద వాడుకున్నట్లు ఉంది అని ఒకరు వ్యాఖ్యానించారు. గోక్కోవడం తప్ప.. దాడిలాంటిది ఏనుగు చేయకపోవడంతో ఆ సమయంలో కారులో ఉన్నవారు సురక్షితంగా బయటపడ్డారు.

సామాజిక సేవకు పునరంకితం కావాలి

పారిశ్రామికవేత్తలకు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

సాక్షి, అమరావతి : సామాజిక సేవకు పారిశ్రామికవేత్తలు పునరంకితం కావాలని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పిలుపునిచ్చారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా సీఐఐ యంగ్ ఇండియన్స్ సంస్థ విజయవాడలోని రాజ్‌భవన్‌లో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగిస్తూ.. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత కావాలన్నారు. సీఐఐ యంగ్ ఇండియన్స్ వేడుకల చైర్మన్ మండవ సందీప్ మాట్లాడుతూ ఏడువేల మంది యువత, విద్యార్థులను భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఐఐ యంగ్ ఇండియన్స్ ఏపీ శాఖ అధ్యక్షుడు బెనర్జీ, సహాధ్యక్షురాలు వందన, పూర్వపు చైర్మన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సీఐఐ యంగ్ ఇండియన్స్ వెదురు, గడ్డితో తయారు చేసిన దుస్తులను గవర్నర్ ఆవిష్కరించారు.



క్రీడాకారులను సత్కరించిన గవర్నర్

మనకు గర్వకారణం

రాష్ట్ర క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరుస్తుండటం గర్వకారణమని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రశంసించారు. కామన్‌వెల్త్–2022, ఆర్చరీ ప్రపంచ కప్, ప్రపంచ క్రీడలు–2022లలో పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, జ్యోతి సురేఖలను విజయవాడ రాజ్‌భవన్‌లో గవర్నర్ సత్కరించి మొమెంటోలు అందించారు.

హైదరాబాద్‌లో పొద్దంతా వాన



సాక్షి, హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్: తెలంగాణలో మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. చాలాచోట్ల ఓ మోస్తరు వర్షం కురియగా.. పలు ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వానలు పడ్డాయి. హైదరాబాద్‌లో అయితే బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రిదాకా వర్షం పడుతూనే ఉంది. పలుచోట్ల నాలుగు నుంచి ఆరు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. దాదాపు వంద కూడళ్ల వద్ద ట్రాఫిక్ స్తంభించిపోయింది. మూసీలో వరద పోటెత్తడంతో మూసారాంబాగ్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేశారు. గురు, శుక్రవారాల్లోనూ రాష్ట్రంలోని చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని.. కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించింది.

నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక చొరవ

ఏపీ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఎండీ సత్యనారాయణ



వరదయ్యపాలెం: రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని ఏపీ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఎండీ సత్యనారాయణ అన్నారు. ఈ దిశగా రాష్ట్రవ్యాప్తంగా స్కిల్ హబ్‌లు, కాలేజీల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఆయన చిత్తూరు జిల్లాలోని శ్రీసిటీలో పర్యటించి నైపుణ్యం కలిగిన మానవశక్తి, శిక్షణ అవసరాలపై పరిశ్రమల సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. పారిశ్రామిక ఉత్పాదక రంగాల్లో ఎలాంటి నైపుణ్యాలు.. ఎంత మేరకు అవసరమో గుర్తించడానికి సమీక్ష నిర్వహించామన్నారు. పరిశ్రమల అవసరాలకనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) వివిధ ట్రేడ్‌ల్లో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోందని తెలిపారు. తద్వారా యువత తగిన నైపుణ్యాలతోపాటు ఉద్యోగాలు పొందొచ్చన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీ రామకోటిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 26 స్కిల్ కాలేజీలు, ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎస్‌ఎస్ సోని, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ సి.రమేష్ కుమార్, హెచ్‌ఆర్‌డీ మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.